నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 4.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 || సంచిక (Issue): 120 || వెల (Price) రూ.6.50 | PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD | www.ntnews.com /ntdailyonline

సినీ తారల, రాజకీయ ప్రముఖుల వ్యక్తిత్వంపై బురద చల్లుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు జాతీయస్థాయిలో దుమారం రేపుతున్నాయి. ఆమె వ్యాఖ్యలను సినీ, రాజకీయరంగ ప్రముఖులు, ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. కొండా సురేఖ పేరును నేరుగా ప్రస్తావిస్తూ ఆమె వ్యాఖ్యలపై తెలుగు చిత్రసీమ ఘాటుగా స్పందించింది. సినీతారల వ్యక్తిగత జీవితంపై చెత్త మాటలు మాట్లాడొద్దంటూ స్పష్టంచేసింది. అభిమాన సంఘాలు సైతం కొండా వ్యాఖ్యలపై మండిపడ్డాయి. పలుచోట్ల మంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశాయి. మరోవైపు తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగిందని పేర్కొంటూ టాలీవుడ్ నటుడు నాగార్జున సురేఖపై పరువు నష్టం దావా వేశారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో ఆయన ఫిర్యాదు చేశారు.

సురేఖపై టాలీవుడ్ ఆగ్రహం



మంత్రిపై నాగార్జున పరువునష్టం దావా

- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు
- సెక్షన్ 356 కింద చర్యలు తీసుకోవాలని వినతి
- పలుచోట్ల కొండా సురేఖ దిష్టిబొమ్మల దహనం
- నీచస్థాయికి దిగజారడం సిగ్గుచేటు: చిరంజీవి > 7
- నిరాధారమైన ఆరోపణలు చేయొద్దు: రాజమౌళి
- ఖండించిన మహేశ్, ఎన్టీఆర్, వెంకటేశ్ తదితరులు
- సురేఖపై బీఆర్ఎస్ కార్పొరేటర్ల పోలీస్ కంప్లయింట్
- జాతీయ మహిళా కమిషన్‌కు తుల ఉమ ఫిర్యాదు

...అయినా మంత్రి మారలేదు

మరోసారి మంత్రి సురేఖ అనుచిత వ్యాఖ్యలు

తప్పయిందంటూ ఉదయం మాటలు వెనక్కి

అంతలోనే చైతన్య, సమంతపై మళ్లీ అవే వ్యాఖ్యలు

'కోపం వచ్చింది.. మాట్లాడిన' అంటూ సమర్థింపు



హైదరాబాద్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): 'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్టుగా తయారైంది మంత్రి కొండా సురేఖ తీరు. బుధవారం సినీ నటుడు నాగార్జున కుటుంబంపై ఆమె చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగిన విషయం తెలిసిందే. అవి సద్దుమణగక ముందే మళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేశారు. తన వ్యాఖ్యలపై ఇంటాబయట విమర్శలు రావడంతో దిగొచ్చిన > 7వ పేజీలో




మీ రాజకీయ మైలేజీ కోసం నా పేరును వాడొద్దు

బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఓ మహిళ మరో మహిళపై వ్యాఖ్యలు చేయడం ఎంతగానో బాధించింది. మేమంతా మౌనంగా ఉండటాన్ని బలహీనతగా భావిస్తున్నారు. నాకు ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు. మీ రాజకీయ మైలేజీ కోసం నా పేరును ఉపయోగించవద్దు. కళాకారులను రాజకీయ వికృత క్రీడలో భాగం చేయొద్దు. సంచలనాల కోసం వారిపై కల్పిత కథనాలను సృష్టించవద్దు. - రకుల్‌ప్రీత్ సింగ్

ఇజ్రాయెల్ బహుముఖ యుద్ధం

- ఇప్పటికే హమాస్, హెజ్బొల్లాతో పోరు
- నేరుగా తలపడేందుకు సిద్ధమైన ఇరాన్
- యెమెన్ నుంచి దాడులు చేస్తున్న హౌతీలు
- ఇరాక్, సిరియా మిలీషియాలతో తలనొప్పి
- పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు అనేక సవాళ్లు

వివిధ దేశాలతో ఇజ్రాయెల్ బహుముఖ పోరు ఇలా..



జెరూసలేం, అక్టోబర్ 3: సరిగ్గా ఏడాది క్రితం అక్టోబరు 7న అర్ధరాత్రి ఇజ్రాయెల్‌పై గాజా స్ట్రిప్ నుంచి హమాస్ విరుచుకుపడింది. రాకెట్ దాడులతో పాటు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి దాడి చేసి వందలాది మందిని హతమార్చింది. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ కన్నెర్ర చేసి ప్రతిదాడికి దిగింది. ఏడాది క్రితం కేవలం హమాస్‌తో ప్రారంభమైన ఇజ్రాయెల్ పోరాటం అనేక శక్తులతో ఆరు వైపులా పోరాడాల్సిన స్థితిలోకి వెళ్లింది. దీంతో 2006 తర్వాత ఇప్పుడు మరోసారి ఇజ్రాయెల్ భారీ బహుముఖ యుద్ధాన్ని చేయాల్సి వస్తున్నది.

గాజాలో హమాస్‌తో పోరాటం

గాజాలో హమాస్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టే దిశగా ఇజ్రాయెల్ ఏడాది నుంచి దాడులు చేస్తున్నది. హమాస్ స్థావరాలపై నిత్యం గగనతల దాడులు చేస్తున్నది. వేలాదిగా ఇజ్రాయెల్ బలగాలు గాజాలో భూతల దాడులు చేస్తున్నాయి. ఏడాదిగా జరుగుతున్న ఈ దాడుల్లో దాదాపు 50 వేల మంది మరణించినా ఇప్పటికీ ఒక పరిష్కారం దొరకడం లేదు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ పౌరులను విడిపించుకునేందుకు ఇజ్రాయెల్ పోరాటం ఇంకా కొనసాగుతున్నది.

హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్

హమాస్‌కు మద్దతుగా ఏడాది కాలంగా ఇజ్రాయెల్‌పై లెబనాన్ నుంచి హెజ్బొల్లా దాడులకు పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా హెజ్బొల్లాను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంది. హెజ్బొల్లా చీఫ్ నస్రల్లాను హతమార్చింది. ఒకవైపు గగనతల దాడులు చేస్తూనే లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లి భూతల దాడులు ప్రారంభించింది. హెజ్బొల్లాకు సైతం వేల సంఖ్యలో సైనిక బలం ఉండటం, పెద్ద ఎత్తున ఆయుధాలు ఉండటంతో ఈ పోరాటం మరింత తీవ్రరూపం దాల్చనుంది.

యెమెన్ నుంచి హౌతీల దాడులు

యెమెన్‌లోని చాలా ప్రాంతాలను ఆధీనంలో ఉంచుకున్న హౌతీ తిరుగుబాటుదారులు సైతం ఇజ్రాయెల్‌ను శత్రువుగా ప్రకటించారు. హమాస్, హెజ్బొల్లాకు ఉన్నట్టుగానే హౌతీలకూ ఇరాన్ మద్దతు ఉంది. దీంతో తరచూ ఇజ్రాయెల్‌పై హౌతీలు డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు దక్షిణ వైపు సరిహద్దుల్లో, జలమార్గాల్లో హౌతీలతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో హౌతీలపైనా ఇజ్రాయెల్ పోరాడుతున్నది.

ఇరాక్, సిరియా నుంచి మిలీషియాలు..

సిరియా, ఇరాక్ కేంద్రంగా పని చేస్తున్న మిలీషియాలు సైతం ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నాయి. వీటికి సైతం ఇరాన్ మద్దతు ఉందని, ఇరాన్ నుంచి ఆయుధాలు అందుతున్నాయని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్నది. సిరియా నుంచి మిలీషియాలు ఇటీవల తరచూ ఇజ్రాయెల్‌పై డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. ఇజ్రాయెల్ సైతం సిరియా రాజధాని డమాస్కస్‌లోని మిలీషియా కేంద్రాలపై దాడులు చేస్తున్నది.

వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్ల సమస్య

ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో మిలిటెంట్లు చురుగ్గా ఉన్నారు. వీరికి ఇరాన్ మద్దతు ఉందని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్నది. వెస్ట్‌బ్యాంక్‌లో మిలిటెంట్లు, ఇజ్రాయెల్ బలగాలు మధ్య తరచూ దాడులు జరుగుతుంటాయి. పాలస్తీనాతో పాటు ఇజ్రాయెలీలు నివసించే ఈ ప్రాంతంలో మిలిటెంట్లతో పోరాటం ఇజ్రాయెల్‌కు సమస్యాత్మకంగా మారింది.

నేరుగా యుద్ధానికి ఇరాన్ సిద్ధం

గత ఏడాదికాలంగా ఇజ్రాయెల్ వ్యతిరేక శక్తులకు పరోక్షంగా అండగా ఉంటున్న ఇరాన్ ఇప్పుడు నేరుగా రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్‌పై ఒకేసారి 180 క్షిపణులతో విరుచుకుపడి యుద్ధానికి సిద్ధమని చెప్పకనే చెప్పింది. ఈ దాడితో ఇరాన్ చాలా పెద్ద తప్పు చేసిందని, ఇందుకు మూల్యం చెల్లించుకోవాల్సిందేనని ఇజ్రాయెల్ సైతం ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య పోరు తీవ్రం కానుంది. మిగతా అన్ని మిలిటెంట్ సంస్థలతో పోరాటం ఒక సవాల్ అయితే, నేరుగా ఇరాన్‌తో పోరాటం ఇజ్రాయెల్‌కు పెద్ద సవాల్‌గా మారనుంది.

హమాస్ ప్రభుత్వాధినేత హతం

- మరో ఇద్దరు కీలక నేతలు సైతం
- ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటన
- సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి
- 9 మంది మృతి.. 14 మందికి గాయాలు
- టెల్ అవీవ్‌పై డ్రోన్లతో హౌతీల దాడి

జెరూసలేం, అక్టోబర్ 3: మూడు నెలల క్రితం జరిపిన ఓ దాడిలో గాజాస్ట్రిప్‌లో హమాస్ ప్రభుత్వాధినేత రౌహి ముష్తాహను హతమార్చినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీతో కలిసి ఈ దాడి చేశామని, ఇందులో రౌహితో పాటు హమాస్ పొలిటికల్ బ్యూరో భద్రత బాధ్యతలు చూసే సమేహ్ అల్ సిరాజ్, కమాండర్ సమీ ఔదేహ్‌ను హతమార్చినట్టు వెల్లడించింది. హమాస్ సీనియర్ నేతల్లో ముష్తాహ ఒకరని, హమాస్ ఉగ్రనేత యాహ్యా సిన్వర్‌కు కుడిభుజంగా అతడిని భావిస్తారని తెలిపింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి పాల్పడి, 1,205 మంది ఇజ్రాయెలీలను హతమార్చింది. అప్పటి నుంచి గాజాపై దాడులను ప్రారంభించిన ఇజ్రాయెల్ వేలాదిమంది హమాస్ మిలిటెంట్లతో పాటు కీలక నేతలను మట్టుబెట్టింది.



ఇజ్రాయెల్ దాడుల అనంతరం బీరుట్‌లోని ఓ ప్రాంతంలో వెలువడుతున్న పొగ



రౌహి ముష్తాహ

లెబనాన్ పార్లమెంటు సమీపంలో దాడి

లెబనాన్‌లోని సెంట్రల్ బీరుట్‌లో గురువారం తెల్లవారుజామున ఓ అపార్ట్‌మెంట్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ప్రధానమంత్రి కార్యాలయం, పార్లమెంటు, ఐరాస కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరిగిన ఈ పేలుడులో తొమ్మిది మంది మరణించారు. మరో 14 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో హెజ్బొల్లా సభ్యులతో పాటు సాధారణ ప్రజలు, సహాయక చర్యల్లో ఉన్న వైద్య సిబ్బంది కూడా ఉన్నారు. బెల్జియంకు చెందిన ఇద్దరు జర్నలిస్టులకు ఈ ఘటనలో గాయాలయ్యాయి. కాగా, పేలుడు తర్వాత సల్ఫర్ లాంటి వాసన వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు. దీంతో ఇజ్రాయెల్ ఫాస్ఫరస్ బాంబులను ఉపయోగిస్తున్నదని లెబనాన్ అధికారిక జాతీయ వార్తా సంస్థ ఆరోపించింది. బుధవారం దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా జరిపిన దాడిలో ఎనిమిది మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించడంతో దాడుల తీవ్రతను ఇజ్రాయెల్ మరింత పెంచింది. కాగా, ఉత్తర ఇజ్రాయెల్‌లోని ఆ దేశ సైనికులు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాదాపు 20 క్షిపణులు, రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. దక్షిణ లెబనాన్‌లో మరౌన్ అల్‌రౌస్‌లో ఇజ్రాయెల్ సైనికుల బృందంపై బాంబు దాడి చేశామని పేర్కొన్నది. ఈ దాడిలో ఇజ్రాయెల్ సైనికులు కొందరు మరణించారని తెలిపింది.

టెల్ అవీవ్‌పై హౌతీల దాడి

ఇజ్రాయెల్ ప్రధాన నగరం టెల్ అవీవ్‌పై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్లతో దాడి చేశారు. గురువారం ఉదయం టెల్ అవీవ్‌లోని తమ కీలక లక్ష్యాలపై డ్రోన్‌లతో దాడులు చేసినట్టు హౌతీలు ప్రకటించారు. తమ దాడి విజయవంతమైందని, డ్రోన్లు లక్ష్యాలను చేరుకున్నాయని పేర్కొన్నారు.

కాల్పుల విరమణకు అంగీకరించిన వెంటనే నస్రల్లా హత్య

ఇజ్రాయెల్ దాడిలో హెజ్బొల్లా చీఫ్ హస్సన్ నస్రల్లా మృతికి ముందు జరిగిన సంఘటనలపై లెబనాన్ విదేశాంగ మంత్రి అబ్దల్లా బౌ హబీబ్ కీలక విషయాలు వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, హెజ్బొల్లా చీఫ్ నస్రల్లా అంగీకరించినట్టు చెప్పారు. నస్రల్లాను లెబనాన్ హౌజ్ స్పీకర్ నబిహ్ బెర్రీ సంప్రదించగా కాల్పుల విరమణకు ఆయన అంగీకరించారని తెలిపారు. నెతన్యాహూ సైతం 21 రోజుల కాల్పుల విరామణకు అంగీకరించారని అన్నారు. అయితే, నెతన్యాహూ మనసు మార్చుకొని పోరాటాన్ని కొనసాగించాలని బలగాలకు చెప్పారని, తర్వాత నస్రల్లాను హతమార్చారని తెలిపారు.

ఇరాన్ హిట్ లిస్టులో నెతన్యాహూ

ఒకవైపు ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నదనే వార్తల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను ఇరాన్ తన హిట్‌లిస్టులో చేర్చిందని తెలుస్తున్నది. నెతన్యాహూతో పాటు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్, ఆ దేశ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల కమాండర్లు ఇరాన్ హిట్‌లిస్టులో ఉన్నారని పేర్కొంటూ ఒక పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ హిట్‌లిస్టుపై ఇజ్రాయెల్ స్పందించలేదు. అయితే, తమ లక్ష్యం నెతన్యాహూ కాకపోవచ్చని, ఇతర ఇజ్రాయెల్ సీనియర్ లీడర్లను లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొన్నాయి.

హిమాచల్‌లో టాయ్‌లెట్ ట్యాక్స్



మొదటిపేజీ తరువాయి...

చేస్తాయి. కానీ, హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారు మాత్రం తిరోగమన దిశలో వెళ్తున్నది. మరుగుదొడ్లు నిర్మించుకోవడమే ప్రజలు చేసిన తప్పు అన్నట్టుగా భారం మోపుతున్నది.

టాయ్‌లెట్ల సంఖ్యను బట్టి ట్యాక్స్

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. ఉద్యోగులకు సమయానికి వేతనాలు కూడా ఇవ్వలేని స్థితికి కాంగ్రెస్ సర్కారు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆదాయం పెంచుకునేందుకు ఇంతవరకు వినని టాయ్‌లెట్ ట్యాక్స్‌ను ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. మరుగుదొడ్లపై పన్నులను వసూలు చేయాలని గురువారం అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో టాయ్‌లెట్ సీటుకి నెలకు రూ.25 చొప్పున ప్రజల నుంచి వసూలు చేయాలని ఆదేశించింది. ఎన్ని టాయ్‌లెట్లు ఉంటే అన్నింటికీ ఈ పన్ను చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. ఇంతకుముందు ఇక్కడ నీటి బిల్లులు కూడా ఉండేవి కాదు. ఈ నెల నుంచే ప్రభుత్వం నెలకు రూ.100 చొప్పున నీటి బిల్లును అమలులోకి తీసుకొచ్చింది. ఇందులో రూ.30 సీవరేజి బిల్లు కాగా, మిగతాది నీటి వినియోగానికి విధిస్తుంది. హిమాచల్ ప్రదేశ్‌లో దాదాపు 10 లక్షల మంది ప్రజలు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిపై ఈ కొత్త పన్నుల భారం పడనుంది.

బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లతో టైప్-1 డయాబెటిస్

లండన్, అక్టోబర్ 3: బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లతో టైప్-1 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉన్నదని యూకేలోని కార్డిఫ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. బ్యాక్టీరియాలోని కొన్ని ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తాయని.. కిల్లర్ టీ సెల్స్ తీవ్రంగా ప్రభావితం అవుతాయని వివరించారు. బ్యాక్టీరియా కణాలను చంపే క్రమంలో కిల్లర్ టీ సెల్స్ కొన్ని సందర్భాల్లో ఇన్సులిన్ ప్రొటీన్ ఉత్పత్తి చేసే కణాలను కూడా చంపుతాయని వెల్లడించారు.

కులం ఆధారంగా పనులు కేటాయించొద్దు

జైళ్లలో వివక్షపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: కుల వివక్ష కలిగిన సుమారు 11 రాష్ర్టాల జైళ్ల నియమావళులను సుప్రీంకోర్టు గురువారం పక్కన పెట్టింది. కులాల ఆధారంగా ఖైదీలకు ప్రత్యేక వార్డులు, పనులు కేటాయించే పద్ధతిని నిరాకరించింది. వివక్షను నిరోధించే బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని తెలిపింది. 'ఇలాంటి నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం. రాష్ర్టాలు తమ జైళ్ల నియమావళుల్లో మార్పులు చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది.

స్పేస్ అంబాసిడర్‌గా తెలంగాణ యువకుడు



హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ స్పేస్ రిసెర్చ్ మిషన్‌కు తెలంగాణ యువకుడు ఇండియా అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్పేస్ మిషన్ సంస్థ 'లూనార్స్ రిసెర్చ్ స్టేషన్'కు అంబాసిడర్ ఫర్ ఇండియాగా మోహనసాయి ఆకుల(అమర్) ఎంపికయ్యారు. వరల్డ్ స్పేస్ వీక్ అంతర్జాతీయ సదస్సులో సంస్థ తరపున ఇండియా ప్రతినిధిగా పాల్గొంటారు. ఆస్ట్రోబయాలజీ చివరి సంవత్సరం చదువుతున్న తనకు అంతర్జాతీయ స్పేస్ రిసెర్చ్ వేదికపై ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం అరుదైన గౌరవమని మోహనసాయి తెలిపారు.

సంగీతంతో మొక్కల పెరుగుదల!

ఆస్ట్రేలియా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి



సిడ్నీ, అక్టోబర్ 3: సంగీతానికి రాళ్లను కూడా కరిగించే శక్తి ఉంటుందని అంటారు. రాళ్లు కరుగుతాయో లేదో కానీ మొక్కలు మాత్రం వేగంగా పెరుగుతాయని ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఒకే విధమైన సంగీతాన్ని వినిపించడం ద్వారా మొక్కల పెరుగుదలకు కారణమయ్యే ఫంగస్ పనితీరును ప్రోత్సహించవచ్చని తేలింది. ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు జరిపిన ఈ అధ్యయనం వివరాలు 'బయాలజీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ట్రైకోడెర్మ హర్జియానమ్ అనే రకమైన ఫంగస్‌ను సేంద్రీయ వ్యవసాయంలో వినియోగిస్తారు. ఇది మొక్కలను వ్యాధుల నుంచి రక్షణ కల్పించడంతో పాటు మట్టిలో పోషకాలు పెంచి మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. అధ్యయనంలో భాగంగా ప్రతిరోజు అరగంట పాటు 80 డిసెబిల్స్‌లో ఒకేరకమైన సంగీతాన్ని వినిపించారు. ఐదురోజుల తర్వాత చూడగా నిశబ్దంలో ఉన్న ఫంగస్ కంటే సంగీతం వినిపించిన చోట ఉన్న ఫంగస్ ఎక్కువగా వృద్ధి చెందిందని పరిశోధకులు గుర్తించారు. తద్వారా మొక్కల ఎదుగుదలకు సంగీతం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో నకిలీ ఎస్బీఐ బ్రాంచ్

ప్రజలకు లక్షల్లో టోకరా

రాయ్‌పూర్, అక్టోబర్ 3: ఛత్తీస్‌గఢ్‌లో విస్తుపోయే బ్యాంకింగ్ మోసం వెలుగులోకి వచ్చింది. నేరగాళ్లు ఏకంగా ఓ నకిలీ ఎస్బీఐ బ్రాంచ్‌ను ఏర్పాటుచేసి, ప్రజలను నిండా ముంచారు. నకిలీ నియామకాలు, శిక్షణ కార్యక్రమాలతో నిరుద్యోగ యువతను సైతం మోసం చేశారు. రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌కు 250 కి.మీ దూరంలోని సక్తి జిల్లా ఛపోరా గ్రామంలో ఈ ఘటన జరిగింది. పది రోజుల క్రితం ప్రారంభమైన ఈ బ్రాంచ్‌లో అచ్చం అసలైన బ్యాంక్‌లో లాగానే కొత్త ఫర్నీచర్, బ్యాంక్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. నకిలీ శాఖ అని తెలియక గ్రామస్థులు ఇందులో ఖాతాలు తెరచి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఎస్బీఐ దబ్రా బ్రాంచ్ మేనేజర్‌కు విషయం తెలిసి, గత నెల 27న ఈ బ్రాంచ్‌పై విచారణ చేయడంతో అసలు మోసం బయటపడింది. ఈ ఘరానా నేరంలో నలుగురిని నిందితులుగా గుర్తించారు. ఈ బ్రాంచ్‌లో ఉద్యోగం పొందినవారికి ఇచ్చిన ఆఫర్ లెటర్లు కూడా అచ్చం నిజమైన వాటిలాగే ఉన్నాయి. నకిలీ శాఖలో ఉద్యోగాలను రూ.2 నుంచి రూ.6 లక్షల ధరకు అమ్మినట్టు బాధితులు వాపోయారు.

మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించలేం

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం



న్యూఢిల్లీ: భార్యకు ఇష్టం లేని శృంగారాన్ని (మ్యారిటల్ రేప్) నేరంగా పరిగణించవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికి తగిన శిక్ష విధించేందుకు ఇతర చట్టాలు ఉన్నాయని చెప్పింది. మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించే అధికార పరిధి సుప్రీంకోర్టుకు లేదని స్పష్టం చేసింది. మ్యారిటల్ రేప్ అనేది చట్టపరమైన సమస్య కన్నా ఎక్కువగా సాంఘికపరమైనదని వివరించింది. దీని ప్రభావం నేరుగా సమాజంపై ఉంటుందని చెప్పింది. సంబంధితులందరితోనూ సంప్రదించకుండా కానీ, అన్ని రాష్ర్టాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కానీ మ్యారిటల్ రేప్‌పై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని తెలిపింది. వివాహం అనేది మహిళ ఇష్టానికి చెల్లుచీటీ రాయదనే విషయంతో కేంద్ర ప్రభుత్వం ఏకీభవించింది. మహిళ ఇష్టాన్ని పురుషుడు ఉల్లంఘించినట్లయితే, అందుకు దండన ఉండాలని తెలిపింది. వైవాహిక బంధంలో ఉన్నవారి మధ్య ఇటువంటి ఉల్లంఘనలకు, అటువంటి బంధం లేనివారి మధ్య ఉల్లంఘనలకు తేడా ఉందని వివరించింది. దాంపత్యంలో భర్త నుంచి భార్య, భార్య నుంచి భర్త నిరంతరం సరైన లైంగిక సంబంధాలను ఆశిస్తారని, అటువంటి ఆకాంక్షలు భార్య ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక కార్యకలాపాలకు అంగీకారం తెలపాలని భార్యను బలవంతపెట్టే హక్కును భర్తకు ఇవ్వబోవని తెలిపింది. అత్యాచార నిరోధక చట్టాల ప్రకారం అటువంటి భర్తను శిక్షించడం మితిమీరినది, అవసరానికి మించినది అవుతుందని చెప్పింది. వివాహిత మహిళల ప్రయోజనాలను పరిరక్షించే చట్టాలను పార్లమెంటు చేసిందని తెలిపింది. గృహ హింస నిరోధక చట్టం వంటివి అమలవుతున్నాయని చెప్పింది. భార్యాభర్తల మధ్య బాంధవ్యంలో ఉండే అనేక అంశాల్లో శృంగారం ఒకటి అని కేంద్రం తెలిపింది. భారత దేశ సాంఘిక, న్యాయ పద్ధతుల దృష్ట్యా వివాహ వ్యవస్థ స్వభావాన్ని పరిశీలించినపుడు, ఈ వ్యవస్థను పరిరక్షించడం ముఖ్యమని చట్టసభలు అభిప్రాయపడితే, ఆ మినహాయింపును రద్దు చేయడం కోర్టుకు సరైనది కాదని స్పష్టం చేసింది.

ముడా కేసులో ఆధారాల ధ్వంసానికి యత్నం

సిద్ధరామయ్యను వెంటనే అరెస్ట్ చేయండి

ఈడీకి ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబర్ 3: ముడా భూ కుంభకోణంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మరికొందరు ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, కేసు ఫిర్యాదుదారులలో ఒకరైన ప్రదీప్ కుమార్ ఎస్పీ ఆరోపించారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కేసులో నిందితుడు సిద్ధరామయ్యను వెంటనే అరెస్ట్ చేయాలని, లేకపోతే ఆధారాలను ధ్వంసం చేయవచ్చునని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ముడా కమిషనర్‌పై కూడా చర్య తీసుకోవాలని ఆయన కోరారు.

ఢిల్లీలో 5 వేల కోట్ల డ్రగ్స్ వెనుక కాంగ్రెస్ నేత!

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: ఢిల్లీలో బుధవారం పట్టుబడిన రూ.5,600 కోట్ల డ్రగ్స్ వెనుక ప్రధాన సూత్రధారి అయిన తుషార్ గోయల్ కాంగ్రెస్ నేత అని, ఆయన ఢిల్లీ పీసీసీ ఆర్టీఐ సెల్ మాజీ చైర్మన్ అని పోలీస్ వర్గాలు తెలిపాయి. 'రాహుల్ ప్రేమ దుకాణంలో ఇప్పటివరకు విద్వేషమే లభించేది. ఇప్పుడు మాదకద్రవ్యాలు కూడా దొరుకుతున్నాయి' అని బీజేపీ విమర్శించింది. ఈ ప్రచారాన్ని కాంగ్రెస్ ఎక్స్‌లో ఖండిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు తుషార్‌ను 2022 అక్టోబర్ లోనే పార్టీ నుంచి తొలగించినట్టు పేర్కొన్నది.

'సావర్కర్ బీఫ్ తినేవారు'

బెంగళూరు, అక్టోబర్ 3: కర్ణాటక కాంగ్రెస్ నేత, ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు హిందుత్వవాది సావర్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన మాంసాహారి అని, గోవధను వ్యతిరేకించ లేదంటూ పేర్కొన్నారు. ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సావర్కర్ స్వతాహాగా బ్రాహ్మణుడు అయినప్పటికీ ఆయన సంప్రదాయ ఆహార అలవాట్లకు కట్టుబడి లేరని, గొడ్డు మాంసాన్ని కూడా భుజించేవారని తెలిపారు.

కేక్‌లలో క్యాన్సర్ కారకాలు!

- బెంగళూరులో 12 శాంపిళ్లలో గుర్తింపు
- ప్రజలను అప్రమత్తం చేసిన ప్రభుత్వం



బెంగళూరు, అక్టోబర్ 3: బెంగళూరులో 12 కేక్ శాంపిళ్లలో క్యాన్సర్ కారకాలను గుర్తించినట్టు కర్ణాటక ఆహార భద్రత, నాణ్యత విభాగం ప్రకటించింది. మొత్తం 235 శాంపిళ్లను సేకరించగా అందులో 12 కేక్‌లలో కృత్రిమ రంగులు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామని తెలిపింది. ప్రజాదరణ పొందిన రెడ్ వెల్వెట్, బ్లాక్ ఫారెస్ట్ లాంటి కేక్‌లలో తరచూ ఈ కృత్రిమ రంగులను కలుపుతున్నారని.. వీటి వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రజలను హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అల్లూరా రెడ్, సన్‌ఫెస్ట్ యెల్లో ఎఫ్‌సీఎఫ్, పొన్సియూ 4ఆర్, టార్ట్రాజైన్, కెర్మోసైన్ తదితర కృత్రిమ రంగుల వాడకంలో భద్రత ప్రమాణాలను పాటించాలని బేకరీలను ప్రభుత్వం ఆదేశించింది. కృత్రిమ రంగుల వాడకం క్యాన్సర్ కారకంగా పని చేయడమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని కర్ణాటక ఆహార భద్రత, నాణ్యత విభాగం తెలిపింది.

మద్యపానంతో ఆరు రకాల క్యాన్సర్లు

మద్యం సేవించటం వల్ల ఆరు రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉన్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు. హెడ్ అండ్ నెక్ క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, పేగు క్యాన్సర్, ఉదర క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయని అమెరికన్ అసోసియేషన్ ఫర్ క్యాన్సర్ రిసెర్చ్ పరిశోధకులు వెల్లడించారు. మద్యపానం వల్ల మన డీఎన్ఏ కూడా దెబ్బతినే చాన్స్ ఉన్నదని తెలిపారు. 2019 డాటా ప్రకారం ప్రతి 20 మందిలో ఒకరు మద్యం సేవించటం వల్ల క్యాన్సర్ బారిన పడ్డవారేనని వివరించారు. క్యాన్సర్ పెరగటానికి అనేక కారణాలు దోహదం చేస్తాయని స్పష్టంచేశారు.

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

11.72 లక్షల మందికి లబ్ధి

న్యూఢిల్లీ: రైల్వే ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. పండుగల నేపథ్యంలో బోనస్ చెల్లించేందుకు నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్ చెల్లించనున్నట్టు తెలిపింది. ఇందుకు రూ.2028.57 కోట్లు వెచ్చించనున్నట్టు వెల్లడించింది. లోకో పైలెట్లు, గార్డులు, టెక్నీషియన్ హెల్పర్స్ వంటి నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు చెల్లించే ఈ బోనస్ కింద ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 లభిస్తుంది. కాగా, ఈ ఉత్పాదక అనుసంధానిత బోనస్ ఆరో వేతన కమిషన్ సిఫార్సులకు బదులుగా ఏడో వేతన కమిషన్‌ను బట్టి ఇవ్వాలని రైల్వే సంఘాలు గురువారం సామాజిక మాధ్యమంలో ప్రచారాన్ని ప్రారంభించాయి.

చెన్నై మెట్రో ఫేజ్-2కు ఆమోదం

63,246 కోట్లతో 118.9 కి.మీ నిర్మాణం

- మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా
- మరాఠీ, బెంగాలీ, పాళి, ప్రాకృతం, అస్సామీ భాషలకు అరుదైన గుర్తింపు
- రెండు సాగు పథకాలకు ఆమోదం
- కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 3: చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా మూడు కారిడార్ (నడవా)లు నిర్మించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో గురువారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. అందులో భాగంగా చెన్నైలో రవాణా సౌకర్యం మరింత మెరుగుకు మూడు కారిడార్లు నిర్మించాలని నిర్ణయించింది. మొత్తం 118.9 కి.మీ పొడవున నిర్మించే ఈ కారిడార్లలో 128 మెట్రో స్టేషన్లు ఉంటాయి. 63,246 కోట్లతో 2027నాటికి వీటిని పూర్తి చేస్తారు. ఈ ఫేజ్-2 మెట్రో పూర్తయితే చెన్నై నగరానికి మొత్తం 173 కి.మీ మెట్రో సౌకర్యం కలుగుతుంది.

11కు చేరిన ప్రాచీన భాషలు

దేశంలోని మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా లభించింది. మరాఠీ, బెంగాలీ, పాళి, ప్రాకృతం, అస్సామీ భాషలకు 'శాస్త్రీయ భాష' హోదా కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రాచీన హోదా లభించిన భాషల సంఖ్య ఆరు నుంచి 11కు పెరిగింది. అంతకుముందు తెలుగు, తమిళం, సంస్కృతం, కన్నడ, మలయాళం, ఒడియా భాషలకు మాత్రమే ఈ హోదా ఉండేది.

రెండు సాగు పథకాలకు రూ.లక్ష కోట్లు

దేశంలోని అన్నదాతల కోసం రెండు పథకాలను గురువారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రూ. లక్ష కోట్లతో సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత లక్ష్యాలతో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన పథకాలకు 1,01,321.61 కోట్లను విడుదల చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి 'వంట నూనెలు-నూనె గింజలు' మిషన్ కోసం రూ.10,103 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు మన దేశీయ అవసరాలు తీర్చేందుకు 50 శాతం పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. రానున్న ఏడేండ్లలో నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

మా ఇండ్ల జోలికి రావొద్దు ఉయ్యాలో..

రేవంత్‌రెడ్డిపై మూసీ బాధితుల బతుకమ్మ పాట
బుద్ధి తెచ్చుకోవాలంటూ పలు డివిజన్లలో ఆట
సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో
› 2

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

'బతుకమ్మ'పై పోలీస్ జులుం › 2


ట్రాక్టర్లు, ట్యాంకరు అడ్డుపెట్టి ఆడకుండా అడ్డగింత
కాంగ్రెస్ నేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు
ఖమ్మం జిల్లా భీమవరం గ్రామంలో ఘటన

శుక్రవారం FRIDAY 4.10.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14+4 Pages: 14+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 120 ‖ వెల (Price) రూ.6.50 | విదియ

శుక్రవారం, సూర్యోదయం: 6-07, సూర్యాస్తమయం: 6-02. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం శరత్ రుతువు ఆశ్వయుజ మాసం శుక్లపక్షం తిథి: విదియ తెల్లవారుజామున 5-31 వరకు. నక్షత్రం: చిత్త సాయంత్రం 6-38 వరకు. వర్జ్యం: రాత్రి 12-55 నుంచి రాత్రి 2-43 వరకు. రాహుకాలం: ఉదయం 10-35 నుంచి పగలు 12-04 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి ఉదయం 9-18 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-28 నుంచి పగలు 1-15 వరకు. అమృతకాలం: ఉదయం 11-24 నుంచి పగలు 1-12 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



రెడ్ మార్కింగ్‌లో లక్షన్నర ఇండ్లు?

కలవరపెడుతున్న మూసీ సుందరీకరణ మ్యాప్

- రివర్ బెడ్ పరిధిలో ఐదారు వేల లోపు నిర్మాణాలే
- బఫర్‌జోన్ దాకా విస్తరిస్తే భారీ సంఖ్యలో కూల్చివేతలు
- ఇప్పటికే రివర్‌బెడ్ పరిధిలో మొదలైన కూల్చివేతల పర్వం
- సుందరీకరణ ప్రాజెక్టులో కనిపించని భూసేకరణ ప్రక్రియ
- నేలకూల్చే నిర్మాణాల లెక్కపై స్పష్టత ఇవ్వని యంత్రాంగం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణలో భాగంగా దాదాపు లక్షన్నర ఇండ్లు నేలమట్టం కాబోతున్నాయా? మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) రూపొందించిన గూగుల్ మ్యాప్‌ను పరిశీలిస్తే ఈ సందేహమే కలుగుతున్నది. ఈ మ్యాప్ ప్రకారం.. ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫుల్ రివర్‌లెవల్) గీత లోపు ఉన్న నిర్మాణాలే పుట్టగొడుగుల్లా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం అక్కడి నుంచి బఫర్‌జోన్‌ను లెక్కిస్తే, దాని పరిధిలోకి వచ్చే వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. దీంతో సుందరీకరణ ప్రాజెక్టు తమ పాలిట పిడుగుగా మారుతుందనే ఆందోళన వారిలో › 2వ పేజీలో

తెలంగాణలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణే తమ ధ్యేయమని రేవంత్ రెడ్డి సర్కార్ చెప్తున్నది. హైడ్రా ఏర్పాటుకు దీన్ని ఒక కారణంగా కూడా చూపిస్తున్నది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నందునే చెరువులు, మూసీ తీరంలో ఇండ్లను కూల్చివేస్తున్నట్టు అది సమర్థించుకుంటున్నది. అయితే ఒకవైపు ప్రభుత్వ స్థలాలను కాపాడటమే తన లక్ష్యమని చెప్తూ పేదల ఇండ్లను బుల్డోజర్లతో కూలగొడుతున్న ప్రభుత్వం మరోవైపు అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై పెద్దలు కన్నేస్తే మిన్నకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. కొండొకచో హైదరాబాద్‌లోని వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బడావ్యాపారులకు, పాలకపార్టీ ముఖ్యులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న విమర్శలూ వినవస్తున్నాయి. దేశంలోనే పేరుమోసిన, రాహుల్‌గాంధీ నిత్యం విమర్శించే వ్యాపారవేత్త గౌతమ్ అదానీ బుధవారం హైదరాబాద్‌కు రావడం, రాష్ట్ర రెవెన్యూ మంత్రితో రహస్య సమావేశం జరపడం ఈ విమర్శలకు బలంచేకూరుస్తున్నది.

ఆరు వేల కోట్ల కోసమేనా కోహినూర్ భేటీ!

- హైదరాబాద్ రాయదుర్గం గుట్టపై అత్యంత విలువైన భూమి
- ఉమ్మడి రాష్ట్రంలో నకిలీ పత్రాలతో చెరపట్టిన ఏపీ ఎమ్మెల్యే
- అది ప్రభుత్వ భూమి అని కొట్లాడి కాపాడిన జాయింట్ కలెక్టర్
- ఆ భూమిని అదానీతో కొనిపించిన సన్నిహిత ఐఏఎస్ అధికారి
- సర్కారు ఆధీనం నుంచి విడిపించుకోడానికి అదానీ యత్నం
- అందులో భాగమే మంత్రి పొంగులేటితో రహస్య మంతనాలు
- గురువారం సర్కారీ పెద్దతోనూ ఖరారైన అపాయింట్‌మెంట్
- విషయం బయటకు పొక్కడంతో వాయిదా పడిన సమావేశం
- ఎజెండాలో పాతబస్తీ కరెంట్ బిల్లుల కలెక్షన్ ప్రాజెక్టు కూడా!

› 2

225 ఎకరాల 'రాజీ'కీయం?

3,500 కోట్ల సర్కారు భూమి ధారాదత్తం!

రేపటి సంచికలో

హిమాచల్‌లో టాయ్‌లెట్ ట్యాక్స్



కాంగ్రెస్ సర్కారు నిర్వాకం

ఒక్కో మరుగుదొడ్డిపై నెలకు రూ. 25 పన్ను

మంచినీటికి 70.. మురుగుకు మరో 30

షిమ్లా, అక్టోబర్ 3: ఉచితాల పేరుతో ఊదరగొట్టి హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు ప్రజలు చెంబట్క పోయేందుకు కూడా భయపడే పరిస్థితులు తీసుకొచ్చింది. అలవికాని హామీలు అమలు చేసేందుకు ప్రజల నుంచి కొత్త పన్నులు వసూలు చేయాలని నిర్ణయించింది. ఆఖరికి మరుగుదొడ్లపైనా పన్ను విధించాలని నిర్ణయం తీసుకున్నది. సాధారణంగా బహిరంగ మల విసర్జనను నిర్మూలించడానికి ప్రభుత్వాలు మరుగుదొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తాయి. మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రజలకు నిధులు మంజూరు › IIవ పేజీలో



సంగారెడ్డి జిల్లా డప్పూర్‌లో హరీశ్‌రావు హాజరైన సమావేశంలో కంటతడి పెట్టుకున్న ఫార్మా బాధిత మహిళారైతు

నువ్వు సీఎంవా.. బ్రోకరువా?

- అండగా నిలవాల్సిందిపోయి భూములు లాక్కుంటున్నవ్
- మూసీని ఉద్ధరిస్తానని మంజీరను విషతుల్యం చేస్తరా?
- అసైన్డ్ భూములకు పట్టాలిస్తానన్న రాహుల్ జవాబు చెప్పాలి
- జేసీబీలు, పొక్లెయిన్లు వస్తే నేను అడ్డుగా పడుకుంటా
- రైతుల పక్షాన గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులో కేసులు వేస్తం
- రేవంత్‌రెడ్డి మెడలు వంచి భూములు కాపాడుతం › 6
- ఫార్మా బాధిత రైతులతో ముఖాముఖిలో హరీశ్‌రావు

మా రొట్టె తిని మమ్మల్నే తరుముతున్నడు.. ఉన్న కొంచెం పొలం రేవంత్ గుంజుకుంటే కడుపు మండుతున్నది - రైతు హన్మంతు





కిరాయి పేదల హడావుడి అది

మూసీలో ఇండ్లు కూల్చితీరుతం: సీఎం రేవంత్

మూసీ, హైడ్రా కూల్చివేతలపై పేదలను ఎగదోస్తున్నరు

డబుల్‌బెడ్రూం, 25 వేలు ఇస్తున్నం.. సరిపోదా!

పేదలకు అంతకు మించిన ప్రత్యామ్నాయముందా?

కొందరి ఫామ్‌హౌస్‌ల రక్షణ కోసమే ఈ రాద్ధాంతం

అక్రమంగా నిర్మించిన కేవీపీ ఫామ్‌హౌస్‌ను కూల్చొద్దా?

బాధిత పేదలకు బీఆర్‌ఎస్ రూ.500 కోట్లు ఇవ్వాలి

పేదలను అడ్డం పెట్టుకొని బీఆర్‌ఎస్ రాజకీయాలు

ఈటలా.. మోదీ వద్ద పాతికవేల కోట్లు తెద్దాంరా!

డిజిటల్ సర్వే ప్రారంభంలో ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, అక్టోబర్3 (నమస్తే తెలంగాణ): కొందరు పేదలను, కిరాయి మనుషులను ఎగదోసి మూసీ, హైడ్రా కూల్చివేతలపై రాజకీయం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మూసీ కూల్చివేతలపై ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతపై తీవ్రస్వరంతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలే చెరువులను ఆక్రమించి ప్లాట్లుగా పేదలకు అమ్మారని, ఇప్పుడు ఆ ఆక్రమణలు ఎక్కడ బయటపడుతాయోనని పేదలను, కిరాయి › 2వ పేజీలో



ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురిలో బతుకమ్మ ఆడుతూ రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేసిన మూసీ పరీవాహక ప్రాంతాల మహిళలు

మా ఇండ్ల జోలికి ఉయ్యాలో.. నువ్వు రావొద్దయ్య ఉయ్యాలో

వినూత్నంగా మూసీ నిర్వాసితుల బతుకమ్మ పాట

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆవేదన

ఎల్బీనగర్, అక్టోబర్ 3: మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు హైడ్రా, సీఎం రేవంత్‌రెడ్డిపై తమ ఆక్రోశాన్ని వివిధ రూపాల్లో వెళ్లగక్కుతున్నారు. చైతన్యపురి, కొత్తపేట డివిజన్లలోని ప్రజలు అమావాస్యనాడు తమ ఇండ్లను రేవంత్‌రెడ్డి దృష్టి నుంచి కాపాడాలంటూ దిష్టి తీసి నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పాటలు పాడుతూ బతుకమ్మ ఆడుతున్నారు. ప్రస్తుతం ఈ బతుకమ్మ పాట ఎక్స్ వేదికగా వైరల్ అవుతున్నది.



బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాలో..
రేవంత్ సారూ ఉయ్యాలో..
నీజాగల నీవుండూ ఉయ్యాలో..
మా ఇంట్ల మమ్మల్ని ఉయ్యాలో..
ఉండనీయ వయ్య ఉయ్యాలో..
మూసీ ప్రక్షాళన ఉయ్యాలో..
ఉన్నదాంట్లో చేయి ఉయ్యాలో..
మాఇండ్ల జోలికి ఉయ్యాలో..
నువ్వు రావొద్దయ్యా ఉయ్యాలో...
ఇకనైనా నీవు ఉయ్యాల్లో..
బుద్ధి తెచ్చుకో ఉయ్యాలో..
నీ పదవి నీకు ఉయ్యాలో..
ఉండదయ్య నీకు ఉయ్యాలో..
ఆడోళ్ల జోలికి ఉయ్యాలో..
నీవు రావొద్దయ్య ఉయ్యాలో..
ఆది పరాశక్తులం ఉయ్యాలో..
అంతమైపోతావు ఉయ్యాలో..
లండన్‌ల తెలిసినది ఉయ్యాలో..
చూసి వచ్చినావా ఉయ్యాలో..
హైదరాబాదులో ఉయ్యాలో..
అది జరుగదయ్య ఉయ్యాలో..
లండన్‌లో పుట్టలేదు ఉయ్యాలో..
నువ్వు లండన్‌లో పెరుగలేదు ఉయ్యాలో..
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం భీమవరం పంచాయతీ కార్యాలయంలో అంటించిన నోటీసుపై కలెక్టర్‌కు విన్నవిస్తున్న శీలం కవిత, ఇతర గ్రామ మహిళలు

భట్టి ఇలాకాలో బతుకమ్మకు అవమానం

- కాంగ్రెస్ నేతల హుకుంతో బతుకమ్మపై నిషేధం
- పంచాయతీ ఆవరణలో ఆడొద్దంటూ నోటీస్
- కలెక్టర్ ఆదేశించినా బేఖాతరు
- మహిళల అడ్డగింత.. రోడ్డుపైన ఆట
- ఖమ్మం జిల్లా భీమవరంలో ఘటన

ఎర్రుపాలెం, అక్టోబర్ 3: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ప్రజల్లో సమైక్యతను తీసుకొచ్చింది. సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదికగా నిలిచింది. ఊరూరా ఉద్యమ పాటలతో బతుకమ్మ ఆడుతూ నాడు ప్రజలు ఉత్తేజితులయ్యారు. ఊరూవాడా ఏకమై సింగిడి పూలతో పునరుత్తేజితులై ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మకు ప్రపంచ ఖ్యాతినే తీసుకొచ్చారు. రాష్ట్ర పండుగగా గుర్తించి, ప్రత్యేక నిధులు కేటాయించి, ఏటా బతుకమ్మ చీరలు ఇస్తూ మహిళలను బతుకమ్మలుగా కొలిచేలా గుర్తింపుతెచ్చారు. కానీ, నేటి కాంగ్రెస్ సర్కారు బతుకమ్మకే అవమానం కలిగిస్తున్నది. దానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇలాకాలోని బీమవరంలో జరిగిన ఘోర అవమానమే దానికి నిదర్శనం. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ఎర్రుపాలెం మండలం భీమవరంలో బతుకమ్మ ఆడేందుకు కాంగ్రెస్ నేతల హుకుంతో అధికారులు, సిబ్బంది ఆటంకం కల్పించారు. గ్రామంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడి సహకారం, ఎన్ఆర్ఐల తోడ్పాటుతో గతంలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. దాని ఆవరణలో మహిళలంతా ఏటా బతుకమ్మ పండుగ సంబురాలు జరుపుకుంటారు.

కాంగ్రెస్ నేతల దుష్టపన్నాగం

బీఆర్ఎస్ వర్గీయులు పంచాయతీ కార్యాలయంలో బతుకమ్మ ఆడుకునేందుకు సిద్ధమైన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు దుష్టపన్నాగంతో ఎంపీడీవో దారా కార్యదర్శి మురళికి పలు ఆదేశాలు జారీచేయించారు. 'అధికారుల అనుమతి లేకుండా కార్యాలయంలో ఎటువంటి కార్యక్రమాలు, ఉత్సవాలు జరపకూడదు' అంటూ బోర్డులో నోటీసు ఉంచారు. బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ శీలం కవిత, పలువురు గ్రామ మహిళలు దీనిని ప్రశ్నించారు. గురువారం ఖమ్మం వెళ్లి కలెక్టర్‌ను కలవగా, అనుమతించారు. ఈ మేరకు గురువారం రాత్రి స్థానిక మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో అక్కడికి బయలుదేరారు. ఆఫీసు వద్ద ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్‌ను అడ్డుపెట్టి అడ్డుకున్నారు. మధిర సీఐ మధు అక్కడికి చేరుకొని వేరేచోట బతుకమ్మ ఆడుకోవాలని సూచించారు. దీంతో చేసేదేమీలేక గ్రామ మహిళలందరూ రోడ్డుపక్కనే బతుకమ్మ ఆడుకున్నారు.

కాంగ్రెస్ నోళ్లలో మూసీ మురికి

- పేదల కలల సౌధానికి రూ. 25 వేలా?
- 50 వేలిస్తే మంత్రుల ఇండ్లు కూలుస్తారా?
- సర్కారు ధన దాహానికి బుచ్చమ్మ, కుమారన్న బలి .. కేటీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): పేద, మధ్య తరగతి ప్రజలు పైసాపైసా కూడబెట్టుకొని, బ్యాంకుల నుంచి అప్పు తెచ్చుకొని కట్టుకున్న కలల సౌధం ఖరీదు రూ. 25వేలా? ఇండ్లు ఖాళీ చేస్తే డబుల్ బెడ్రూంతో పాటు పారితోషికం ఇస్తామంటూ వెకిలి ఆఫర్లేంటి? అంటూ గురువారం ఎక్స్ వేదికగా కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు, ఆయన మంత్రుల ఇండ్లకు రూ. 50 వేల చొప్పున ఇస్తే కూల్చుతరా' అని నిలదీశారు. కష్టపడి కట్టుకున్న గూళ్లు రాత్రికిరాత్రే ఎక్కడ కూలుతాయోనని గుండెలు ఆగిపోతున్నా, ఉమ్మడి కుటుంబాలు విడిపోతున్నా ఈ సర్కారు ధన దాహం తీరడంలేదని మండిపడ్డారు. ఇండ్లు పోతాయనే భయంతో ఇప్పటికే ఓ బుచ్చమ్మ, కూమారన్న ప్రాణాలు పోయాయని, నీ స్కాములకు ఇంకా ఎందరి ప్రాణాలు బలి తీసుకుంటావో చెప్పు? అని ప్రశ్నించారు. అయినా మూసీ మురికి నీరంతా కాంగ్రెసోళ్ల నోట్లోనే ఉండగా ఇంకా లక్షన్నర కోట్లు వెచ్చించి శుద్ధి ఎందుకు? అని నిలదీశారు.



మార్పు అంటూ కాంగ్రెస్ మోసం

కాంగ్రెస్ సర్కారు మార్పు..మార్పు అంటూ ప్రజలను మోసం చేస్తున్నదని కేటీఆర్ దుయ్యబట్టారు. పడిపోయిన రాష్ట్ర ఆదాయమే పాలనా వైఫల్యానికి నిదర్శమని పేర్కొన్నారు. తొలి ఏడాదిలోనే ఇట్లుంటే ఇగ నాలుగేండ్లు గడ్డుకాలమేనని తెలిపారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప, దిద్దుబాటు చర్యలు కనుచూపుమేర కనిపించడం లేదని విమర్శించారు. సీఎం అనుభవ రాహిత్యంతోనే ఈ పరిస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన ఘనత ఆయనదేనని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ దార్శనిక ఆలోచనకు నిదర్శనం

వరంగల్‌కు పూర్వవైభవం తెచ్చే ఉద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు నెలకొల్పిన టెక్స్‌టైల్ పార్కు కేసీఆర్ దార్శనికతకు నిదర్శమని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్దదైన ఇందులో మొదట కిటెక్స్, ఇప్పుడు దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ నియామకాలు చేపట్టడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఇందులో భాగస్వాములైనందుకు ఎంతో గర్వంగా ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు.

రెడ్ మార్కింగ్‌లో లక్షన్నర ఇండ్లు?

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నది. రెవిన్యూ, నీటిపారుదల వంటి పలు శాఖలతో సమన్వయం చేసుకొంటూ ఎంఆర్‌డీసీఎల్ అధికారులు రూపొందించిన మ్యాప్ ప్రకారం.. హిమాయత్‌సాగర్ నుంచి వచ్చే అవుట్‌ఫ్లో, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నుంచి వచ్చే అవుట్‌ఫ్లో వేర్వేరుగా ప్రవాహ మార్గాల్లో వచ్చి లంగర్‌హౌస్ సమీపంలో ఒకే మార్గంగా కలుస్తాయి. అక్కడినుంచి మూసీ నది నల్లగొండ జిల్లాలోనూ ప్రవహించి.. ఆపై కృష్ణా నదిలో కలుస్తుంది. ఉస్మాన్‌సాగర్ నుంచి లంగర్‌హౌస్ సమీపంలోని బాపూఘాట్ వరకు సుమారు 11.7 కిలోమీటర్ల మేర మూసీ ప్రవహిస్తుంది. అదేవిధంగా ఈసా నది హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు దాదాపు తొమ్మిది కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది. ఆపై రెండూ కలిసే ప్రవహించే మార్గంలో సుమారు 45 కిలోమీటర్ల వరకు అంటే గౌరెల్లి వరకు ఎంఆర్‌డీసీఎల్ అధికారులు మ్యాప్‌ను రూపొందించారు.

భయపెడుతున్న బఫర్‌జోన్

ఎంఆర్‌డీసీఎల్ అధికారులు రూపొందించిన మ్యాప్‌లో రెండు నదుల ప్రవాహ మార్గం అవుటర్ రింగు రోడ్డు వరకు దాదాపు 54 కిలోమీటర్ల మేర ఉన్నది. మూసీ రివర్ బెడ్‌ను అధికారులు రెడ్ మార్క్‌తో గుర్తించారు. అందుకే ఇటీవల కూల్చివేసిన ఇండ్లతోపాటు ఇప్పటికే వేలాది ఇండ్లపై రెడ్ మార్కుగా ఆర్‌బీ-ఎక్స్ (రివర్ బెడ్)ను ముద్రించారు. ఈ రెడ్ మార్కును పరిశీలిస్తే, రంగారెడ్డి-హైదరాబాద్-మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో గరిష్ఠంగా ఐదు వేల నిర్మాణాల వరకు వస్తాయని ప్రాథమిక అంచనా. రివర్ బెడ్‌లో ఉన్న ఈ నిర్మాణాల కూల్చివేత ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. మ్యాప్‌లో సూచించిన మరో బ్లూ మార్క్ ఎఫ్‌ఆర్‌ఎల్ (ఫుల్ రివర్ లెవల్) అంటే గరిష్ఠ నదీ ప్రవాహాన్ని సూచిస్తుంది. దీని పరిధిలోని నిర్మాణాలను చూస్తుంటే 'అమ్మో... ఇన్ని నిర్మాణాలను తొలగించాలా?' అనే భావన కలుగుతుంది. ఎఫ్‌ఆర్‌ఎల్ నుంచి నిబంధనల ప్రకారం బఫర్‌జోన్ 30 మీటర్ల మేర ఉంటుంది. ప్రస్తుతానికి అధికారులు మ్యాప్‌లో బఫర్‌జోన్‌ను గుర్తించలేదు. దీనిని కూడా గుర్తిస్తే ఎన్ని వేల నిర్మాణాలను తొలగించాల్సి వస్తుందో అంతుబట్టడం లేదు. సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నదీ మార్గం వెంట పెద్ద ఎత్తున రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో మార్గాలు, ఆకాశహర్మ్యాలు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఈ లెక్కన ముమ్ముందు బఫర్‌జోన్‌ను కూడా స్వాధీనం చేసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే 54 కిలోమీటర్ల మేరలో లక్షన్నర వరకు నిర్మాణాలు ఉండొచ్చని మూసీపై అధ్యయనం చేస్తున్న నిపుణుడు ఒకరు అభిప్రాయపడ్డారు. అధికారులు మాత్రం ప్రస్తుతం రివర్‌బెడ్‌కు మాత్రమే పరిమితం అవుతున్నామని చెప్తున్నారు. ముమ్ముందు రేవంత్ సర్కారు అడుగులు ఎలా ఉంటాయనేది ఎవరికీ అంతుబట్టడం లేదు. ఇందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ గతంలో చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. ఎందుకంటే ఆయన గతంలో పలు మీడియా ఇంటర్వ్యూల్లో మాట్లాడుతూ... తొలుత కేవలం ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తామని, ఆపై బఫర్‌జోన్‌కు వెళ్తామని చెప్పారు. కానీ ఇప్పటివరకు హైడ్రా చేపట్టిన కూల్చివేతల్లో ఎఫ్‌టీఎల్‌తోపాటు బఫర్‌జోన్ నిర్మాణాలు కూడా ఉన్నాయి. ఒక్కసారి బుల్డోజర్‌కు మార్గం సుగమం అయిందంటే రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అనే తేడా ఉండదనేది హైడ్రా కూల్చివేతలతోనే స్పష్టమైంది. అందుకే అసలు మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో ఎన్ని నిర్మాణాలను సేకరిస్తారు? ఎన్ని మీటర్ల మేర సుందరీకరణ చేపడతారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని మూసీపై అధ్యయనం చేస్తున్న నిపుణులు డిమాండు చేస్తున్నారు.



హుడా అనుమతులున్నా... రెడ్ మార్కులోనే!

మూసీ రివర్ బెడ్‌లో ఉన్న నిర్మాణాలు అక్రమమంటూ ప్రభుత్వం వాటిని నేలమట్టం చేస్తున్నది. ఇప్పటివరకు కూల్చివేసిన 150 నిర్మాణాలకు పెద్దగా అనుమతులు లేవని తెలిసింది. దీంతో ప్రభుత్వం వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని, వారిలో కొందరిని ఒప్పించి ఇండ్లను కూల్చివేసింది. కానీ, హైదర్‌షాకోట్, అత్తాపూర్, దిగువన ఉన్న నాగోల్ పరిసర ప్రాంతాల్లోని వేలాది నిర్మాణాలకు నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయి. దశాబ్దాలుగా వారంతా ఆస్తిపన్ను, నీటి బిల్లు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. అంతేకాదు, లంగర్‌హౌస్ పరిసర ప్రాంతంలో ఏకంగా హుడా లేఅవుట్‌లో దశాబ్దాల క్రితం చేపట్టిన నిర్మాణాలకు సైతం రెడ్‌మార్కు వేశారు. అంటే గతంలో అనుమతులు ఉన్నవే రివర్‌బెడ్‌లో ఉంటే, దాని అవతల ఉండే ఎఫ్‌ఆర్‌ఎల్, బఫర్‌జోన్ పరిస్థితి ఏమిటనేది అంతుబట్టడం లేదు.

6 వేల కోట్ల భూమి కోసమేనా!


- అదానీ, పొంగులేటి భేటీ దీనికోసమేనా?
- రాయదుర్గం గుట్టపై 64 ఎకరాల భూమి
- ఈ భూమిపై గౌతం అదానీ కన్ను
- చక్రం తిప్పిన ఏపీ మాజీ సీఎస్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న అత్యంత ఖరీదైన స్థలాన్ని అదానీకి కట్టబెట్టేందుకు ప్రయత్నం జరుగుతున్నదా? అంటే.. ఔననే సమాధానం వినిపిస్తున్నది. బీజేపీతో సత్సంబంధాలున్న అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ బుధవారం హైదరాబాద్ రావడం, ఐటీసీ కోహినూర్‌లోని ప్రెసిడెన్షియల్ సూట్ నంబర్ 2122లో గంటకుపైగా మంత్రి పొంగులేటితో రహస్యంగా సమావేశం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా ఉన్నట్టు తెలిసింది. అదానీతో భేటీపై ఇటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, అటు అదానీ కంపెనీగానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఈ భేటీపై అనేక ఊహాగానాలు బయటకు వచ్చాయి. దుర్గంచెరువు సమీపంలోని రాయదుర్గం గుట్టపై అత్యంత ఖరీదైన 64 ఎకరాల భూమికి సంబంధించిన వివాదంపై మంత్రి పొంగులేటిని అదానీ కలిసినట్టు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీ (మాజీ ఎమ్మెల్యే కూడా)కి చెందిన సంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ భూమిని తన ఖాతాలో వేసుకున్నట్టు సమాచారం. ఈ విషయంలో కొంత వివాదం ఉండడంతో తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దీనిని ప్రభుత్వ భూమిగా పేర్కొన్నాయి. అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్, కలెక్టర్లు దీనిపై విచారణ జరిపి దానిని ప్రభుత్వ భూమిగా తేల్చి నాటి ఏపీఐఐసీ పరిధిలోకి తెచ్చారు. అయితే, ఆ తర్వాత ఆ మాజీ ఎంపీ తన పలుకుబడి ఉపయోగించి ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా పదవీవిరమణ చేసిన ఓ అధికారి సాయంతో మళ్లీ తమ పరిధిలోకి తెచ్చుకునే ప్రయత్నం చేశారు. ఆ అధికారి గతంలో హెచ్ఎండీఏలో కూడా పనిచేయడంతో తన పలుకుబడిని ఉపయోగించి ఈ భూమిని అదానీ కోసం మాట్లాడిపెట్టినట్టు చెప్తున్నారు. ఈ వివాదాస్పద భూమి ప్రస్తుత మార్కెట్ విలువ అక్షరాలా ఆరువేల కోట్లని చెప్తున్నారు. ఇంతటి విలువైన భూమిని తెలంగాణ ప్రభుత్వం నుంచి విడిపించి అదానీకి ఇప్పించేందుకు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. దీని కోసం పాత డాక్యుమెంట్లు, కేసులు, అప్పీళ్లు వంటివాటిని చూపించి తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆ నేతకు అప్పగించి, అక్కడి నుంచి అదానీకి అప్పగించే కుట్ర జరుగుతున్నదని, ఈ విషయంలో ప్రభుత్వ పెద్దలు చాలా చురుగ్గా వ్యవహరిస్తున్నారని చెప్తున్నారు. అదానీతో కలిసి ఈ భూములను తామే తీసుకునే ప్రయత్నంలో ఉన్నారా? లేక ఆంధ్రప్రదేశ్‌లో తాను పనిచేసిన పాత పార్టీకి చెందిన ఆ మాజీ ఎంపీ కోసం పైరవీ చేస్తున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో ప్రభుత్వం మారినప్పటి నుంచి ఈ భూమికి సంబంధించిన మంతనాలు జరుగుతున్నాయని చెప్తున్నారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో ఈ స్థలాన్ని విడిపించి ఇచ్చే ప్రక్రియ జోరుగా జరుగుతున్నదని మాత్రం చెప్తున్నారు.


అపాయింట్‌మెంట్లు క్యాన్సిల్!

అదానీ వాస్తవానికి గురువారం ముఖ్యమంత్రి, ఇతరులతో కూడా సమావేశం కావాల్సి ఉందని తెలిసింది. దావోస్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణలో వ్యాపారం నిర్వహించేందుకు అదానీ ఆసక్తి చూపిన విషయం తెలిసిందే. ఈమేరకు ఒప్పందం కూడా చేసుకున్నారు. దావోస్ ఒప్పందం తర్వాత అదానీ హైదరాబాద్‌కు రావడం ఇదే తొలిసారి. పొంగులేటితో భేటీ మీడియాలో ముందే రావడంతో కొంత వెనుకడుగు వేసినట్టు చర్చ జరుగుతున్నది. సీఎంతో మాట్లాడేందుకు తొలుత అపాయింట్ ఖరారు అయినప్పటికీ కలువకుండానే వెళ్లిపోయినట్టు చెప్తున్నారు.

లోకం పోకడ



స్పెషల్ బస్సులు సరేగానీ, స్పెషల్ బుల్డోజర్లు మాత్రం పంపకండి సారూ!



అనర్హత పిటిషన్లపై తీర్పును రద్దు చేయండి

హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి అప్పీళ్లు

ప్రతివాదులకు నోటీసులిచ్చిన న్యాయస్థానం

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గత నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేయాలని కోరుతూ అసెంబ్లీ కార్యదర్శి హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. అనర్హత పిటిషన్లను వెంటనే స్పీకర్ ముందు ఉంచాలని, నాలుగు వారాల వ్యవధిలో విచారణ షెడ్యూల్‌ను ప్రకటించాలని హైకోర్టు అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. ఆ వివరాలను కోర్టు రిజిస్ట్రీకి అందజేయాలని స్పష్టంచేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వీ నరసింహాచార్యులు వేర్వేరుగా రెండు అప్పీళ్లు దాఖలు చేశారు.

ఊహాజనిత ఆరోపణలతో పిటిషన్లు

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోలేదంటూ ఊహాజనిత అంశాలతో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద, మహేశ్వర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారని అసెంబ్లీ కార్యదర్శి తన అప్పీలులో పేర్కొన్నారు. వారిచ్చిన పిటిషన్లపై నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా కోర్టుకు వచ్చారని తెలిపారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూలు ప్రకారం స్పీకర్ ఓ విధానం ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని వివరించారు. తమ వాదనలను పరిగణలోకి తీసుకోకుండా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అప్పీళ్లపై విచారణ పూర్తయ్యేదాకా సింగిల్ జడ్జి తీర్పు అమలును నిలిపివేయాలని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రస్తుత అప్పీళ్లలో నిర్ణీత కాల వ్యవధిలో అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించే పరిధి ఈ కోర్టుకు ఉందా? లేదా అన్నది తేల్చాల్సి ఉన్నదని పేర్కొంది. దీనిపై ఈ నెల 24న తుది విచారణ చేపడతామని, ఈలోగా ఏవైనా చర్యలు తీసుకుంటున్నట్టయితే కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. ఇందులో ప్రతివాదులైన పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఏ మహేశ్వర్‌రెడ్డితోపాటు కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 24కు వాయిదా వేసింది.

కమిషన్‌దే అంతిమ నిర్ణయం

గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అంతిమ నిర్ణయం కమిషన్‌దేనని టీజీపీఎస్సీ గురువారం హైకోర్టుకు నివేదించింది. నోటిఫికేషన్ రద్దు, కొత్త నోటిఫికేషన్ జారీ, రిజర్వేషన్ల కల్పనలకు సంబంధించి కమిషన్ తీసుకున్న నిర్ణయాలే అంతిమమని పేర్కొంది. గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022లో జారీచేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీచేయడం చెల్లదని, ప్రాథమిక కీలో తప్పులున్నాయని, వాటిని సవరించాలన్న అభ్యంతరాలను పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. టీజీపీఎస్సీ తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి వాదనలు వినిపించారు. త్వరలో మెయిన్ పరీక్షలు జరగనున్నందున ఈ దశలో కోర్టులు జోక్యం చేసుకోరాదని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. వాదనలు పూర్తికాకపోవడంతో న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

కూలీలకు ఇచ్చిన కూల్చివేత నోటీసుల రద్దు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం హస్మత్‌పేట హరిజనబస్తీ వాసులకు తహసీల్దార్ జారీచేసిన కూల్చివేత నోటీసులను హైకోర్టు రద్దు చేసింది. పూర్తి వివరాలతో, బస్తీవాసుల వాదన విని చట్టప్రకారం ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలున్నాయని, వాటిని తొలగించాలంటూ ఆగస్టు 21న తహసీల్దార్ జారీచేసిన నోటీసులను రద్దుచేయాలని, కూల్చివేతలు చేపట్టకుండా హైడ్రాకు ఆదేశాలు జారీ చేయాలంటూ హస్మత్‌పేట హరిజనబస్తీకి చెందిన మల్లయ్య మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీ టిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. తహసీల్దార్ జారీచేసిన నోటీసులను రద్దు చేస్తూ, చట్ట నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టవచ్చంటూ తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

6 నుంచి కాలేజీలకు దసరా సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలకు ఇంటర్‌బోర్డు దసరా సెలవులను ప్రకటించింది. ఈ నెల 6 నుంచి 13 వరకు సెలవులిచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కాలేజీలు, గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు అన్ని ఈ సెలవులను పాటించాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. సెలవులు ముగిసిన తర్వాత ఈ నెల 14నుంచి కాలేజీలు పునఃప్రారంభమవుతాయన్నారు.

చింతలపల్లి కార్యదర్శికి మెమో

పెద్దంపల్లిలో విద్యుత్తు లైట్ల ఏర్పాటు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

ములుగు, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ)/టేకుమట్ల: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పెద్దాపురం గ్రామపంచాయతీ పరిధి చింతలపల్లి గ్రామ కార్యదర్శికి కలెక్టర్ రాహుల్‌శర్మ మెమో జారీ చేశారు. గ్రామంలో మహిళలంతా బుధవారం ఎంగిలి పూల బతుకమ్మను చీకట్లో ఆడగా 'నమస్తేతెలంగాణ' మెయిన్‌లో 'చీకట్లోనే బతుకమ్మ సంబురాలు' శీర్షికన గురువారం కథనాన్ని ప్రచురించింది. చింతలపల్లి గ్రామం ములుగు నియోజకవర్గ పరిధిలో ఉన్నా.. జిల్లా పరంగా భూపాలపల్లి జిల్లాలోకి వస్తుంది. ఈ విషయంపై ఆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆరా తీశారు. గ్రామ కార్యదర్శి కవితకు గురువారం మెమో జారీ చేశారు. పెద్దంపల్లిలో బతుకమ్మ ఆడే స్థలం వద్ద అధికారులు విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

కిరాయి పేదల హడావుడి అది

మొదటిపేజీ తరువాయి...

మనుషులను ఎగదోసి ఆగమాగం చేస్తున్నారని ఆరోపించారు. 'డ్రైనేజీ నీళ్లు హైదరాబాద్ నగరం తాగాలా? ముసుగు తొడుక్కునేందుకు మూసీ కావాల్సి వచ్చిందా? మూసీని అడ్డం పెట్టుకుని ఎంతకాలం బతుకుతారు. నెల రోజులులైనా మిమ్మల్ని వదల.. మీ భరతం పడతా.. ఒక్కొక్కరిని చింతపండు చేస్తా' అంటూ సీఎం ఆగ్రహంతో ఊగిపోయారు. సికింద్రాబాద్ సిక్ విలేజీలోని హాకీ గ్రౌండ్స్‌లో గురువారం జరిగిన కుటుంబ గుర్తింపు, కుటుంబ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 119 నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా దీనిని చేపట్టామని, ఒక్క క్లిక్‌తో 30 శాఖల సమాచారం ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డులో వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. 'వన్ స్టేట్ వన్ కార్డు' విధానంతో సంక్షేమ పథకాలతోపాటు హెల్త్ ప్రొఫైల్‌ను పొందుపరుస్తామని తెలిపారు. పేదలకు ఇండ్లు కట్టించేందుకు, నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ప్రతిపక్షాలు కలిసిరావాలని చెప్పారు. నగరానికి మంచి భవిష్యత్తును అందించేందుకు చెరువులు, నాళాలు, మూసీ ఆక్రమణలు తొలగించాల్సిందేనని ఉద్ఘాటించారు.

బురద జల్లుకుంటూ తిరుగుతున్నరు

'ఏది పడితే అది వాగుడు.. అడ్డగోలుగా తప్పులు.. విపరీతంగా అప్పులు.. దాంతో రాష్ట్రం నిండా మునిగింది. ఇవాళ మేం సరిదిద్దుతామని చేస్తుంటే అడ్డం పడుతున్నరు' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడాలని తాము ముందుకు పోతుంటే దాని మీద కూడా బురద జల్లుకుంటూ బావ, బామ్మర్దులు తిరుగుతున్నారని, కిరాయి మనుషులతో హడావుడి చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చి, రూ.25 వేలు ఇస్తుంటే అభినందించాల్సి పోయి అన్యాయంగా మాట్లాడుతున్నారని తెలిపారు.

కేవీపీ ఫాంహౌస్‌ను కూల్చాలా వద్దా?

హైదరాబాద్ నగరాన్ని కాపాడాలనే ఉద్దేశంతో హైడ్రా, మూసీ ప్రాజెక్టులను తీసుకొచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ ప్రాంత పేదలకు ప్రత్యామ్నాయం ఏం చేయాలో చెప్పాలని, వినడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రతిపక్ష పార్టీల నేతలను కోరారు. అక్రమంగా నిర్మించుకున్న ఫాంహౌస్‌లను ఎక్కడ కూల్చివేస్తరోనని కేటీఆర్, హరీశ్‌రావు, సబితమ్మ పేద ఏడ్పులు ఏడుస్తున్నారని, కేవీపీ అక్రమంగా నిర్మించిన ఫామ్‌హౌస్‌ను కూ ల్చాలా వద్దా? అంటూ ప్రశ్నించారు.

ఈటలా.. మోదీ దగ్గరకెళ్దాం

మూసీ పరిధిలోని పేదలకు న్యాయం చేసేందుకు ఇద్దరం కలిసి మోదీ వద్దకు వెళ్దాం.. పాతిక వేల కోట్లు తీసుకొద్దాంరా.. అంటూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మూసీ కూల్చివేతలపై ఈటల అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి అరాచక శక్తి: ఈటల

సీఎం రేవంత్‌రెడ్డి.. చట్టం, సిస్టం లేని ఓ అరాచక శక్తి అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్‌పై ఆయన ఘాటుగా స్పందించారు. 'నీకు దమ్ముంటే ఇద్దరం విత్‌ఔట్ సెక్యూరిటీతో మూసీ పరీవాహక ప్రాంతంలో కూలగొట్టబోతున్న ఇండ్ల వద్దకు వెళ్దాం. 'శభాష్ రేవంత్‌రెడ్డి' అని ఒక్కరు అన్నా నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా. లేదంటే బహిరంగంగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తావా' అంటూ ప్రతిసవాల్ విసిరారు.

రాష్ట్ర ప్రభుత్వమే కూలుతుంది!

హామీలు అమలు చేయలేక హైడ్రా పేరిట డ్రామాలు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్3 (నమస్తే తెలంగాణ): మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూలిస్తే రాష్ట్ర ప్రభుత్వమే కూలుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్తీల్లోని పేదల బతుకులను కాంగ్రెస్ ప్రభుత్వం ఛిద్రం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తున్నదని ఆరోపించారు. దేశంలో ఎక్కడా, ఏ ప్రభుత్వమూ ఇలా పేదల ఇండ్లను కూల్చలేదని తెలిపారు. ముందు పెద్దలు నిర్మించిన ఎస్టేట్ కంపెనీలు, ఫాంహౌజ్‌లు, ఒవైసీ ఫాతిమా కాలేజీని కూల్చాలని సవాల్ విసిరారు. మంత్రి సురేఖ వ్యాఖ్యలు గర్హనీయమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతర మహిళల వ్యక్తిగత విషయాలను రాజకీయాల్లోకి తీసుకురావడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

జమ్మూకశ్మీర్ ఎన్నికలు

జమ్మూకశ్మీర్‌లో పదేండ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలు పలు రకాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ ఎన్నికలను కశ్మీరీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని చెప్పాలి. ఒకరకంగా చెప్పాలంటే ఆర్టికల్ 370 రద్దు ద్వారా కశ్మీర్‌కు దఖలు పడిన ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడంపై ఈ ఎన్నికలను ప్రజాభిప్రాయ సేకరణగా భావించవచ్చు. ఈ ఎన్నికల్లో 63.45 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల సగటు 57.89 కంటే ఎక్కువ. అంతేకాదు, 2008 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 61.01 కంటే ఎక్కువే. దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా, సోఫియాన్, కుల్గాం, ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లాల్లో ఓటింగ్ భారీగా పెరిగింది. దక్షిణ కశ్మీర్‌లో జమాతే ఇస్లామీ మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థులు, ఉత్తర కశ్మీర్‌లో బారాముల్లా ఎంపీ ఇంజినీర్ రషీద్ నేతృత్వంలోని అవామీ ఇత్తేహాద్ పార్టీ పోటీ కారణంగా పోలింగ్ శాతం పెరిగినట్టు అంచనా. 370 రద్దుతో ఓటుహక్కు పొందిన పాక్ కాందిశీకులు, వాల్మీకి తెగ ప్రజలు, గూర్ఖాలు ఈ ఎన్నికల్లో తొలిసారిగా తమ హక్కును వినియోగించుకోవడం విశేషం. వారి ఓటు నిర్ణయాత్మకం కావచ్చునే అంచనాలూ ఉండటం గమనార్హం.

కశ్మీర్ అస్తిత్వాన్ని సమూలంగా మార్చివేసిన బీజేపీ విధానాలకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష లాంటివి. పదేండ్ల క్రితం పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన బీజేపీ, పీడీపీలు ఈసారి విడివిడిగా బరిలోకి దిగాయి. బీజేపీ చేతుల్లోకి కశ్మీర్ వెళ్లకుండా అడ్డుకోవాలనే లక్ష్యంతో ఎన్సీ, కాంగ్రెస్ జట్టు కట్టాయి. స్థానిక సమస్యలు, కూడు, గూడు లాంటి అంశాలపై కాకుండా ప్రత్యేక హోదా పునరుద్ధరణ, రాష్ట్ర హోదాను తిరిగి కల్పించడం లాంటి అంశాల మీదే ఎన్నికల ప్రచారం సాగింది. రాష్ట్ర విభజన తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రమే చక్రం తిప్పుతున్నది. ఇది సగటు కశ్మీరీకి ఏ మాత్రం నచ్చని అంశమని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఒకవేళ ఈ ఎన్నికల్లో బీజేపీ గనుక గెలిస్తే ఆర్టికల్ 370 రద్దుకు ప్రజల మద్దతు ఉందని ప్రచారం చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా ప్రజలు కోరుకుంటున్న రాష్ట్ర హోదా పునరుద్ధరణ దిశగా అడుగులు వేయవచ్చు. అలా కాకుండా హంగ్ ఏర్పడి అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిస్తే మాత్రం ఎలాగైనా అధికారం చేజిక్కించుకునేందుకు స్వతంత్ర అభ్యర్థులు, చిన్నాచితకా పార్టీలను తనవైపు తిప్పుకోవాల్సి ఉంటుంది.

అదే కాంగ్రెస్, ఎన్సీ కూటమి గెలిస్తే రాష్ట్ర హోదా పునరుద్ధరించకుండా కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రాష్ట్ర హోదాతో పాటు ఆర్టికల్ 370 కోసం డిమాండ్లు ఊపందుకోవచ్చు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ చేయాలంటూ కూటమిలోని ఎన్సీ డిమాండ్ చేస్తుండగా, కాంగ్రెస్ కేవలం రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నది. ఈ కారణంగా కూటమి గెలిచినా ఎన్నాళ్లు అధికారంలో ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో జమాతే ఇస్లామీ, ఇంజినీర్ రషీద్, పీడీపీ మద్దతు కీలకం. ఏదేమైనప్పటికీ కశ్మీరీలు అధిక సంఖ్యలో వచ్చి ఓటింగ్‌లో పాల్గొనడం అభినందించాల్సిన విషయం. ఎలాంటి అల్లర్లు జరగకుండా, రీపోలింగ్ లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగియడం ప్రజాస్వామ్యానికి శుభసూచకం.

కదలని బీసీ డిక్లరేషన్



నర్సన్ బద్రి

2023, నవంబర్ 10 నాడు కామారెడ్డి పట్టణం వేదికగా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఆ పార్టీ గద్దెనెక్కేందుకు ఎంతో ఉపయోగపడింది. 2023 మేలో కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపునకు వ్యూహకర్తగా పనిచేసిన సునీల్ కనుగోలు ఇచ్చిన సలహాల్లో ఇదొకటి. కర్ణాటకలో కన్నా తెలంగాణలో బీసీ జనాభా ఎక్కువ ఉన్నందున బీసీల కోసం ఎన్నికల ముందు ఒక ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన అవసరాన్ని ఆయన సూచించారు. దాని ఫలితంగా ఆ పార్టీకి బీసీ ఓట్లు పెరిగాయనవచ్చు. అయితే బీసీ డిక్లరేషన్‌లోని హామీలేవీ ఇంతవరకు ఆ వర్గాలకు దక్కలేదు.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో బీసీ కులగణన చేయించి, ఆ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్ల పెంపు కూడా జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకున్న 23 శాతం కోటాను 42 శాతానికి పెంచుతామన్నారు. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ఇంతవరకు అసెంబ్లీలో ఆ పెంపు బిల్లు ప్రవేశపెట్టలేదు. ఇందు కోసం రూ.150 కోట్లు ఫిబ్రవరిలో మంజూరైనప్పటికీ పని మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. బీసీ కమిషన్‌కు కొత్త కార్యవర్గం నియామకమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి మార్గదర్శకాలు రానందున మరింత కాలయాపన జరుగుతున్నది.


స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం మనసులో ఏముందో అనే అనుమానం కూడా కలుగుతున్నది. కోర్టు ఆదేశాల మేరకు డిసెంబర్‌లోగా కులగణన, బీసీలకు రిజర్వేషన్ల పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు జరిగే అవకాశాలున్నాయా అనిపిస్తున్నది. ఎందుకంటే, ఈ దిశగా ప్రభుత్వ చర్యల్లో వేగం కావలసినంతగా కానరావడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన స్థానాల్లో కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు తగ్గిపోవడంతో కాంగ్రెస్ పార్టీకి ఒక భయం పట్టుకొన్నట్టుంది. ఏడాది తిరగకముందే గ్రామ స్థాయిలో పరాభవం ఎదురైతే పాలన ముందుకు సాగడం కష్టమైపోతుంది. అధిష్ఠానం దృష్టిలో రేవంత్ గ్రాఫ్ కూడా పడిపోవచ్చు. కాంగ్రెస్ పాత కాపులు తిరగబడవచ్చు. వీటన్నిటి కన్నా ఎలాగోలా కోర్టు ముందు మోకరిల్లి వీలైనంతకాలం సాగదీయాలని ముఖ్యమంత్రి ఆలోచన కావచ్చు.

జనవరి 31తో రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి, రాష్ట్రంలో గత తొమ్మిది నెలలుగా పంచాయతీరాజ్ వ్యవస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల చేతుల్లో కొనసాగుతున్నది. మాజీ సర్పంచుల పనుల బిల్లులు పూర్తిగా చెల్లింపు కాలేదు. వారు ఈ మధ్య గవర్నర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్థానిక సంస్థల్లో పాలకవర్గం లేనందువల్ల సమావేశాలు, తీర్మానాలు జరగక గ్రామాభివృద్ధి కుంటుపడుతున్నది. మరోవైపు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు లెక్క తప్పుతాయి. కులగణన, రిజర్వేషన్ల పెంపు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ బీసీలకు ఇచ్చిన ప్రధాన హామీ. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో తీర్చుతామన్న మాట ఏడాదిలో కూడా సాకారమయ్యేలా లేదు. బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న మరిన్ని హామీల గురించి కూడా ఇక్కడ ప్రస్తావించుకోవాలి.

ఏడాదికి రూ.20 వేల కోట్లు బీసీల సంక్షేమానికి ఖర్చు చేస్తామన్నారు. ఈ బడ్జెట్‌లో మాత్రం బీసీ సంక్షేమానికి రూ.9,200 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. బీసీ యువతకు వ్యాపారాలు, ఉన్నత చదువుల కోసం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని, థర్డ్ పార్టీ గ్యారెంటీ లేని రుణాలు ఇస్తామని అన్నారు. ఈ అప్పు బ్యాంకుల ద్వారానా, సర్కారే ఇస్తుందా అనే స్పష్టత లేదు. రూ.50 కోట్లతో జిల్లాకొక ప్రొ.జయశంకర్ ఐక్యత భవన్‌ను నిర్మించి వాటిలో స్టడీ సర్కిల్, లైబ్రరీ, క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. వృత్తుల వారికి వృద్ధాప్య పింఛన్ వయసును 57 నుంచి 50కి తగ్గించి, ఇప్పటికే గౌడ, నేత వృత్తుల వారికి ఇస్తున్న ఈ పింఛన్‌ను మంగలి, వడ్రంగి, చాకలి, కమ్మరి, కంసాలి వృత్తుల వారికి కూడా వర్తింపజేస్తామని డిక్లరేషన్ ఇచ్చారు. వీటి అమలు కోసం బీసీ నేతలు పార్టీలు, రాజకీయాలకతీతంగా ఐక్యమై ప్రభుత్వాన్ని నిలదీయవలసిన అవసరం ఉన్నది.

సంకటాలు తగిలించుకొని..!

సంకటాలు తగిలించుకొని మీసాలు పీక్కుంటే ఏం లాభం?.. అనేది పెద్దల ఉవాచ. లోకపు తీరుతెన్నులు సుదీర్ఘకాలంగా చూసిన అనుభవం ఆ వ్యాఖ్యలో ఉన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది సరిగ్గా సరిపోతుంది. తమకు ఇంటా వంటా అలవాటు లేని చెరువుల రక్షణ, కాలుష్య నివారణ అంటూ బయల్దేరి దాన్ని ఎలా చేయకూడదో అలా చేసి.. ఆఖరికి మింగాకక్కాలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. మొన్న హైకోర్టు వాయింపులు విన్న తర్వాత సర్కారులో మల్లగుల్లాలు మొదలయ్యాయంటున్నారు. ఏమైనా తగిలించుకున్నంత తేలిక్కాదు, వదిలించుకోవడం.



పాయింట్ బ్లాంక్

- సవాల్ రెడ్డి

తెలంగాణ రాకముందు అనుకుంటా ఓ పాత్రికేయుడు తన వారాంతపు కాలమ్‌లో 'తెలంగాణ పునర్నిర్మాణం అంటే ఇపుడున్నవన్నీ కూల్చేస్తారా?' అని ప్రశ్నించాడు. సరే.. ఆయన అక్కసు ఆయనది! ఆ మాటకొస్తే అక్కసు అనే పదానికి ఆయనే ఓ బ్రాండ్ అంబాసిడర్!! అయినా తెలంగాణ వచ్చింది. వచ్చిన తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ఏం కూల్చిందో.. ఏం నిర్మించిందో.. పునర్నిర్మాణం అంటే ఏమిటో ప్రజలకు, అలాగే సదరు పాత్రికేయుడికి కూడా; అనేక రూపాల్లో అనుభవంలోకి వచ్చి ఉంటుంది. కేసీఆర్ చేపట్టిన పునర్నిర్మాణంలో ఏదీ కూల్చకపోగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ, జలవనరుల కల్పన, తాగునీరు, సాగునీరు, వ్యవసాయ స్థిరీకరణ, రహదారుల నిర్మాణం, ఐటీ రంగ అభివృద్ధి, సీనియర్ సిటిజన్లకు భరోసా, ఉద్యోగస్థుల సంక్షేమం, చేతి వృత్తులకు చేయూత ఇలా అనేక రంగాలు దేశానికి ఆదర్శం అనే స్థాయిలో పునర్నిర్మాణం జరిగింది. మొన్నటికి మొన్న ప్రధాని మన్ కీ బాత్‌లో పేర్కొన్న పచ్చదనం పెంపు సహా ఇవాళ్టికీ ఇక్కడ జరిగిన అభివృద్ధి ఇంకా వార్తల్లోకెక్కుతూనే ఉన్నది. ఎవరికి నచ్చినా, నచ్చకున్నా.. ఎవరెన్ని వంకర అర్థాలు తీసినా అదంతా ఒక సుజల.. సుఫల.. చరిత్ర.

పదేండ్ల తర్వాత ఇపుడు తెలంగాణలో జరుగుతున్నదేమిటి? హైదరాబాద్‌లో జరుగుతున్నదేమిటి? అపుడెపుడో ఆ పాత్రికేయుడు చెప్పిన కూల్చివేతల విధ్వంసకాండే కదా! దానికి చెరువుల రక్షణ, పర్యావరణ రక్షణ, కాలుష్య నివారణ అనే ట్యాగ్‌లైన్. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వమే కర్కశంగా పేద ప్రజల జీవికను చిదిమివేసే, గూడు నుంచి తరిమేసే ప్రక్రియ. కూలిన శిథిలాలు, గుండెలవిసే పేదల రోదనలు.. కండ్లముందు గుండె బరువెక్కే దృశ్యాలు. ఇదే కేసీఆర్ హయాంలో జరిగి ఉంటే..

'ఇందుకేనా తెలంగాణ తెచ్చుకుంది?', 'ఇదేనా బంగారు తెలంగాణ?' అనే సొల్లు డైలాగులు చాలా చాలా వినిపించేవి. పచ్చ టీవీల్లో మేధావులు నెత్తి గోక్కుంటూ, ముక్కుచెవుల్లో వేళ్లు దూర్చుకుంటూ చాలా చాలా ప్రవచనాలు చెప్పేవారు. పచ్చ పత్రికల ఎడిట్ పేజీలు కన్నీటి జలపాతాలు కురిపించేవి. తమాషాగా ఇపుడు అవేం లేవు. సరికదా.. 'చాక్లెట్ తింటే జలుబు చేస్తుందమ్మా..!' అని చిన్న పిల్లలకు గారంగా చెప్పిన రీతిలో 'జాగ్రత్త రేవంత్... ఇలా చేయకూడదమ్మా!' అంటూ సుతిమెత్తని సలహాలు పరిచేస్తున్నాయి. ఇంకా పచ్చ పర్యావరణవేత్తలను రంగంలోకి దింపినట్టు లేదు.

అయినా దబాయింపులు..!

కొత్త ఎద్దు పెండ ఇంటిల్లిపాదీ పోటీ పడి ఎత్తిపోస్తారని.. ఓ పూర్వకాలపు సామెత. కొత్త కదా ఆ మోజు ఉంటుంది. రాష్ట్రంలో మంత్రులకు కూడా ఇంకా అధికారం చేపట్టిన మురిపం పాతబడినట్టు లేదు. విమర్శ ఎదురైతే చాలు ఒంటి కాలు మీద లేస్తున్నారు. ఈ విధ్వంసకాండపై జరుగుతున్నదంతా 'బిల్డర్లు ఆడుతున్న నాటకమని' భట్టిగారు భాష్యం చెబుతుంటే.. 'ఆక్రమణ చేస్తే బుల్డోజర్లు రావా?' అని శ్రీధర్‌బాబు గారు ఆవేశపడిపోతున్నారు. 'ఐదొందలు, ఆరొందలు ఇచ్చి మాట్లాడిస్తున్నార'ని కూడా అనేశారు. పొన్నం గారు సోషల్‌మీడియా.. కేసులు అంటూ ఆయన శైలిలో స్పందిస్తున్నారు. కోమటిరెడ్డి వారు మా నల్గొండ మూసీ కాలుష్యం కడిగేద్దామంటే బీఆర్ఎస్ వాళ్లు అడ్డం పడుతున్నారనేంత దాక పోయారు. మరి అదే నల్లగొండ ఫ్లోరైడ్ బారిన పడి జీవచ్ఛవమవుతుంటే కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో! ఎలా ఆదుకుందో మాత్రం చెప్పలేదు. ఇక బాధితులతోనే 'ఆహా ఎంత బాగా కూల్చారో' అంటూ వాళ్ల సోషల్ మీడియా టీమ్ బైట్లతో బయటపడాలని సర్వశక్తులు ధారపోస్తున్నారు. కానీ వర్కవుటే కావడం లేదు. ఎరక్కపోయి ఇరుక్కున్న అధికారులదీ అదే సీను. 'మూసీ మార్కింగ్‌తో మాకు సంబంధం లేద'ంటూనే ఆ బాధ్యతలు చూసే దానకిశోర్‌గారితో కలసి రంగనాథ్‌గారు గంటన్నర పాటు హైడ్రా మీద వివరణలు ఇచ్చుకున్నారు. రెండింటికీ సంబంధమే లేకపోతే ఇద్దరూ కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్ ఎందుకు పెట్టినట్టు అనే ప్రశ్నకు జవాబు లేదు. ఆ మాటకొస్తే హైకోర్టు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర కూడా జవాబులు లేవు.

సమస్య ఏమిటి? పరిష్కారమేమిటి?

'వన్నెలమ్మను వంటకు పెడ్తే ఇంటిల్లిరాజులను ఉపాసం పండబెట్టిందని' తెలంగాణ సామెత. ఆరు గ్యారెంటీలు అని అదరగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ పథకాలు అమలుచేస్తారని ప్రజలు అనుకుంటే అవన్నీ పక్కనబెట్టి డ్రామాలు, డైవర్షన్లు మొదలుపెట్టారు. ఇంత విధ్వంసకాండ చేపట్టడానికి ప్రభుత్వం, మంత్రులు చెప్తున్న కారణం ఏమిటి? చెరువులు ఆక్రమించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, కాలుష్య ప్రక్షాళన వగైరా. అసలు హైదరాబాద్ ప్రధాన సమస్య ఏమిటి? నగరంలో కురిసే వర్షపు నీరు ముంపు సమస్య లేకుండా బయటకు పోవడం. నిలిచే నీరు బయటకు వెళ్లాలంటే రెయిన్ డ్రెయిన్ నాలాలు విస్తరించాలి. అవసరమైన చోట నిర్మించాలి. అది వదిలేసి విధ్వంసాలకు దిగారు. లేదూ.. చెరువులను రక్షించడమే ప్రధానం అనుకుంటే ముందు ఆయా చెరువుల క్యాచ్‌మెంట్ ఏరియాల్లో ఇవాళ మారిన వాతావరణ పరిస్థితుల్లో నిజంగా అక్కడ వర్షపాతం గతంలో మాదిరిగానే ఉందా? అది ప్రవాహమై చెరువుల్లోకి చేరేంత స్థాయిలో ఉంటున్నదా? నగర విస్తరణలో భూ వినియోగంలో మార్పులు వచ్చాక ఎక్కడికక్కడ భూమి చదును చేయబడిన తర్వాత ఇపుడూ ఆనాటి పాత పరిస్థితే ఉందా? అనేది సమగ్రంగా సర్వే చేయాలి. నమ్మదగిన ప్రవాహం ఉందంటే అడ్డుగా ఉన్న నిర్మాణాలన్నీ తప్పకుండా తొలగించాలి. అలాకాకుండా గుడ్డిగా ఓ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, మూసీ ఫ్రంట్ అంటూ గీతలు గీసి ఆ పరిధిలో నిర్మాణాలన్నీ కూలిస్తే కలిగే ప్రయోజనం ఏమిటి? ట్రిబుల్ వన్ జీవోయే దీనికి మంచి ఉదాహరణ. ఎలా నిర్ధారించారో తెలియదు గానీ, 500 చదరపు కిలోమీటర్ల మేర 84 గ్రామాలను ఈ జీవో కిందకు తెచ్చారు. అది 1996 నాటి జీవో. ఇవాళ 2024. ఈ సుదీర్ఘ కాలగమనంలో, మారిన పరిస్థితుల్లో పాతకాలపు వర్షపాతాలు, నీటి ప్రవాహాలు, గతంలో మాదిరిగా లేవనేది ప్రజల వాదన. అంతే కాదు, ఆ పరిధిలో భూ వినియోగంలో భారీ మార్పులు వచ్చాయంటున్నారు.

ఒకప్పుడు ఖాళీగా పడావుగా ఉన్న భూములు, బీళ్లు, మైదానాలు కూడా పంట పొలాలు, ఇతర రూపాల్లోకి మారాయంటున్నారు. గ్రామాలు కూడా బాగా విస్తరించాయని, పట్టణీకరణ ప్రభావం బాగా పెరిగిందంటున్నారు. అంతేకాదు, సాక్షాత్తూ ప్రభుత్వమే ఆ పరిధిలో రహదారులు, ఇతర నిర్మాణాలు చేసిందని కూడా చెప్తున్నారు. నగర విస్తరణకు ఈ ప్రాంత అభివృద్ధికి కూడా ఈ జీవో ప్రధాన అడ్డంకిగా మారిందంటున్నారు.

పర్యావరణ రక్షణ అవసరమే. కానీ, అది గుడ్డి గుర్రం కాకూడదు. ప్రజల కోసం చట్టాలుంటాయి తప్ప, చట్టాల కోసం ప్రజలు కాదు. ఒకప్పుడు ఈ భూగోళమంతా చెట్లు, గుట్టలు, పుట్టలు, పశుపక్ష్యాదులతో నిండి ఉండేది. ఆది మానవుని ప్రయాణం అక్కడ ప్రారంభమైంది. ఆహార సంపాదనతో మొదలైన ఆ యాత్ర; సామూహిక జీవితం, వ్యవసాయ క్షేత్రాలు, స్థిర నివాసాల ఏర్పాటు, గ్రామాలు, నగరాల నిర్మాణం వరకు చేరడం మానవజాతి చరిత్రలో ఓ మజిలీ. అంతే కాదు, ప్రతి ప్రాచీన నగరమూ నదీ తీరాల్లోనే వెలిసింది. నదీ తీరాల్లోనే నాగరికత వర్ధిల్లింది. నదీ తీరాల చుట్టే మానవుని ఉనికి కొనసాగింది. జనావాసాలు పెరిగాయి. అందువల్ల ఆ నదులేం ఇంకిపోలేదు. ఎండిపోలేదు. అలా అని ప్రాచీన కాలపు నదులన్నీ ఏ మార్పు లేకుండా ఇప్పటిదాక సజీవంగా ఉన్నదీ లేదు. మన దేశంలోనే వేదాలు ఉద్ఘాటించిన సరస్వతి నది ఇపుడు లేదు. అది లేనంతమాత్రాన ప్రపంచం మునిగిపోనూ లేదు. ఈ భూగోళం, దాని ఉపరితలం, సమస్త భూగోళాన్ని ఆవరించుకున్న పర్యావరణం, రుతుపవన చక్రం కాలానుగుణంగా వచ్చే అన్ని మార్పులను తమలో ఇముడ్చుకొని సమన్వయపరుచుకుని ముందుకుసాగుతూనే ఉన్నాయి. ఇది వేల వేల ఏండ్ల అనుభవం.

అసలు చెట్టు కొట్టకుండా.. గుట్ట తవ్వకుండా.. రాళ్లు పగులకుండా, పుట్ట తీయకుండానే మానవ నాగరికత ముందుకుసాగిందా? వాటిని ముట్టకుండానే మానవ నివాసాల ఏర్పాటు జరిగిందా? మహా మహా పట్టణాలు, నగరాలు ఏర్పడ్డాయా? పండ్ల తోటలు, పంట పొలాలు, చెరువులు పుట్టుకువచ్చాయా? పరిశ్రమలు, గనులు, ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందా? మానవుని పురోగమనంలో ఏర్పడే అవసరాలు, జీవిక, సుఖ నివాసం, సురక్షిత సామూహిక జీవనం, పురోగమనం సాధించడానికి అనుగుణంగా మానవుడు ప్రకృతిని వాడుకోవడం, ప్రకృతికి అనుగుణంగా మానవుడు మారడం రెంటినీ సమతుల్యం చేసిన తీరే నాగరికత. ప్రపంచవ్యాప్తంగా నగరీకరణ వేగంగా జరుగుతున్న సమయంలో నగరాల మీద జనసాంద్రత ఒత్తిడి తీవ్రమవుతున్న సమయంలో ఓ గిరి గీసుకొని కూర్చోవడం ప్రాక్టికల్‌గా సాధ్యపడేదేనా? అనేదీ ఆలోచించాల్సిందే!

గుడిసెలు వేసి ఆక్రమించిందెవరు?

పేద ప్రజలు అనే సాకును అడ్డం పెట్టుకొని నగరంలో ఎక్కడ పడితే అక్కడ వందల గుడిసెలు వేసి అడ్డగోలు ఆక్రమణలు చేసిన ప్రఖ్యాత కాంగ్రెస్ నాయకుడెవరో, ఆ పనులు చేసినందుకు ఆయన ఏ పేరుతో ఫేమస్ అయ్యాడో ప్రజలకు తెలియదా? ఆయన కారణంగా నగరంలో ఎన్ని ప్రాంతాల్లో భూములు వివాదాస్పదమయ్యాయో తెలియదా? ఆయనొక్కడేనా? రామంతాపూర్ చెరువు ఎవరి హయాంలో ఎవరు ఆక్రమించారో అక్కడి ప్రజలకు తెలియదా? మూసీ మత్తడి నాలా మీద ఆక్రమణలు ఎవరు చేశారో తెలియదా? ఎవరి పాలనలో నాలాలు పిల్ల కాల్వల కన్నా అధ్వాన్నంగా మారాయో తెలియదా? అలాంటి అనేక చెరువుల ఆనవాలు కూడా మిగలకుండా మింగిందెవరో.. చెత్తపోసి.. మట్టిని నింపి ఒక్కో చెరువును ఎలా ఆక్రమించుకుంటూ వచ్చారో ఎక్కడికక్కడ ప్రజలు ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటూనే ఉన్నారు. ఇవన్నీ తెలంగాణ రాకముందు జరిగినవే.

పర్యావరణం అంటే కేవలం చెరువులేనా?

పర్యావరణ రక్షణ అంటే కేవలం నీటి వనరుల రక్షణే కాదు. కొండలు, గుట్టలు, అడవులు కూడా రక్షించాలి. వాయు కాలుష్యం కూడా నివారించాలి. తమాషా ఏమిటంటే నగరాల్లో నీటి కుంటల రక్షణ పేరిట గగ్గోలు పెట్టే పాత్రికేయ మేధో సమూహాలు.. అటవీ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసుకునేవారికి మాత్రం పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తాయి. అనేక ఏండ్లుగా సాగు చేస్తున్నారని సపోర్టింగ్ సర్టిఫికెట్లు కూడా ఇస్తాయి. చెరువుల ఆక్రమణ పర్యావరణ విధ్వంసమే అయినపుడు అడవుల నరికివేత మాత్రం విధ్వంసం ఎందుకు కాదు? అంటే వారి దగ్గర జవాబుండదు. ఖమ్మం జిల్లాలో అయితే పోడు భూములకు పట్టాలు అనేది చాలామంది నాయకులకు ఒక జీవితకాలపు ఆదాయ మార్గంగా మారుతున్న వైనాన్ని మాత్రం పొరపాటుగా ఈ సమూహాలు ఎత్తిచూపవు. తెలంగాణ రాకముందే గిర్‌గ్లానీ కమిషన్ ఖమ్మం జిల్లా సహా రాష్ట్రంలో ఎంత అడవి ఎలా అన్యాక్రాంతమైందో ఒక నివేదిక కూడా ఇచ్చింది. అందులో సింహభాగం ఖమ్మం జిల్లా అడవుల అన్యాక్రాంతంపైనే చర్చించింది. తెలంగాణ వచ్చిన నాటికి కాగితాల మీద ఉన్న అడవులకు క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతనే లేదు. మరి ఆ అడవంతా ఎవరు మింగేసినట్టు? ఎవరి హయాంలో మింగేసినట్టు? ఇక కొండలు, గుట్టల పరిస్థితి ఏమిటనేది అందరి అనుభవంలో ఉన్నది. మన కండ్ల ముందే ఎన్ని గుట్టలు మాయమయ్యాయో చూశాం. అలా గుట్టలను క్వారీలకు లీజు ఇవ్వడం అనే జీవో ఎప్పుడు ఎవరి హయాంలో వచ్చింది? అందరికీ తెలుసు.

కహానీల కాంగ్రెస్..

చెరువులు- ఆక్రమణలు-కాలుష్యం- ప్రక్షాళన అంటూ అలవాటు లేని భారీ డైలాగులు వల్లిస్తున్న కాంగ్రెస్ పార్టీ చెప్పాల్సిన జవాబు ఒకటుంది. కాకతీయులు, కుతుబ్‌షాహీల కాలం నుంచి తెలంగాణవ్యాప్తంగా నిర్మించిన సముద్రాల్లాంటి చెరువులన్నీ ఎవరి హయాంలో ఆనవాళ్లు లేకుండా ధ్వంసమైపోయాయి? ఎక్కడికక్కడ ఆ చెరువులను కబ్జాలు పెట్టింది ఏ పార్టీ నాయకులు? చిన్న నీటిపారుదల శాఖను పట్టించుకోకుండా చెరువులకు మరమ్మతులే లేకుండా గాలికి వదిలేసిన అసమర్థ పాలకులెవరు? అసలు కాంగ్రెస్ పాలనలో ఏ చెరువును బతుకనిచ్చారు. ఏ చెరువును మిగలనిచ్చారు. రాష్ట్రంలో సింహభాగం బస్‌స్టాండ్‌లన్నీ చెరువుల్లో కట్టినవే. కరీంనగర్ బస్టాండ్, కలెక్టరేట్ కట్టింది చెరువులో కాదా? సిరిసిల్ల బస్ డిపో, బస్ స్టాండు కట్టింది చెరువులో కాదా? నగరంలోని ఎంజీబీఎస్ బస్టాండు మూసీ నది మధ్యలో కట్టారు కదా! జీహెచ్ఎంసీని హుస్సేన్‌సాగర్ నాలా మీదే కట్టారు కదా? ఎవరు కట్టారో, ఎవరు ప్రారంభించారో శిలాఫలకాల మీద సజీవంగానే ఉంది.

ఇలా లెక్కపెడుతూ పోతే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు ఇలా అన్నిటికన్నీ ప్రభుత్వాల నిర్మాణాలే, నిర్వాకాలే. వీటన్నిటికీ ఎవరు బాధ్యత వహిస్తారు? అలాగే పచ్చని పంట పొలాలు పర్యావరణ రక్షణ కాదా? మరి ట్రిపుల్ ఆర్ పేరిట వేల ఎకరాలు సేకరించి రహదారులు వేస్తే జరిగే పర్యావరణ విధ్వంసం మాటేమిటి? వ్యవసాయ వర్సిటీలోని అరుదైన లక్షల వృక్షజాలాన్ని తొలగించి నిర్మాణాలు చేపట్టాలనుకోవడం పర్యావరణ విధ్వంసం కాదా? దాన్ని ఎట్లా సమర్థిస్తారు? దానికి కాంగ్రెస్ దగ్గర జవాబుందా?

ఇక్కడ ఒకటే ప్రశ్న! ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్ల ఆక్రమణ కాలుష్య ప్రక్షాళనంటూ.. దానికి కూల్చివేతే సరైన శిక్షగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వం.. బుల్డోజర్లు పంపితే తప్పేంటి? అని ప్రశ్నిస్తున్న సచివులు.. మరి ఆ ఇండ్లకు అనుమతులు ఇచ్చిన అధికారులను ఎందుకు శిక్షించరు? సదరు ఇండ్లకు దశాబ్దాలుగా పన్నులు వసూలు చేసిన జీహెచ్ఎంసీని ఎందుకు శిక్షించరు? విద్యుత్, రహదార్లు, మంచినీరు అందించిన ప్రభుత్వ శాఖలను ఎందుకు శిక్షించరు. అసలు ఆక్రమణల నుంచి ప్రారంభించి సదరు స్థలాలకు పట్టాలిచ్చి.. అనుమతులు, సౌకర్యాలు కల్పించి పన్నులు వసూలు చేసిన సదరు ప్రభుత్వాలను ఎందుకు శిక్షించరు? ఆ ప్రభుత్వాల్లో పనిచేసిన మంత్రుల మీద కేసులెందుకు పెట్టరు? రాష్ట్రవ్యాప్తంగా వేలాది చెరువులను ధ్వంసం చేసిన ప్రభుత్వాలను ఎందుకు శిక్షించరు? ఎందుకు అభిశంసించరు? తెలంగాణను సర్వనాశనం చేసి, నీటివనరులు ధ్వంసం చేసి, రైతులను వలస జీవులను చేసిన విధ్వంసక ప్రభుత్వాలను.. ఎందుకు నడిరోడ్డు మీద నిలబెట్టరు? ఆ ప్రభుత్వాలను నడిపిన పార్టీలకు ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేదంటూ గుర్తింపును ఎందుకు రద్దు చేయరు? అది వదిలేసి నోరు లేని పేదల మీద, మధ్య తరగతి ప్రజల మీద పడతారా?

తరలింపు జీవన విధ్వంసమే!

ఎక్కడి నుంచో ప్రజలను ఖాళీచేసి ఇంకెక్కడికో తరలించడమంటే ఆ ప్రజల జీవికను ధ్వంసం చేయడమే. పేద ప్రజలకు నగరాల్లో ఇల్లు అంటే కేవలం తలదాచుకునే చోటు కాదు. ఆ ప్రాంతం చుట్టూనే వారి జీవితం అల్లుకుపోయి ఉంటుంది. ఆ ప్రాంతానికి దగ్గర్లోనే ఆ కుటుంబసభ్యులు జీవనాధారమైన ఏవో పనులుంటాయి. ఆ సంపాదనతోనే ఇల్లు గడుపుకుంటారు. ఆ ఇంటి పిల్లలు ఆ చుట్టు పక్కలే ఏదో స్కూల్లో చదువుకుంటారు. రోగమో, నొప్పో వస్తే ఆ చుట్టుపక్కలే ఉండే చిన్న చిన్న దవాఖానలను ఆశ్రయిస్తారు. కష్టాల్లో సుఖాల్లో చుట్టుపక్కల వారి సహాయం, మద్దతు పొందుతారు. ఇపుడు వారందరినీ ఊరి బయట ఎక్కడికో పంపేస్తే కొత్త ప్రదేశాల్లో వారి జీవనాధారం ఏమిటి? వారి సంపాదన ఏం కావాలి? పిల్లల చదువులేం కావాలి? రోగమో, నొప్పో వస్తే వారికి ఎవరు సాయంగా రావాలి? రేకుల గుడిసె నుంచి తరలించి డబుల్‌బెడ్ ఇల్లు ఇచ్చినా ఆ చోట వారి జీవితం ముందుకు సాగుతుందా?

ఇది పర్యావరణ విధ్వంసాన్ని మించిన అమానవీయ విధ్వంసం. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిందే. అయితే, ఆ పేరుతో ప్రజల జీవికను ధ్వంసం చేయడమేమిటి? చట్టం మనిషి కోసమా? మనిషి చట్టం కోసమా? ఆధునిక సంక్షేమ సమాజాల్లో ప్రభుత్వాలకు ప్రజలే ప్రధానం కావాలి. చట్టాలు ప్రజలకు మరింత సంక్షేమం, సౌకర్యం కల్పించి వారి జీవితానికి ఆలంబన కావాలి. అంతే తప్ప చట్టం ఒకటి ఉంది కదా అని వారి జీవితాలను దుర్భరం చేస్తారా?

గుణపాఠాలు నేర్వని కాంగ్రెస్..

ఎపుడో చరిత్రలో చదువుకున్నాం.. రజాకార్లు ఊళ్ల మీద పడి ఇండ్లు కూల్చేసే వారని. ఇపుడు కండ్లముందు చూస్తున్నాం. కాంగ్రెస్ చరిత్రను పట్టించుకోదో.. లేక లక్ష్యపెట్టదో తెలియదు కానీ, ఇలా కూల్చివేతల పర్యవసానం ఏమిటో ఆ పార్టీ అనుభవంలో ఉన్నది. ఎమర్జెన్సీలో ఢిల్లీలో తుర్క్‌మన్‌గేట్ ప్రాంతంలో రహదారి నిర్మాణం కోసం వందల ఇండ్లను కూల్చేసిన పాపం, దానిపై జరిగిన ప్రచారం.. ఆ తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఘోర పరాజయానికి... ఇందిర, ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ ఓటమికి కూడా దారితీసింది. ఒక పక్షి కూడా తన గూడు చెరిపేస్తే తిరగబడుతుంది. ఇక్కడున్నది ఆలోచనాశక్తి ఉన్న ప్రజలు. ఢిల్లీ పెద్దల మేలు కోసం రాత్రికి రాత్రి వేలాది మంది ప్రజల గూడు లాగేస్తామంటే కుదరదు. అంతేకాదు, ప్రజలు వ్యక్తిగత నష్టం జరిగితేనే స్పందిస్తారని, ఇది కొద్దిమంది సమస్య కాబట్టి ఇతరులు పట్టించుకోరనేది తప్పుడు అంచనా. సమాజానికి సామూహిక స్పందన అనే లక్షణం ఉంటుంది. సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తారు. మంచిని మంచి.. చెడును చెడు అంటారు. ఎక్కడో ఢిల్లీలో ఓ అమ్మాయి మీద అత్యాచారం జరిగితే దేశమంతా స్పందించింది. ఇంకెక్కడో ఎవరో నాయకుడు అవినీతికి పాల్పడితే చీదరించుకుంది. ఇది సమాజ లక్షణం. ఇండ్లను కూల్చేసే బుల్డోజర్ విన్యాసాలను... పేదల ఇండ్లు కూలి వారు కుమిలి కుమిలి కన్నీరు కారుస్తున్న వైనాన్ని, గుండెలు పగిలేలా చేస్తున్న ఆక్రందనలను చూస్తున్నారు. వృద్ధుల నుంచి చిన్నపిల్లల వరకు ఎలా ఇబ్బందులు పడుతున్నారో కూడా చూస్తున్నారు. బీజం చిన్నదే కావచ్చు. కానీ మొక్కై, మానై పెరగడానికి పెద్దగా సమయం పట్టదు. బెల్లపేదో, నల్లపేదో కాలం చెప్తది.

70వ దశకంలో ఇందిర హయాంలో చూసేవాళ్లం.. ఎండకాలం దొంగల బెడదతో ఊళ్లో వంతులు వేసుకొని తెల్లార్లూ కాపలా గస్తీ తిరిగేవారు. ఇపుడు మూసీ తీరంలో ప్రజలు అదే చేస్తున్నారు. నిజమే.. ఇందిరమ్మ రాజ్యం మళ్లీ వచ్చింది!



ఎవరి హయాంలో ఎన్ని ఆక్రమణలు?

పీఆర్ స్టంట్‌లు ప్రతిసారీ వర్కవుట్ కావు. చెరువుల ఆక్రమణల తొలగింపు, కాలుష్య నివారణ, ప్రక్షాళన అనే ఆదర్శ ట్యాగ్‌లు అంత తొందరగా ఒళ్లో వచ్చి వాలవు. ఈ ఆక్రమణలన్నీ ఏదో కేసీఆర్ హయాంలోనే జరిగినట్టు, మూసీ నది మొత్తం కేసీఆర్ ప్రభుత్వమే కాలుష్యమయం చేసినట్టు చిత్రీకరిద్దామనుకుంటే కుదరదు.

నగరంలోని చెరువుల ఆక్రమణ చరిత్ర, మూసీ కాలుష్య చరిత్ర ఇదే నగరంలో నివసించే ప్రజలకు తెలియదా? అసలు ఈ రాష్ట్రాన్ని దశాబ్దాల పాటు ఏలిందెవరు? నగరంలోని వేల కొద్దీ చెరువులన్నీ ఎవరి హయాంలో కబ్జాదారుల పాలయ్యాయి; అనే విషయం తెలియనంత అమాయకులా ప్రజలు? కేసీఆర్ ప్రభుత్వం 2020లో సేకరించిన వివరాల ప్రకారం తెలంగాణ వచ్చేనాటికి హెచ్ఎండీఏ పరిధిలో మాయమైనవి పోనూ మిగిలినవి 3,778 చెరువులు. జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే చెరువుల్లో సగానికిపైగా ఆక్రమణల్లోనే ఉన్నాయని ఆ సర్వేలో తేలింది. అందులో 350 చెరువుల ఆక్రమణ కేసులు కోర్టులో ఉన్నాయని కూడా తెలిసింది. మరి ఈ ఆక్రమణలన్నీ ఎవరి హయాంలో జరిగినట్టు? ఎవరి హయాంలో జరిగిన ఆక్రమణల మీద కోర్టులో వందలాది కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు?

ఒక పక్షి కూడా తన గూడు చెరిపేస్తే తిరగబడుతుంది. ఇక్కడున్నది ఆలోచనాశక్తి ఉన్న ప్రజలు. ఢిల్లీ పెద్దల మేలు కోసం రాత్రికి రాత్రి వేలాది మంది ప్రజల గూడు లాగేస్తామంటే కుదరదు. అంతేకాదు, ప్రజలు వ్యక్తిగత నష్టం జరిగితేనే స్పందిస్తారని, ఇది కొద్దిమంది సమస్య కాబట్టి ఇతరులు పట్టించుకోరనేది తప్పుడు అంచనా. సమాజానికి సామూహిక స్పందన అనే లక్షణం ఉంటుంది. సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తారు.

మంచిర్యాలలో మార్కెట్ కూల్చివేత!

ప్రభుత్వ నిర్మాణాన్ని కూల్చుతున్న అధికారులు • కొత్త దవాఖాన నిర్మాణం పేరిట విధ్వంసం • కేసీఆర్ హయాంలో నిర్మాణం ప్రారంభం

మంచిర్యాల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి అధికారిక పార్టీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (పీఎస్సార్) తెరలేపారు. మాతా, శిశు హాస్పిటల్ ఏర్పాటు పేరిట జిల్లా కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను గురువారం నుంచి కూల్చివేయిస్తున్నారు (ఇంకా కొనసాగుతున్నది). గత ప్రభుత్వం ప్రతి మున్సిపాలిటీకి ఒక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉండాలన్న ఉద్దేశంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఈ నిర్మాణాన్ని చేపట్టింది. ఇందుకోసం రూ.7.20 కోట్లు కేటాయించి, దాదాపు రూ.4 కోట్ల విలువ చేసే పనులను కూడా పూర్తి చేసింది. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. ఇప్పుడు ఆ భవనాన్ని అర్ధాంతరంగా కూలుస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఉన్న రెండెకరాల ఆరు గుంటల భూమితోపాటు దాని వెనక ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్డీవో కార్యాలయం ఉన్న భవనం సహా వాటర్ ట్యాంక్ మొత్తం 4.22 ఎకరాలు ఇప్పుడు నూతన హాస్పిటల్ నిర్మాణానికి ఇచ్చారు. దీంతో ఈ రోజు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూలుస్తుండగా.. త్వరలో రూ.3 కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ (ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కార్యాలయానికి కేటాయించారు), రూ.3 కోట్లు విలువ చేసే పాత ఆర్‌అండ్‌బీ ఆఫీస్ భవనాలను కూడా కూల్చనున్నట్టు తెలిసింది. హాస్పిటల్ నిర్మాణం పేరిట దాదాపు రూ.10 కోట్ల విలువైన ఆస్తులను కూలుస్తుండటంపై స్థానికులు మండిపడుతున్నారు.

జీవో రాకముందే కూల్చివేతలు

4.22 ఎకరాల్లో హాస్పిటల్ నిర్మించాలంటే మున్సిపాలిటీ సహా ఆర్‌అండ్‌బీ శాఖలు ఆ భూమిని టీఎస్‌ఎంఐడీసీ (తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)కు అప్పగించాలి. ఈ మేరకు మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ శాఖలు ఆ భూమిని టీఎస్‌ఎండీసీకి ఇస్తున్నట్టు లేఖలు అందజేశాయి. కానీ.. దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సర్కారు ఆర్డర్ రాలేదని, ఎలాంటి ఆదేశాలు రాకముందే ఇలా కూల్చివేతలు చేస్తున్నారని టీఎస్‌ఎండీసీకి అనుసంధానంగా పని చేసే జిల్లా అధికారి ఒకరు తెలిపారు. ఇలా ఏ ఆర్డర్ లేకుండా ఎలా కూల్చేస్తున్నారనేది అర్థం కావడం లేదు. అసలు ఆ అధికారం వీరికి ఎవరిచ్చారు? అనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కూల్చివేస్తుండటంపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్‌ను వివరణ కోరగా.. కూల్చివేతల విషయం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లే చూసుకుంటున్నారని చెప్పారు. తమకు ఈ విషయంలో సంబంధం లేదని, కూల్చివేత పర్మిషన్లు కూడా వాళ్లే తీసుకుంటారని స్పష్టంచేశారు. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్‌ను వివరణ కోరగా.. స్థలాన్ని టీఎస్‌ఎండీసీకి అప్పగించామని, కూల్చివేతపై తమకు ఎలాంటి నోటీసు రాలేదని, అది పూర్తిగా మెడికల్ అండ్ హెల్త్ అధికారులే చూసుకుంటున్నారని చెప్పారు. తమ కార్యాలయాలు ఖాళీ చేసేందుకు 15 రోజుల సమయం ఇచ్చారని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు మాత్రం అధికారికంగా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని పేర్కొంటున్నారు. ఇలా ఏ శాఖ అధికారిని అడిగినా ఎవరికి వారు కూల్చివేతపై తప్పించుకునే సమాధానాలు చెప్పడం గమనార్హం. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చడానికి ముందు మంచిర్యాల మార్కెట్‌రోడ్డులో సెట్‌బ్యాక్ లేకుండా ఉన్న నిర్మాణాలను కూడా మున్సిపల్ అధికారులు కూల్చారు. దీంతో కూల్చివేతలపై స్థానికులు మండిపడుతున్నారు.



మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం ఎందుకు ఆగింది?

ప్రజలకు సుస్థిరమైన పాలన అందించడంలో ఈ ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. బీఆర్‌ఎస్ సర్కారు చేపట్టిన మంచి పనులన్నీ ఆగిపోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. మంచిర్యాల ప్రజల కోసం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ మొండి గోడలతో కనపడుతున్నది. ప్రజలకు ఉపయోగపడే ఈ బిల్డింగ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆపేసింది. ఏ కారణంతో ఆపేసిందో చెప్పాలె.

-మంచిర్యాలలో మే 4న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్

రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా రేవంత్‌రెడ్డి

- **తన నిర్ణయాలతో విధ్వంసం సృష్టిస్తున్నాడు**
- **మూసీని రియల్ఎస్టేట్‌కు అప్పగించేందుకే కూల్చివేతలు**
- **హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని దెబ్బతిస్తున్నారు**
- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపణ**



హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా తనకు లబ్ధిచేకూరే నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టించడానికే కూల్చివేతలు చేపట్టాడని, అవినీతి సొమ్మును ఢిల్లీకి పంపిస్తున్నాడని చెప్పారు. ఎమ్మెల్యే వివేకానంద గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మూసీని రియల్ ఎస్టేట్ వాళ్లకు అప్పగించడానికే పేదల ఇండ్లను కూల్చివేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని బీఆర్‌ఎస్ హయాంలో సుందరంగా తీర్చిదిద్దితే.. ఇప్పుడు సర్వనాశనం చేస్తున్నాడని మండిపడ్డారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెంచిందని, దాంతో అనేక ప్రపంచస్థాయి కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయని అన్నారు. కానీ ఇప్పుడు ఉన్న కంపెనీలు వెళ్లిపోయే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. సీఎం తీసుకునే అనాలోచిత నిర్ణయాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. హైదరాబాద్ ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని, ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి కూల్చివేతలు చేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరం నుంచి ఒక్క మంత్రి లేడని, శాఖలన్నీ సీఎం వద్దనే ఉన్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు హడావుడిగా నగరంలో పలు పనులకు శంకుస్థాపనలు చేసి వదిలేశారని, మిగిలిన పనులన్నీ అరకొరగా జరుగుతున్నాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి విధ్వంసకర నిర్ణయాలతో హైదరాబాద్ ప్రతిష్ఠ మసకబారుతున్నదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై బీఆర్‌ఎస్ పోరాడుతుందని పేర్కొన్నారు.



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్‌కుమార్, పక్కన కిశోర్‌గౌడ్, బాలరాజుయాదవ్

ఈడీ కేసు మాఫీకేనా అదానీతో భేటీ?

- **పొంగులేటి ఇంట్లో 1600 కోట్లు దొరికింది నిజమేనా?**
- **రెయిడ్స్‌పై ఈడీ ఎందుకు వివరాలు వెల్లడించడంలేదు**
- **కొండాసురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలి**
- **బీఆర్‌ఎస్ నేత దాసోజు డిమాండ్**

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతి పెద్ద పారిశ్రామికవేత్త, బీజేపీకి సన్నిహితునిగా పేరొందిన గౌతమ్ ఆదానీతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాటక ప్రభుత్వ సలహాదారు సునీల్ కనుగోలు రహస్యంగా భేటీ కావడం వెనుక అంతర్యం ఏమిటో వెల్లడించాలని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఈడీ కేసులను మాఫీ చేసేందుకే అదానీని పొంగులేటి కలుసుకున్నారా అని అనుమానం వ్యక్తంచేశారు. దాసోజు శ్రవణ్ గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. మంత్రి పొంగులేటి ఇంటిపై ఈడీ రెయిడ్స్ జరిగాయని, ఈ దాడుల్లో రూ.1600 కోట్లు దొరికినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నదని అన్నారు. బంగారం కూడా పెద్దమొత్తంలో దొరికినట్టు తెలిసిందన్నారు. పొంగులేటి ఇంటిపై ఈడీ రెయిడ్స్ తర్వాత ఏం జరిగిందో ప్రజలకు చెప్పాలని కోరారు. ఈడీ దాడుల వివరాలను ఇంత వరకు ఎందుకు బయటపెట్టడంలేదని అనుమానం వ్యక్తం చేశారు. గౌతమ్ అదానీని అడ్డం పెట్టుకుని ఈడీ కేసుల నుంచి బయటపడేందుకు పొంగులేటి ప్రయత్నిస్తున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు. మంత్రి కొండా సురేఖ మాటలు వింటే రాజకీయాల పట్ల అసహ్యం కలుగుతున్నదని అన్నారు. ఆమెను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణపై పరివాహక ఎమ్మెల్యేలతో మీటింగ్ ఎందుకు పెట్టలేదు' అని ప్రశ్నించారు.

ప్రభుత్వ చీఫ్ విప్‌గా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ

- **మరోసారి నిబంధనలకు విరుద్ధంగా నియామకం**
- **కాంగ్రెస్‌లో చేరిన వారికి నిన్న పీఏసీ చైర్మన్, నేడు చీఫ్‌విప్**
- **ఫిరాయింపులపై ఇప్పటికే బీఆర్‌ఎస్ ఫిర్యాదు... చర్య తీసుకోని మండలి చైర్మన్**

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా గెలిచిన పట్నం మహేందర్‌రెడ్డిని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్‌గా నియమించింది. ఈ నియామకం గత మార్చి 15 నుంచి అమల్లోకి వస్తుందని గెజిట్ విడుదల చేసింది. గెజిట్‌ను ఇన్నాళ్లూ రహస్యంగా ఉంచిన ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. తమ పార్టీ నుంచి అర్హులైన శాసనమండలి సభ్యులు లేరనే నిస్సహాయ స్థితిలో బీఆర్‌ఎస్ సభ్యుడికి కీలక పదవి ఇచ్చింది. ఎన్నికలకు ముందు పట్నం మహేందర్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతా మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆమె మల్కాజ్‌గిరి ఎంపీగా కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరారని, ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్‌ఎస్ గతంలోనే శాసన మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. ఆయనపై ఇప్పటివరకు ఎలాంటి చర్య తీసుకోకపోగా తాజాగా శాసనమండలి చీఫ్ విప్‌గా నియమించారు. ప్రతిపక్ష పార్టీ నుంచి ఎన్నికైన సభ్యుడిని ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎలా నియమిస్తారని బీఆర్‌ఎస్ పార్టీ ప్రశ్నిస్తున్నది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ లో చేరిన అరికెపూడి గాంధీని అసెంబ్లీలో పీఏసీ చైర్మన్‌గా నియమించారని, దానిపై స్పీకర్ ఇంకా ఎలాంటి సమాధానం ఇవ్వకముందే మరొకరికి ఇలా అవకాశం ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. దీనిపై మరోసారి మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో ఉంది. గత మార్చి 15 నుంచే మహేందర్ రెడ్డి నియామకం అమల్లోకి వస్తుందని గెజిట్‌లో ప్రభుత్వం పేర్కొన్నది. అయితే అదే ప్రభుత్వం... పట్నం మహేందర్‌రెడ్డి, జూన్ 2, ఆగస్టు 15న రెండు సార్లు జాతీయ జెండాను ఎగురవేయడానికి మేడ్చల్ జిల్లాలో అవకాశం కల్పించారు. ఆ ప్రభుత్వ ఆదేశాల్లో మాత్రం మహేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగానే పేర్కొన్నారు. ప్రభుత్వమే ఒక పదవి ఇచ్చి, ఆ పదవిని తాను ఇచ్చే ఆదేశాల్లో పేర్కొనకపోవడం గమనార్హం.



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో పర్యటించి ఫార్మాసిటీ ఏర్పాటుకు సేకరించిన పంట భూములను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నాయకులు చంటి క్రాంతికిరణ్, దేవీప్రసాద్, మఠం భిక్షపతి, శివకుమార్, పట్నం మాణిక్యం తదితరులు

నువ్వు సీఎంవా.. బ్రోకర్‌వా?

అండగా నిలవాల్సిందిపోయి రైతుల భూములు లాక్కుంటున్నవ్ • పిచ్చోడి చేతిలో రాయిలా పాలన: హరీశ్

- **మూసీని ఉద్ధరించి.. మంజీరను విషతుల్యం చేస్తరా?**
- **అసైన్డ్ భూములకు పట్టాలిస్తామన్న రాహుల్ సమాధానం చెప్పాలి**
- **జేసీబీలు, పొక్లెయిన్లు వస్తే నేను అడ్డుగా పడుకుంటా**
- **రైతుల పక్షాన గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులో కేసులు వేస్తం**
- **రేవంత్‌రెడ్డి మెడలు వంచి భూములు కాపాడుతం**
- **డప్పూరులో మాజీ మంత్రి హరీశ్**
- **భూముల పరిశీలన, రైతులతో ముఖాముఖి**
- **కంటతడిపెట్టిన బాధిత రైతులు, మహిళలు**



విలపిస్తున్న భూ బాధిత మహిళలు

సంగారెడ్డి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డీ.. నువ్ ముఖ్యమంత్రివా.. రియల్ ఎస్టేట్ బ్రోకర్ వా అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలోని డప్పూరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఫార్మాసిటీలో కోల్పోతున్న రైతుల భూములను హరీశ్‌రావు పరిశీలించారు. అనంతరం ఫార్మాసిటీలో భూములు కోల్పోతున్న డప్పూరు, వడ్డి, మాల్గి రైతులతో సమావేశమయ్యారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మూడు పంటలు పండే బంగారంలాంటి మా భూములను ఫార్మాసిటీకి ఇవ్వబోమని, అవసరమైతే ప్రాణాలిస్తామని రైతులు, మహిళలు కంటతడి పెట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ గరీబీ హటావో అంటే సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో గరీబ్, కిసాన్ హటావో అంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ కోసం 15వేలు ఎకరాలు సేకరించటంతో పాటు అన్ని అనుమతులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. అక్కడ ఫార్మాసిటీ నిర్మించకుండా ఆ భూములను ప్లాట్లుగా చేసి అమ్ముకుని డబ్బు చేసుకోవాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూరు, వడ్డి, మాల్గి గ్రామాల్లో ఫార్మాసిటీ పేరిట బంగారం లాంటి రెండువేల ఎకరాల భూములను రైతుల నుంచి బలవంతంగా లాక్కోవటం దారుణమన్నారు. అసైన్డ్‌భూములున్న రైతులకు పట్టాలిస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ హామీ ఇచ్చి ప్రజల నుంచి ఓట్లు పొంది అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఇప్పుడు న్యాల్‌కల్ రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్‌రెడ్డి పాలన మారిందని ఎద్దేవా చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. భూసేకరణ కోసం జేసీబీలు, పొక్లెయిన్‌లు వస్తే తనతోపాటు ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి డప్పూరులోనే మకాంవేసి భూసేకరణను అడ్డుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు మాత్రం ఒక్కమాటమీద ఉండాలని, బ్రోకర్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. కోహీర్ జామ, డప్పూరు పుదీన అంటే బోయిన్‌పల్లి మార్కెట్, బీదర్‌లో ఫేమస్ అని గుర్తు చేశారు. మూడు గ్రామాల రైతులు ఏకమై పోరాడితే ఫార్మాసిటీ రద్దవడం ఖాయమని సూచించారు.

> **అయ్యా.. ఈ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం మా భూములను బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నది. సారవంతమైన భూములను సర్కారుకు ఇచ్చి మేమెట్ల బతకాలే. ఫార్మాసిటీ వస్తే నీళ్లు కలుషితమైతయి..మా ఆరోగ్యాలు దెబ్బతింటయి..మాకు అండగా నిలవాల్సిన సర్కారే.. ఇలా ఇబ్బంది పెడితే మా జీవితాలు ఏం కావాలే. ప్రాణాలైన ఇస్తం..కానీ మూడు పంటలు పండే ఈ భూముల్ని వదులుకోం..**
>
> **-డప్పూర్ గ్రామ పర్యటనలో హరీశ్‌రావుతో పలువురు రైతుల కన్నీటి ఆవేదన**

మూసీని ఉద్ధరించి.. మంజీరను విషతుల్యం చేస్తవా

మూసీని శుద్ధిచేసి గోదావరి జలాలు కలుపుతామంటున్న రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీ కంపెనీలతో మంజీర నదిని విషతుల్యం చేస్తవా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. పాలలాంటి మంజీరా నీళ్లలో విషం కలుపుతవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషితమైన మంజీర నీటిని హైదరాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఎలా తాగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఫార్మాసిటీ భూసేకరణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కార్ డప్పూరులో చెరువులు తవ్వించటంతోపాటు కొత్తగా సబ్‌స్టేషన్ నిర్మిస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ రైతుల భూములు లాక్కుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరిస్తే సహించేదిలేదన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు దేవీప్రసాద్, మాణిక్యం, బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, హకీం, నరహరిరెడ్డి, వీరారెడ్డి, మాజీ సర్పంచ్ రవి పాల్గొన్నారు.

భూముల పరిశీలన

ఫార్మాసిటీలో రైతులు కోల్పోతున్న భూములను మాజీ మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి భారీ కాన్వాయ్‌తో వచ్చిన హరీష్‌రావుకు బీఆర్‌ఎస్ నాయకులు, డప్పూరు, వడ్డి, మాల్గి గ్రామాల రైతులు ఘన స్వాగతం పలికారు. అక్కడ పత్తి, కంది, చెరుకు, పుదీనా తదితర పంటలను చూశారు. ఈ సందర్భంగా మహిళా రైతులు రేవంత్ సర్కార్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

హరీశ్‌రావు: అమ్మా మీ పేరేంటి? ఎన్ని ఎకరాల భూమి పోతున్నది?

సర్ నాపేరు శరణమ్మ, నాకు రెండెకరాల భూమి ఉంది. వారసత్వంగా వచ్చిన ఈ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న. పొలం కాడ బావి ఉంది. మూడు పంటలు పండిస్తా. పత్తి, చెరుకు, పుదీనా పంట వేస్త. ఏడాదికి రెండు నుంచి మూడు లక్షల ఆదాయం వస్తున్నది. ఇప్పుడు ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం మా భూములు లాక్కుంటమని అంటున్నది. ప్రాణమైనా ఇస్తం కానీ భూములు మాత్రం ఇయ్యం.

హరీశ్‌రావు: ఫార్మాసిటీకి భూములు పోకుండా మేం చూస్తం.

మీకు రైతుబంధు వస్తుందా అమ్మా?

శరణమ్మ: లేదు సార్ ఇప్పటి వరకు రైతుబంధు పడలేదు. కేసీఆర్ సర్కార్‌లో ఏటా రెండుమార్లు టైంకు రైతుబంధు డబ్బులు పడ్డయి. పింఛన్ డబ్బులు ఠంచన్‌గా వచ్చినయి. రేవంత్‌రెడ్డి వచ్చాక మా రైతుల ఉసురుతీస్తుండు సర్.

హరీశ్‌రావు: అమ్మా నీపేరేంటి? నీ భూమి ఫార్మాసిటీలో పోతున్నదా?

సర్ నాపేరు లక్ష్మి. నాకున్న రెండెకరాలూ ఫార్మాసిటీలో పోతున్నది. మూడు పంటలు పండేవి. మేం పుదీనా వేసినం. మంచి ఆదాయం వస్తున్నది. మాకున్న ఆధారమే ఈ భూమి. ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి భూములియ్యం.

హరీశ్‌రావు: అధైర్యపడకండి.. మీకు అండగా నేనుంట. మీ అనుమతి లేకుండా ఫార్మాసిటీకి భూములు పోనివ్వ.

హరీశ్‌రావు: అమ్మా నీపేరేంటి? పంటలపై ఎంత సంపాదిస్తారు?

సర్ నాపేరు లలిత. మా కుటుంబానికి ఇక్కడ రెండెకరాలు ఉంది. పుదీనా, ఇతర పంటలు వేస్తం. ఏడాదికి రెండు నుంచి మూడు లక్షల రూపాయలు సంపాదిస్తం. మా జీవనాధారాన్ని లాక్కుంటమంటే మేం ఎట్ల బతకాలే.

హరీశ్‌రావు: అమ్మా..మీ భూములు ఎక్కడికీ పోవు. మేం అండగా ఉంటం. మీరే కాదు. డప్పూరు, మాల్గి, వడ్డీ గ్రామాల రైతులు ఎవ్వరూ అధైర్యపడొద్దు. బీఆర్‌ఎస్ పార్టీ ఉంది. అవసరమైతే న్యాయపోరాటం చేస్తం.

భూములు పోతే బతుకుడెట్ల?



సారవంతమైన భూములు పోతే మేమెట్ల బతుకుతం. జీవనాధారమైన భూములను ఫార్మాసిటీకి లాక్కుంటే కుటుంబమంతా రోడ్డునా పడాలా. మాకున్న రెండెకరాల భూమిల ఏడాది పొడవున పుదీనాను సాగు చేసుకుంటున్నం. ప్రాణాలు పోయినా ఫార్మాసిటీకి మాత్రం భూములు ఇవ్వం.

- లక్ష్మి, బాధిత మహిళ, డప్పూర్, న్యాల్‌కల్ మండలం (సంగారెడ్డి జిల్లా)

మారొట్టె తిని మమ్మల్నే తరుముతున్నడు



మా నాయన నుంచి నాకు ఐదెకరాల భూమి అచ్చింది. రూపాయి రూపాయి కూడబెట్టి, చెమట దారబోసి, బావితవ్వించిన. ఇప్పుడు నాభూమి లాక్కుంటమంటే నిద్రపడుత లేదు. ఈ భూమిలో పంటలు తీసి ఇద్దరు కొడుకులు, బిడ్డ లగ్గం జేసిన. ఇప్పుడు పొలాన్ని రేవంత్‌రెడ్డి లాక్కుంటుంటంటే కడుపు మండుతున్నది. మేము వేసిన రొట్టె తునక తోని రేవంత్‌రెడ్డి బతుకుతుండు. మారొట్టె తిని మమ్మల్ని తరుముతున్నడు. రేవంత్‌రెడ్డి ఇది ఇస్తా అది ఇస్తా అని మాయజేసిండు. ఇప్పుడు మమ్ముల్ని మోసం చేస్తుండు. ఫార్మా కంపెనీలకు భూములియ్యం.

-హన్మంతు, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం (సంగారెడ్డి జిల్లా)

దసరాలోగా 2 లక్షలకుపైగా రుణ మాఫీ

- **2 లక్షలలోపు ఇప్పటికే మాఫీ**
- **రవాణా శాఖ మంత్రి పొన్నం**



కరీంనగర్ రూరల్, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షలలోపు రుణం ఉన్న రైతులకు మాఫీ చేసిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రూ.2 లక్షల పైన ఉన్న వారికి దసరాలోపు మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గురువారం కరీంనగర్ రూరల్ మండలం తాహెర్ కొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలని సూచించారు. డిజిటల్ కార్డు వివరాల నమోదులో ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు.

గ్రూప్ -1 పై సీఎం సోయిలేని మాటలు!

- **పరీక్షలు కాకముందే ఫలితాలెలా ఇస్తామంటరు**
- **పోస్టులకు బేరం పెట్టుకున్నారేమోనని అనుమానం**
- **వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి**



హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): గ్రూప్ 1పై సీఎం రేవంత్‌రెడ్డి సోయిలేని మాటలు మాట్లాడుతున్నారని వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే అనేక అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో గ్రూప్ 1 నియామక ఫలితాలు విడుదల చేస్తామని ఇటీవల సీఎం ప్రకటించారని, గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగకముందే ఫలితాలెలా ఇస్తారని ప్రశ్నించారు. కొంపదీసి గ్రూప్ 1 పోస్టులు ఉంచారా? బేరం పెట్టుకున్నారా? అనే సందేహాన్ని వ్యక్తంచేశారు. సీఎం వ్యవహారం.. పిల్ల పుట్టక ముందే కుల్ల కుట్టినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వై నాయకులు విద్యాసాగర్, మధు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోళ్లపై దృష్టిపెట్టాలి

- **సన్న ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్**
- **వీసీలో సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఈ సీజన్ నుంచే సన్నవడ్లు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7వేల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొన్న రెండురోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం ఆయన వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో 66.73లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, రికార్డుస్థాయిలో 140 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. సమావేశంలో మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎస్ శాంతికుమారి, సివిల్ సప్లయ్ ఎండీ చౌహాన్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

‘పెద్దల’ డైరెక్షన్.. సురేఖ డైవర్షన్!

- కేటీఆర్‌పైకి కొండాను రెచ్చగొట్టిన ‘పెద్దలు’
- మూసీ, హైడ్రా డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమా?
- హద్దన్నదే లేకుండా జుగుప్సాకర వ్యాఖ్యలు
- బూమరాంగ్ కావడంతో ఆత్మరక్షణలో పెద్దలు
- సురేఖ వ్యాఖ్యలపై రాహుల్, ప్రియాంక ఆరా
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్‌కు మొట్టికాయలు
- వెంటనే పీసీసీ చీఫ్ వీడియో విడుదల
- ఇప్పటికీ స్పందించని సీఎం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం వరంగల్ లేబర్‌కాలనీ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమాజంలో ఆడపిల్ల జీవితం గురించి అనుచిత వ్యాఖ్యలు చేసి ఇలా రోడ్డు మీద వేయడం సరికాదని అన్నారు. – కాశీబుగ్గ

హైదరాబాద్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ): మంత్రి కొండా సురేఖను ‘పెద్దలు’ డైవర్షన్ పాలిటిక్స్‌కు వాడుకున్నారా? కేటీఆర్‌పైకి మంత్రిని ఎగదొస్తే మూసీ, హైడ్రా లొల్లి డైవర్షన్ అవుతుందని లెక్కలేసుకున్నారా? వీళ్ల డైవర్షన్ డ్రామా కాస్తా బూమరాంగ్ అయిందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి కేటీఆర్‌పై, అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ వ్యాఖ్యల వెనుక ‘పెద్దలు’ ఉన్నారనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. ఆమెను అడ్డంపెట్టుకొని మూసీ, హైడ్రా నష్టాన్ని పక్కదారి పట్టించాలని పక్కా ప్లాన్ వేసినట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే మంత్రి కొండాను రెచ్చగొట్టి మాట్లాడించారనే ప్రచారం జోరుగా జరుగుతున్నది. ‘పెద్దలు’ చెప్పారనే ఆనందంలో రెచ్చిపోయిన సురేఖ హద్దులు మీరి నోటికి పనిచెప్పారు. హద్దు అదుపు లేకుండా అక్కినేని కుటుంబంపై, మహిళలపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేశారు. ఆమె వ్యాఖ్యలు అప్పటికే జనాల్లోకి వెళ్లడం, పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పరిస్థితి చేయిదాటిపోయిందని గ్రహించిన పెద్దలు నష్టనివారణ చర్యలకు దిగినట్టు తెలిసింది.

రెచ్చగొట్టి వదిలేసిన ‘పెద్దలు’

బుధవారం గాంధీ జయంతి సందర్భంగా సీఎం, మంత్రులు బాపూఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. మంత్రి కొండా సురేఖ మాత్రం మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఇవి మీడియాలో హైలైట్ కావడంతో ‘పెద్దల’కు ఓ ఆలోచన తట్టింది. మాజీ మంత్రి కేటీఆర్‌పై విమర్శల తీవ్రత పెంచితే మూసీ, హైడ్రా వివాదం పక్కదారి పడుతుందని ప్లాన్ వేశారు. దీంట్లో భాగంగానే కొండా సురేఖను రెచ్చగొట్టినట్టుగా తెలిసింది. బాపూఘాట్ నుంచి గాంధీభవన్‌కు వచ్చిన ఆమెకు పెద్దలు ఫోన్ చేసి కేటీఆర్‌పై విమర్శల దాడి పెంచాలని సూచించినట్టు తెలిసింది. ఓవైపు వ్యక్తిగత ఆక్రోశం.. మరోవైపు పెద్దల అండ, ఆదేశం.. ఇంకేముంది సురేఖ రెచ్చిపోయారు. మీడియాతో ముందు వెనక చూసుకోకుండా, ఏం మాట్లాడుతున్నారో కూడా ఆలోచించకుండా అక్కినేని కుటుంబంపై విపరీత వ్యాఖ్యలు చేశారు.

‘కొండా’పై చర్యలకు వెనకాడొద్దు: అధిష్ఠానం

నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను అధిష్ఠానం పెద్దలు తీవ్రంగా పరిగణించినట్టు తెలిసింది. అంతకు ముందు ‘ఫైర్‌బ్రాండ్’గా పేరున్న ఓ మహిళా నేత ఈ ఘటనపై నేరుగా అధిష్ఠానం పెద్దలకే ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అసలు ఈ వ్యాఖ్యలేంటి? ఈ పాలనేంటి అని నిలదీసినట్టుగా తెలిసింది. అక్కినేని కుటుంబం చాలా పెద్దదని, దక్షిణ భారతదేశంలో వాళ్ల ప్రభావం ఉంటుందని చెప్పినట్టుగా తెలిసింది. అలాంటి కుటుంబంపై మహిళా మంత్రి ఇంత నీచంగా మాట్లాడటంపై పార్టీ పరువు పోతుందని, వాళ్లను కట్టడి చేస్తారా? లేదా? అని నిలదీసినట్టు తెలిసింది. మీ నుంచి అవుతదా? లేదా? అంటూ నేరుగా ప్రశ్నించినట్టు తెలిసింది. దీంతో ఏం జరిగిందనే అంశంపై రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్ ఆరా తీసినట్టు సమాచారం. ఇందులో భాగంగానే అక్కినేని అమలకు ప్రియాంకగాంధీ ఫోన్ చేసినట్టుగా తెలిసింది. జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఆమె.. బాధపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారట. ఈ వ్యవహారంపై తేల్చాలని కేసీ వేణుగోపాల్‌ను ఆదేశించినట్టుగా తెలిసింది. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫోన్ చేసిన వేణుగోపాల్.. ఈ వ్యవహారంపై తలంటినట్టుగా తెలిసింది. పూర్తి వివరాలను తెలుసుకున్న అధిష్ఠానం పెద్దలు మంత్రి కొండా సురేఖ తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. బాధ్యత గల పదవిలో ఉంటూ, పైగా మహిళా మంత్రిగా ఉంటూ సాటి మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏంటని నిలదీసినట్టు తెలిసింది. మంత్రులను అదుపులో పెట్టలేరా? అంటూ ఇటు సీఎం రేవంత్‌రెడ్డిని, అటు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. ఇప్పటికే హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతతో పార్టీకి జరిగిన నష్టం చాలదన్నట్టుగా ఇప్పుడు ఈ కొత్త తలనొప్పి అవసరమా అని ప్రశ్నించినట్టుగా తెలిసింది. మీ వ్యవహారంతో రాష్ట్రంలో పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నట్టు నివేదిక అందిందని మందలించినట్టు తెలిసింది. ఇప్పటికే జరిగిన నష్టం చాలని, ఇకపై ఈ వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఆదేశించినట్టు తెలిసింది. మొత్తం ఘటనపై పార్టీ తరుపున వివరణ ఇవ్వాల్సిందిగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఆయన గురువారం ఉదయం ఈ ఘటనను ఖండిస్తూ వీడియోను విడుదల చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, మంత్రులను అదుపులో పెట్టేందుకు అవసరమైతే సురేఖపై చర్యలకు కూడా వెనకాడొద్దని ఆదేశించినట్టుగా తెలిసింది.

‘కొండా’కు ఛీత్కరింపులు

సినీ నటుడు నాగార్జున కుటుంబాన్ని అవమానించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో కలవరం సృష్టిస్తున్నాయి. ఆమె చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినీ ప్రముఖులు, రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ట్విటర్‌లో పోస్టులు పెడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన పార్టీ అధిష్ఠానం పెద్దలు నష్టనివారణ చర్యలు చేపట్టినట్టుగా తెలిసింది. నాగార్జున కుటుంబంపై, మహిళలపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలపై సొంత పార్టీలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీ నేతలే ఆమె వ్యాఖ్యల్ని ఛీత్కరిస్తున్నారు. ‘నా 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎవరూ, ఎప్పుడు ఇంత దిగజారి మాట్లాడింది చూడలేదు. ఆమె మా పార్టీ మంత్రి అని చెప్పుకోవడానికి కూడా నాకు సిగ్గుగా ఉంది.’ అని సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం. ఇదే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతున్నది.

రేవంత్ మౌనం వెనుక మర్మమేమిటి?

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై అన్ని వైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం మౌనాన్ని పాటిస్తున్నారు. ఇంత దుమారం చెలరేగినా ఆయన మాట కూడా మాట్లాడటం లేదు. మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు కనీసం ప్రకటన కూడా చేయలేదు. రేవంత్ మౌనానికి గల కారణం ఏమిటన్న చర్చ జరుగుతున్నది. అనేక అనుమానాలూ వ్యక్తం అవుతున్నాయి. హైడ్రా, మూసీ వివాదాలను పక్కదారి పట్టించేందుకు ఆయనే డైవర్షన్ పాలి‘ట్రిక్స్’కు తెరతీశారని పలు వర్గాల నుంచి అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అందులో భాగంగానే మంత్రి కొండా సురేఖతో ఈ ఘాటు వ్యాఖ్యలు చేయించారన్న అనుమానం వస్తున్నది. ‘పెద్దల’ అనుమతి లేకుండా ప్రముఖుల కుటుంబంపై ఇలాంటి వ్యాఖ్యలు చేసేందుకు ఓ మంత్రి సాహసిస్తారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే కొండా వ్యాఖ్యలు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మంత్రి సురేఖపై చర్యలు తీసుకోండి

జాతీయ మహిళా కమిషన్‌కు తుల ఉమ ఫిర్యాదు



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సినిమా పరిశ్రమకు చెందిన నటులపై నీచంగా మాట్లాడిన తెలంగాణ మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకురాలు, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు అసభ్యంగా, సమాజ నిర్మాణానికి హాని కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె ఇలాంటి అసంబద్ధ వ్యాఖ్యలు చేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కమిషన్‌కు ఫిర్యాదు లేఖ పంపించారు. మంత్రి మాటలు మహిళలపై అనవసరమైన అనుమానాలు కలిగిస్తాయని, వారి వ్యక్తిగత, వృత్తి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ఇలాంటి వ్యాఖ్యలు మహిళలు తమ లక్ష్యాలను సాధించటంలో నీరుగారుస్తాయని వివరించారు. సురేఖ కుసంస్కార వ్యాఖ్యలు మహిళలు సమాజంలో పురోగతి సాధించడానికి ప్రతిబంధకంగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాజీవితంలో ఉన్న వ్యక్తులు బాధ్యతాయుతంగా, గౌరవప్రదంగా, ప్రోత్సాహకరంగా మాట్లాడాలి తప్ప అసంబద్ధ, నిరాధార వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. మంత్రి సురేఖ అడ్డగోలు వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కొండా సురేఖ అలా వ్యాఖ్యానించటం సరి కాదన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ హైకమాండ్ ఆమెపై తక్షణమే కఠినమైన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

72గంటల్లో మంత్రి రాజీనామా చేయాలి

ప్రజలు మళ్లీ కేసీఆరే కావాలంటున్నరు: కేఏ పాల్



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ డిమాండ్ చేశారు. 72 గంటల్లో ఆమె రాజీనామా చేయకపోతే, తానే ఆమెపై కేసు వేస్తానని తెలిపారు. సమంత, నాగార్జున ఇంటికి వెళ్లి మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పాలని సూచించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ మాటలు చట్టవిరుద్ధమని, హత్యచేసి సారీ చెప్తే సరిపోతుందా? అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రహస్యంగా అదానీని ఎందుకు కలిశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పాలన వద్దు.. మళ్లీ కేసీఆరే కావాలని కోరుకుంటున్నట్టు కేఏ పాల్ పేర్కొన్నారు. హైడ్రాపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయించారేమోనని అనుమానం వ్యక్తం చేశారు.

సురేఖకు మహిళల పట్ల గౌరవం లేదు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, అక్టోబర్ 3: మహిళ అన్న విషయాన్ని మరిచి మంత్రి కొండా సురేఖ సభ్య సమాజం తలదించుకునేలా సినీనటి సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి సురేఖకు మహిళలపై ఏ మాత్రం గౌరవం లేదని విమర్శించారు.

కొండాపై నాగార్జున పరువు నష్టం దావా

- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు
- సెక్షన్ 356 కింద చర్యలు తీసుకోవాలని వినతి
- పిటిషన్‌కు మంత్రి వ్యాఖ్యల వార్తాక్లిప్పింగులు జత



నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలపై నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో గురువారం అక్కినేని నాగార్జున పరువు నష్టం దావా వేశారు. సెక్షన్ 356 బీఎన్ఎస్ కింద చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. మంత్రి సురేఖ మీడియా సమావేశంలో మాట్లాడిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో, టీవీల్లో, పత్రికల్లో ప్రధానంగా వచ్చాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ కథనాల క్లిప్పింగులను కోర్టుకు సమర్పించారు. మంత్రి వ్యాఖ్యలతో తాను షాక్‌కు గురయ్యానని, అక్కినేని కుటుంబానికి ఉన్న పేరు ప్రతిష్ఠలకు భంగం కలిగించారని పిటిషన్‌లో వివరించారు. కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని, కన్వెన్షన్‌హాల్ కూల్చడానికి, మంత్రి వ్యాఖ్యలకు ఎలాంటి సంబంధంలేదని తెలిపారు. కన్వెన్షన్ సెంటర్ తనకు (నాగార్జున) చెందినదని, నాగచైతన్య–సమంత విడాకులకు లింక్ లేదని, కేటీఆర్‌పై నిందారోపణలు చేసి అక్కినేని కుటుంబానికి ఉన్న పరువుకు నష్టం కలిగించేలా ఆమె వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. జాతీయ చానళ్లు కూడా మంత్రి మీడియా సమావేశాన్ని ప్రసారం చేశాయని తెలిపారు. బిగ్‌బాగ్ హోస్ట్‌గా, సినిమా హీరోగా, నిర్మాతగా తనకు, తమ కుటుంబానికి ఉన్న పేరు ప్రతిష్ఠలను పాడుచేసేలా మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని, కావాలని ఆమె తమ కుటుంబాన్ని టార్గెట్ చేసి మాట్లాడారని పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలని, కేసు నమోదు చేసి వాస్తవాలను వెలికి తీయాలని కోర్టును కోరారు.

అయినా మంత్రి మారలేదు

మొదటిపేజీ తరువాయి...

ఆమె గురువారం ఉదయం సంజాయిషీ ఇచ్చుకొని తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించారు. కేటీఆర్‌పై మాట్లాడుతూ భావోద్వేగానికి లోనై అనుకోకుండా ఓ కుటుంబంపై నోరుజారినట్టు తెలిపారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగత కోపం, ద్వేషం లేదని పేర్కొన్నారు. తన వ్యాఖ్యల తర్వాత అక్కినేని కుటుంబం ట్వీట్ చూసి తాను కూడా బాధపడినట్టు చెప్పారు. ఏ విషయంలో అయితే తాను బాధపడ్డానో అదే విషయంలో ఇంకొకరిని నొప్పించానని భావించి ఆ వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ సంజాయిషీ ఇచ్చి గంటలు కూడా పూర్తి కాకముందే సాయంత్రం మళ్లీ నాగచైతన్య, సమంతల విడాకులపై పిచ్చి ప్రేలాపనలు చేశారు. నాగచైతన్య, సమంత ఎందుకు విడాకులు తీసుకున్నారనే విషయం ప్రపంచానికి తెలియదని, వారి కుటుంబం నుంచి కూడా దీనిపై ఏమీ చెప్పలేదని పేర్కొన్నారు. సినీ ఇండస్ట్రీ నుంచి వచ్చిన సమాచారంతో తాను ఆ వ్యాఖ్యలు చేసినట్టు చెప్పారు. ‘కోపం వచ్చింది. కోపంలో మాట్లాడాల్సి వచ్చింది.. మాట్లాడిన’ అని చెప్పడం గమనార్హం. ఆమె మరోసారి ఈ వ్యాఖ్యలు చేయడంపై ప్రజల నుంచి రెట్టింపు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఓ మంత్రా అంటూ తిట్టిపోస్తున్నారు. మతి భ్రమించి మాట్లాడుతున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను నిరసిస్తూ భద్రాద్రి జిల్లా ఇల్లెందులోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద గురువారం ఆమె దిష్టిబొమ్మను బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు, మహిళా కౌన్సిలర్లు దహనం చేశారు. నటి సమంత గురించి తప్పుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని మండిపడ్డారు. – ఇల్లెందు రూరల్



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని, పెద్ది

కొండా సురేఖది నీచ రాజకీయం

- కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ, అక్టోబర్ 3: మంత్రి కొండా సురేఖది నీచ రాజకీయమని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ధ్వజమెత్తారు. కేటీఆర్‌పై మంత్రి చేసిన అసత్య ఆరోపణల నేపథ్యంలో గురువారం మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపనేని నరేందర్‌తో కలిసి దాస్యం మీడియాతో మాట్లాడారు. మంత్రి సురేఖ వెంటనే కేటీఆర్‌కు బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తోటి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి కేటీఆర్‌పైకి నెట్టడం సరికాదని, ఆమె మాటలను మహిళా లోకమంతా ఖండిస్తున్నదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ మంత్రి సురేఖ అనాలోచిత మాటలకు మహిళలు బాధపడుతున్నారని అన్నారు.



అక్కినేని కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కృష్ణానగర్‌లో నిరసన తెలుపుతున్న అక్కినేని అభిమానులు

తలదించుకునేలా సురేఖ వ్యాఖ్యలు

బీఆర్ఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి



కృష్ణ కాలనీ, అక్టోబర్ 3: మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. సినిమా రంగాన్ని రాజకీయాల్లోకి లాగి సమంత–నాగచైతన్య కేటీఆర్ వల్లనే విడిపోయారని మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. మంత్రి సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ కన్వెన్షన్‌కు పర్మిషన్ ఇచ్చింది, కూల్చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆమె పేర్కొన్నారు.

సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలి

మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు



మణుగూరు టౌన్, అక్టోబర్ 3: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు నటుడు నాగార్జున కుటుంబంపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంత్రిపై కాంగ్రెస్ అధిష్ఠానం గానీ, సీఎం రేవంత్‌రెడ్డిగానీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంపై ఏ మాత్రం గౌరవమున్నా ఆమెను బర్తరఫ్ చేయాలన్నారు.

కొండా సురేఖ క్షమాపణ చెప్పాల్సిందే

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కేతేపల్లి, అక్టోబర్ 3 : అధికారంలో ఉన్నామనే అహంకారంతో సినీనటి సమంత వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గవర్నర్‌ను కోరారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేతేపల్లిలో మీడియాతో మాట్లాడారు. సురేఖ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని సమంతతోపాటు మాజీ మంత్రి కేటీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైఎస్ షర్మిల ‘ఇష్యూ’లో హుందాగా కేటీఆర్!

- నాడు షర్మిల–ప్రభాస్ మధ్య ట్రోలింగ్‌లపై కేటీఆర్ ఆగ్రహం
- తక్షణం చర్యలు తీసుకోవాలని నాటి సీపీలకు ఆదేశం



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మహిళలు, ఆడబిడ్డల పట్ల మాజీ మంత్రి కేటీఆర్‌కు ఉన్న గౌరవ మర్యాదలను కాంగ్రెస్ ప్రభుత్వం చూడలేకపోతున్నది. మహిళల సమస్యలు, వాటిని పరిష్కరించే అంశాలపై ఆయన ప్రదర్శించే హుందాతనం కాంగ్రెస్ నేతల కంటికి కనిపించటం లేదు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, నటుడు ప్రభాస్‌పై గతంలో టీడీపీకి చెందిన కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశారు. 2014లో, 2019లో దారుణ విమర్శలు చేశారు. ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, దురుద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని 2014, 2019లో కేటీఆర్ స్పందించారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలను సోషల్ మీడియాలోకి లాగొద్దని హెచ్చరించారు. దోషులకు శిక్షపడేలా చేస్తామని, అవసరమైతే చట్టాల్లో మార్పులు సైతం తీసుకురావడానికి వెనుకాడబోమని కేటీఆర్ 2014లోనే చెప్పారు. నాడు తనకు సమాచారం అందిన వెంటనే హైదరాబాద్ పోలీసు కమిషనర్‌తో మాట్లాడినట్టు చెప్పారు. 2019 జనవరిలోనూ అదే తరహా విష ప్రచారం సోషల్ మీడియాలో జోరందుకున్న నేపథ్యంలో కేసీఆర్ కుటుంబం నుంచి కేటీఆర్, కవిత స్పందించారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాటి హైదరాబాద్ సీపీ అంజనీకుమార్‌ను ఆదేశించారు. అప్పటికే వైఎస్ షర్మిల దంపతులు అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేయటంతో హైదరాబాద్ సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీస్ విభాగం స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టింది. అడిషనల్ డీసీపీ రఘువీర్ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసు బృందం పలు కోణాల్లో కేసును ఇన్వెస్టిగేట్ చేసి, కొందరిని అరెస్టు చేసింది. అప్పటికి ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఉండగా.. తనకు ఏపీ పోలీసులపై నమ్మకం లేదని, అందుకే హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని వైఎస్ షర్మిల చెప్పారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారంలో టీడీపీకి భాగస్వామ్యం ఉందని ఆమె ఆరోపించారు. అప్పట్లో ఆమె చేసిన ఆరోపణలు రాజకీయంగా సంచలనం రేపాయి.

పీకే.. మాట్లాడరేం!

- కొండాసురేఖ వ్యాఖ్యలపై స్పందించని పవన్ కల్యాణ్
- సినీ నటుడై ఉండీ మాట్లాడకపోవడంపై విమర్శలు
- ఎన్టీఆర్ మినహా స్పందించని నందమూరి నటులు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): అక్కినేని కుటుంబంపైనా, నటి సమంత పైనా అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై సినీలోకం భగ్గుమంటున్నది. బుధవారం ఆమె వ్యాఖ్యలు చేసిన తర్వాత ఒక్కొక్కటిగా మొదలైన విమర్శలు గురువారం నాటికీ ఆగలేదు. దాదాపుగా టాలీవుడ్ ప్రముఖులందరూ ఆ ఇష్యూపై స్పందించారు. తమిళ, మలయాళ ఇండస్ట్రీలతోపాటు బాలీవుడ్ సినీ తారలు సురేఖ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీ తారల జోలికి రావొద్దంటూ గట్టిగానే సమాధానమిచ్చారు. ‘ఫిల్మ్ ఇండస్ట్రీ విల్ నాట్ టాలరేట్ (సినీరంగం ఏమాత్రం ఉపేక్షించదు) అనే ట్యాగ్‌లైన్‌తో నటీనటులు, దర్శకులు ప్రకటనలు విడుదల చేశారు. తెలుగు నాట ఇంత రచ్చ జరుగుతుంటే.. ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీనటుడు పవన్ కల్యాణ్ మాత్రం ఈ ఘటనపై స్పందించలేదు. చిరంజీవితోపాటు మెగా ఫ్యామిలీ తారలందరూ స్పందించినా.. పవన్ కళ్యాణ్ మాట్లాడుతారేమోనని తెలంగాణలోని ఆయన అభిమానులు మరీ ముఖ్యంగా మహిళా అభిమానులు ఎదురుచూశారు. అత్తారింటికి దారేది లాంటి చిత్రాల్లో తన సహనటిగా ఉన్న సమంతపై వ్యాఖ్యలను ఆయన ఖండిస్తారేమోనని వారంతా ఆశించారు. హైడ్రా కూల్చివేతలపై స్పందించినట్టుగానే దీనిపైనా స్పందిస్తారని అందరూ భావించారు. సినీతారల వ్యక్తిత్వహననం చేస్తూ కాంగ్రెస్ మంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రత్యర్థి పార్టీ నేతగా కాకపోయినా.. ఫిల్మ్ సెలబ్రిటీగానైనా ఆయన స్పందించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. గురువారం తిరుపతిలో జరిగిన వారాహి సభలో నైనా ఆయన ఈ అంశంపై మాటవరసకైనా మాట్లాడుతారేమోనని మీడియా వర్గాలు సైతం భావించాయి. సాధారణంగా మహిళా అభ్యున్నతి, గౌరవమర్యాదల గురించి తీవ్ర ఉపన్యాసాలిచ్చే పవన్.. అక్కడా ఒక్క ముక్క మాట్లాడలేదు. ఆయన మౌనంపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

స్పందించని నందమూరి కుటుంబం

కొండా సురేఖ వ్యాఖ్యలపై బుధవారం రోజే జూనియర్ ఎన్టీఆర్ ఘాటుగా స్పందించారు. నేరుగా మంత్రి పేరును ప్రస్తావిస్తూ దీటుగా సమాధానమిచ్చారు. అయితే నందమూరి కుటుంబానికి నిజమైన వారసులుగా చెప్పుకునే ‘యువరత్న’ బాలకృష్ణ గానీ, ఆయన కుటుంబానికి చెందిన నటులుగానీ సురేఖ వ్యాఖ్యలను ఎక్కడా ఖండించలేదు. చిన్న ప్రకటన విడుదల చేసినా సరిపోయేదని, కానీ ఆయన ఏఎన్నార్ కుటుంబంపై బురద చల్లించే వ్యాఖ్యలపై స్పందించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. బాబు–రేవంత్ సఖ్యత వల్లే బాలకృష్ణ స్పందించలేదా? లేక ఏఎన్నార్ కుటుంబంతో ఉన్న గ్యాప్ కారణంగానే మాట్లాడలేదా? లేక స్థానిక ప్రభుత్వంతో ఎందుకు వచ్చిన చిక్కులని భావించారా? అనేది తెలియడం లేదని సినీ విశ్లేషకులు ఒకరు వ్యాఖ్యానించారు.

- మంత్రి కొండాపై పోలీసులకు ఫిర్యాదు



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు గురువారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ కేఎం రాఘవేంద్రకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి వ్యాఖ్యల వెనక సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. పదేండ్లలో రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వ్యక్తిపై నోటికొచ్చినట్టు మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో వేంకటేశ్వరకాలనీ, వెంగళరావునగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, దేదీప్యరావు, సామల హేమ, రాసూరి సునీత, పద్మ పాల్గొన్నారు.


మహిళా వ్యతిరేకతకు నిదర్శనం: వైష్ణవ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: నటి సమంతపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తీవ్రంగా తప్పుబట్టారు. ‘సినీ ప్రముఖుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా తెలంగాణ మంత్రి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ మహిళా వ్యతిరేక ఆలోచనా విధానానికి నిదర్శనం. దేశానికి గర్వకారణమైన వినోద పరిశ్రమపై ఆ పార్టీ అభిప్రాయాలను ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకత్వం నిశబ్దంగా ఉండటం చూస్తుంటే ఈ వ్యాఖ్యలకు వారి మద్దతు ఉన్నట్టు కనిపిస్తున్నది.’ అని ఆయన ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

సురేఖ వ్యాఖ్యలతో షాక్ అయ్యాను: స్మితా సబర్వాల్

కొండా సురేఖ వ్యాఖ్యలపై సీనియర్ ఐఏఎస్ స్మిత సబర్వాల్ స్పందించారు. మంత్రిగా ఉన్న సురేఖ ఇలాంటి అగౌరవ ప్రకటన చేయడం చూసి షాక్ అయినట్టు ఆమె పేర్కొన్నారు. ప్రజాజీవితంలో ఆరోగ్యకరమైన భాషను నిర్మిద్దామని, మహిళలు, కుటుంబాలు, సామాజిక నియమాలను గౌరవిద్దామని సూచించారు. మహిళలను థంబ్‌నెయిళ్లు, సంచలనాల కోసం ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులను కూడా వదలడం లేదని, అనుభవంతో చెప్తున్నానని అన్నారు. ఎంత కష్టపడి పైకి ఎదిగితే, నిందలు వేసే ప్రయత్నమూ అంతే పెద్దగా జరుగుతుందని పేర్కొన్నారు.

10 లక్షల కోట్లు ఉఫ్



స్టాక్ మార్కెట్‌కు మిడిల్‌ఈస్ట్ దెబ్బ
సెన్సెక్స్ 1,769, నిఫ్టీ 547 పాయింట్లు లాస్

ముంబై, అక్టోబర్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లకు మిడిల్‌ఈస్ట్ దెబ్బ గట్టిగా తగిలింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల దాడి మదుపరులను భయాందోళనలకు గురిచేసింది. అసలే సూచీలు ఆల్‌టైమ్ హైకి చేరిన దగ్గర్నుంచి లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేస్తున్న ఇన్వెస్టర్లను ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు మరింతగా ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే గురువారం పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణలకు దిగారు. దీంతో ఈక్విటీలకు వరుసగా నాల్గో రోజూ నష్టాలు తప్పలేదు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,769.19 పాయింట్లు లేదా 2.10 శాతం కోల్పోయింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తప్ప మిగతావన్నీ నష్టాలనే మూటగట్టుకోవాల్సి వచ్చింది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ కూడా దారుణంగా తగ్గింది. 546.80 పాయింట్లు లేదా 2.12 శాతం కూలింది. చివరకు 25,250.10 వద్ద స్థిరపడింది.

ఆరంభం నుంచీ..

మంగళవారం రాత్రి ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణుల దాడి జరిగిన నేపథ్యంలో ఊహించినట్టుగానే గురువారం ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. బుధవారం గాంధీ జయంతి కారణంగా దేశీయ మార్కెట్లకు సెలవు. దీంతో ఆ ప్రభావం మరుసటి రోజు ట్రేడింగ్‌లో స్పష్టంగా కనిపించింది. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌ఐఐ) తమ పెట్టుబడులను భారతీయ మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకుంటూనే ఉండటం, మిడిల్‌ఈస్ట్ ఉద్రిక్తతలతో పెరిగిన ముడి చమురు ధరలు, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) సెగ్మెంట్‌పై మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ తెచ్చిన కఠిన నిబంధనలు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఇక సెన్సెక్స్‌లో ఎల్‌అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటర్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 2.27 శాతం, స్మాల్‌క్యాప్ 1.84 శాతం చొప్పున క్షీణించాయి. రంగాలవారీగా రియల్టీ (4.49 శాతం), క్యాపిటల్ గూడ్స్ (3.18 శాతం) అత్యధికంగా నష్టపోయాయి.

దిగజారి మూడు వారాల కనిష్ఠాన్ని తాకుతూ 82,497.10 వద్దకు పరిమితమైంది. గత నెల సెప్టెంబర్ 11 తర్వాత సూచీకి ఇదే అత్యల్ప స్థాయి. ఇక ఒకానొక దశలోనైతే 1,832.27 పాయింట్లు

సెన్సెక్స్ టాప్-10 నష్టాలు

2024 జూన్ 4	4,389.73
2020 మార్చి 23	3,934.72
2020 మార్చి 12	2,919.26
2020 మార్చి 16	2,713.41
2022 ఫిబ్రవరి 24	2,702.15
2024 ఆగస్టు 5	2,222.55
2020 మే 4	2,002.27
2020 మార్చి 9	1,941.67
2021 ఫిబ్రవరి 26	1,939.32
2024 అక్టోబర్ 3	**1,769.19**

పతనానికి ప్రధాన కారణాలు

- మిడిల్‌ఈస్ట్‌లో ఉద్రిక్తకర పరిస్థితులు
- ఎఫ్‌అండ్‌వోపై సెబీ కఠిన నిబంధనలు
- మదుపరుల లాభాల స్వీకరణ వైఖరి
- తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు
- పెరిగిపోతున్న ముడి చమురు ధరలు
- అంతర్జాతీయ మార్కెట్ల నష్టాలు

14న హ్యుందాయ్ ఐపీవో!

ఈ నెల 14న హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ రావచ్చని సమాచారం. దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా భారీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు ఈ దక్షిణ కొరియా ఆటో దిగ్గజం సిద్ధమైన విషయం తెలిసిందే. ఏకంగా రూ.25,000 కోట్లతో వస్తున్నది మరి.

లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ మదుపరుల సంపద కూడా పెద్ద ఎత్తునే కరిగిపోయింది. ఈ ఒక్కరోజే దాదాపు రూ.10 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.9,78,778.57 కోట్లు దిగజారి రూ.4,65,07,685.08 కోట్లకు పరిమితమైంది. మొత్తంగా గడిచిన నాలుగు రోజుల్లో సుమారు రూ.15 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైపోవడం గమనార్హం.

వెలవెలబోతున్న రూపాయి

- **డాలర్ ముందు నానాటికీ డీలా**
- **ఒక్కరోజే 14 పైసలు పతనం**
- **గత 5 రోజుల్లో 38 పైసలు క్షీణత**



రూపాయి మారకం విలువ అంతకంతకూ పడిపోతున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ ముందు ఏమాత్రం నిలదొక్కుకోలేక రోజుకింత చతికిలపడుతున్నది. గురువారం ఒక్కరోజే 14 పైసలు కోల్పోయిన దేశీయ కరెన్సీ.. గత 5 రోజుల్లో 38 పైసలు క్షీణించడం గమనార్హం. ప్రస్తుతం 83.96 వద్ద స్థిరపడగా, ఒకానొక దశలో 84 మార్కుకు దిగజారింది. కాగా, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పెరుగుతున్న ముడి చమురు ధరలు ప్రభావితం చేస్తున్నట్టు ఫారెక్స్ ట్రేడర్లు తాజా సరళిని విశ్లేషిస్తున్నారు. స్టాక్ మార్కెట్ల భారీ పతనం, దూరమవుతున్న విదేశీ పెట్టుబడులు సైతం దెబ్బతీస్తున్నట్టు వారు పేర్కొంటున్నారు.

బిగ్‘సి’లో దసరా ధమాకా



హైదరాబాద్, అక్టోబర్ 3: బిగ్‘సి’ ‘దసరా ధమాకా’ ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ..ప్రస్తుత పండుగ సీజన్‌లో మొబైల్ కొనుగోలు చేసిన వారికి నాలుగు ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తున్నామన్నారు. ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10 వేల వరకు మొబైల్ ప్రొటెక్షన్ ఉచితంగా అందిస్తున్నట్లు, అలాగే రూ.10 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, రూ.5,999 వరకు విలువైన ఖచ్చితమైన బహుమతితోపాటు ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా కస్టమర్లకు అందిస్తున్నట్లు చెప్పారు. వీటితోపాటు ఒప్పో మొబైల్‌ను కొనుగోలు చేసిన వారు లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షలు నగదు గెలుచుకునే అవకాశం కూడా కల్పించింది.

20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ: భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్‌ఎనర్జీని ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, సెమీకండక్టర్ల పరిశ్రమల ఏర్పాటుకు ఇక్కడ మంచి అవకాశాలు ఉన్నాయని ఉపముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. జపాన్ పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రముఖ సెమీకండక్టర్ల సంస్థ రోహ్మ్‌ను సందర్శించారు.



హైదరాబాద్‌లో మ్యారియట్ జీసీసీ

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న మ్యారియట్ హోటల్స్..హైదరాబాద్‌లో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ)ని ఏర్పాటు చేయబోతున్నది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. దేశంలో మొదటిసారిగా ఇక్కడే ఏర్పాటు చేయడానికి మ్యారియట్ ముందుకొచ్చిందన్న ఆయన.. వచ్చే ఏడాది మార్చిలోగా కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. తొలి దశలో 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మ్యారియట్ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కూడా టెక్ యాక్సిలరేటరి సెంటర్లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నదన్నారు.

గ్రీన్ ఫార్మా సిటీలో కాలుష్యం ఉండదు...

ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే ఫార్మా సిటీ పూర్తిగా పర్యావరణ హితంగా ఉంటుందని శ్రీధర్ బాబు తెలిపారు. అసలు కాలుష్యమే వెలువడని (జీరో పొల్యూషన్) పరిశ్రమలు ఉంటాయని చెప్పారు. కొద్దిపాటి రసాయన కాలుష్య వ్యర్థాలు ఉత్పత్తి అయినా ఆయా కంపెనీలే సొంత ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేసుకుంటాయని వెల్లడించారు. మరో పది రోజుల్లో ఎన్ని ఫార్మా కంపెనీలు వచ్చేది తెలుస్తుందని ఆయన వివరించారు.

సిమెంట్ ఉత్పత్తిని ఆపండి!
అంబుజా ప్లాంట్‌కు పీసీబీ ఆదేశాలు

దామరచర్ల, అక్టోబర్ 3: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం పరిధిలో ఉన్న అంబుజా సిమెంట్ కర్మాగారంపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) చర్యలు చేపట్టింది. పీసీబీ అధికారులు గురువారం పరిశ్రమను తనిఖీ చేసి సిమెంట్ ఉత్పత్తిని నిలుపుదల చేయాలని అదేశాలు జారీ చేసినట్టు సమాచారం. కాలుష్యం నియంత్రణలో అంబుజా సంస్థ సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు పరిశ్రమపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ప్లాంట్‌కు డస్ట్ క్లీనర్ లేక పొగ గొట్టాల ద్వారా కాలుష్యం అధికంగా వస్తుండటంతో పరిశ్రమపై పీసీబీ చర్యలు తీసుకున్నట్టు చెప్తున్నారు.

కియా ఈవీ9.. ధర రూ.1.3 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 3: దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ సంస్థ కియా..దేశీయ మార్కెట్‌కు మరో ఈవీని పరిచయం చేసింది. ఈవీ 9 పేరుతో విడుదల చేసిన ఈ కారు ధర రూ.1.3 కోట్లుగా నిర్ణయించింది. ఇప్పటికే సంస్థ రూ.61 లక్షల విలువైన ఈవీ 6ని విక్రయిస్తున్న విషయం తెలిసిందే. విదేశాల నుంచి దిగుమతి చేసుకొని ఇక్కడ తయారు చేస్తున్నవి ఈ రెండు మాడళ్లు. దీంతోపాటు రూ.63.9 లక్షల ధర కలిగిన కార్నివాల్ లిమోసైన్ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కియా ఇండియా ఎండీ, సీఈవో గ్వాంగూ లీ మాట్లాడుతూ...వచ్చే ఏడాది మాస్ సెగ్మెంట్‌లో తొలి ఈవీ కారును విడుదల చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 2030 నాటికి వార్షిక విక్రయాలు 4 లక్షల యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ ఇందుకోసం మాస్ సెగ్మెంట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నట్లు తెలిపారు.



జేఎల్, గ్రూప్4 ఫలితాలు ఇవ్వండి

- **టీజీపీఎస్సీ, గాంధీభవన్ ముట్టడి**
- **దసరాలోపే భర్తీ చేయాలని అభ్యర్థుల డిమాండ్**



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): జూనియర్ లెక్చరర్ (జేఎల్), గ్రూప్ 4 పరీక్షల తుది ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు అభ్యర్థులు గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం గ్రూప్ 4 అభ్యర్థులు కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌ను కూడా ముట్టడించారు. ఆయా చోట్ల అభ్యర్థులు తుది ఫలితాల ప్రకటనలో జాప్యంపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. సత్వరమే ఫలితాలను ప్రకటించాలని, దసరా లోపే నియామకాలను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. టీజీపీఎస్సీ 2022లో జేఎల్ నోటిఫికేషన్‌ను విడుదల చేయగా, 2023లో పరీక్షలను నిర్వహించి, 2024లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేశారు. తుది ఫలితాలను విడుదల చేయాల్సి ఉన్నది. డీఎస్సీ అభ్యర్థులతోపాటు తమకు ఎల్బీ స్టేడియంలో నియామకపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పండుగ మురిపెం లేకపాయె..!
సోషల్ వెల్ఫేర్ గురుకులంలో ట్రైనింగ్ రగడ..


హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్)ఉన్నతాధికారులు పండుగ మురిపెం లేకుండా చేస్తున్నారని సొసైటీ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సొసైటీలో లేనివిధంగా శిక్షణ పేరిట దసరా పండుగను దూరం చేస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని శిక్షణను వాయిదా వేయించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల్లోని డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, పీడీ, లైబ్రేరియన్ తదితర ఖాళీలన్నింటినీ ఇటీవల ట్రిబ్ భర్తీ చేసింది. రెండు నెలల క్రితమే రిక్రూట్ అయినవారికి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చి సొసైటీలన్నీ ఉద్యోగులకు ఓరియంటేషన్ శిక్షణ పూర్తిచేశాయి. అయితే, ఎస్సీ గురుకుల సొసైటీ మాత్రం ఉద్యోగాల్లో చేరిన 2 నెలల తర్వాత, దసరా సెలవుల్లో శిక్షణ ఏర్పాటుచేసింది. నేటి నుంచి ఈ నెల 8 వరకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. సరూర్‌నగర్‌లోని ఉమెన్ లా అండ్ పీజీ కాలేజీలో శిక్షణ కొనసాగనున్నది. ఇదే సమయంలో డిగ్రీ కాలేజీ ఉద్యోగులకు సైతం శిక్షణ డ్యూటీలను అలాట్ చేసింది. పండుగ ముందు, సెలవురోజుల్లో శిక్షణ ఏర్పాటుపై ఉద్యోగులు, కొత్తగా రిక్రూటైన వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల్లో చేరిన 2 నెలల తర్వాత శిక్షణ పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు.

డీఎస్సీ జాబితాపై అభ్యంతరాలు
పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌కు అభ్యర్థుల క్యూ

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ 1:3 జాబితాపై పలు అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తమకు అన్యాయం జరుగుతున్నదంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయానికి క్యూ కట్టారు. పలు జిల్లాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు అధికారులను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఒక జిల్లాలో రెండు పోస్టులుంటే 1 : 3 జాబితాలో ఇద్దరు నాన్‌లోకల్ అభ్యర్థులకు చోటు కల్పించాలని, స్థానికులం తామేం కావాలని ఓ అభ్యర్థి వాపోయాడు. ఇక స్పోర్ట్స్ రిజర్వేషన్‌లో హైకోర్టు తీర్పు అమల్లో భాగంగా స్టేట్, జిల్లాస్థాయిలో పాల్గొన్నవారి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను చేపట్టలేదని మరో అభ్యర్థి పేర్కొన్నాడు. కాగా, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నేపథ్యంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఎడ్) రెండో సంవత్సరం ఫలితాలను అధికారులు విడుదల చేశారు. డీఎడ్ రెండో సంవత్సరం విద్యార్థులను సైతం డీఎస్సీ రాసుకునే అవకాశం కల్పించారు.

గిరిజనులకు ప్రత్యేక వార్డులు: మంత్రి దామోదర

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ దవాఖానల్లో గిరిజనులకు ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేసి గిరిజన భాష మాట్లాడే సిబ్బందిని నియమించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏలు, గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలల్లో అందిస్తున్న సేవలపై గురువారం హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో అవసరం మేరకు హెల్త్ సబ్‌సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని, ఇందుకు వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు.








దుబ్బాక ఎమ్మెల్యే కాన్వయ్ వెళ్తుండగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక ఎమ్మెల్యే కారుపై కాంగ్రెస్ దాడి

- నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను అడ్డుకునే యత్నం
- బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించడంతో ఉద్రిక్తత
- వాహనంపైకి కోడిగుడ్లు విసిరిన కాంగ్రెస్ శ్రేణులు
- డైవర్షన్ రాజకీయాలు మాని పాలనపై దృష్టిపెట్టాలన్న ఎమ్మెల్యే

దుబ్బాక, అక్టోబర్ 3: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపించారు. వారిని బీఆర్ఎస్ శ్రేణులు నిలువరించడంతో ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలోని శివాజీ చౌక్ వద్దకు ఎమ్మెల్యే కాన్వాయ్‌లో వస్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతలోనే కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వాహనంపై కోడిగుడ్లు విసిరేందుకు ప్రయత్నించగా అవి పక్కన రోడ్డుపై పడ్డాయి. కాంగ్రెస్ నాయకుల కవ్వింపు చర్యలపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల జోక్యంతో రెండు పార్టీల వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఘటనపై దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి దొంగే .. దొంగ అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ సర్కారు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నదని, అధికారంలో ఉన్నామనే సోయి తెచ్చుకుని బాధ్యతాయుతమైన పాలన అందించాలని హితవు పలికారు. దిగజారుడు రాజకీయాలు, ప్రతిపక్షాలను వేధించే రాజకీయాలు మానుకోవాలని కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు.



రుణమాఫీ చేయాలని కామారెడ్డి జిల్లా లింగంపేటలో ధర్నా చేస్తున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

రుణమాఫీ పేరిట సర్కార్ వంచన

- సగం మందికి కూడా మాఫీ చేయలె
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్
- కామారెడ్డి జిల్లా లింగంపేటలో అన్నదాతల మహా ధర్నా

లింగంపేట, అక్టోబర్ 3: రుణమాఫీ పేరిట సర్కార్ రైతులు మోసగించిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా లింగంపేటలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. షరతుల్లేకుండా రుణమాఫీ, రైతుభరోసా అమలు, పంటలకు బోనస్ ఇవ్వాలని కోరుతూ మహాధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న రేవంత్ 300 రోజులు దాటినా అమలు చేయలేదని విమర్శించారు. లింగంపేట మండలంలో 3,972 మంది రైతులకు గాను 1,400 మందికి మాత్రమే మాఫీ చేసి, మిగతా వారికి ఎగ్గొట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు వలసలు వెళ్లిన ప్రజలు మూసీ పరీవాహక ప్రాంతాల్లో గృహాలు నిర్మించుకున్నారని.. ఆ రోజు ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన పేరిట ముఖ్యమంత్రి రేవంత్.. కోట్ల రూపాయలను ఢిల్లీకి పంపేందుకు కుట్ర పన్నాడని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్‌రెడ్డి సద్దులు, సంచులు మోయడానికే ఢిల్లీ వెళ్తున్నాడు తప్పితే అక్కడి నుంచి తీసుకువచ్చింది ఏమీ లేదని అన్నారు.

నేడు తొర్రూరులో బీఆర్ఎస్ మెగా ధర్నా

- రుణమాఫీ అమలుపై ఎర్రబెల్లి నేతృత్వంలో పోరు
- రానున్న బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఏర్పాట్లను సమీక్షించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు



తొర్రూరు, అక్టోబర్ 3: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపచేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కప్పదాటు వైఖరిని ఎండగడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో తొర్రూరులో శుక్రవారం భారీ ధర్నాకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలం కావడం, రుణమాఫీని పూర్తి స్థాయిలో అర్హులైన రైతులకు వర్తింప చేయకపోవడాన్ని నిరసిస్తూ తలపెట్టిన ధర్నాలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితోపాటు పలువురు నేతలు ఈ ధర్నాలో పాల్గొననున్నట్టు మాజీ మంత్రి దయాకర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ.. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేందుకు, రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఓట్లు దండుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రుణమాఫీ అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ తలపెట్టిన ధర్నాకు దగా పడ్డ రైతులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

టార్గెట్ కేవీపీ రాంచందర్‌రావు!

- కాంగ్రెస్ సీనియర్ నేతపై రేవంత్ వ్యాఖ్యలు
- వివాదాస్పద స్థలంలో ఫాంహౌస్ ఉందని ఆరోపణ
- గతంలోనూ శశిథరూర్‌పై నోరుజారిన సీఎం
- ముఖ్యమంత్రి వైఖరిపై మండిపడుతున్న హస్తం నేతలు



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి సొంత పార్టీ సీనియర్ నేతపైనే విమర్శలు గుప్పించారు. వ్యక్తిగత మైలేజీ కోసం సీనియర్‌నేతను అభాసుపాలు చేశారని హస్తం నేతలు మండిపడుతున్నారు. కంటోన్మెంట్‌లో గురువారం నిర్వహించిన డిజిటల్ ఫ్యామిలీ కార్డుల పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి మూసీ కూల్చివేతలు, హైడ్రాపై మాట్లాడారు. ఈ సందర్భంగా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అనేకమంది పెద్దలు ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని అంటూ వారి పేర్లను ప్రస్తావించారు. బీఆర్ఎస్ నేతలతో పాటు, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రాంచందర్‌రావు పేరును ఆయన ఉదహరించారు. కేవీపీ అక్రమంగా ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అనేక వివాదాస్పద ప్రాంతాల్లో అనేకమంది కాంగ్రెస్ నేతల నిర్మాణాలు ఉన్నా.. వారందరినీ వదిలిపెట్టి కేవలం సీనియర్ నేత కేవీపీ పేరునే ఉటంకించడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ మైలేజీ కోసమే సీఎం సీనియర్లకు అక్రమాలు అంటగడుతున్నారని హస్తం నేతలు మండిపడుతున్నారు. గతంలో నూ సీనియర్ నేత శశిథరూర్‌ను రేవంత్‌రెడ్డి.. 'ఆయన ఓ గాడిద. పార్టీ నుంచి బహిష్కరించాలి' అని వ్యాఖ్యానించారు. ఆ తరువాత వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత పల్లం రాజుకు చెందిన ఉస్మాన్‌సాగర్‌లోని ఫామ్‌హౌస్‌ను హైడ్రా కూల్చివేసింది. రేవంత్ మొదటి నుంచి సీనియర్ నేతల విషయంలో దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని నేతలు మండిపడుతున్నారు.

సెర్చ్ కమిటీ నుంచి నన్ను తప్పించండి

- ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తి
- ఆయన స్థానంలో మరొకరు
- నేడు 4 వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): కాకతీయ వర్సిటీ సెర్చ్ కమిటీలో తానుండలేనని, తనను సెర్చ్ కమిటీ నుంచి తప్పించాలని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. రెండ్రోజుల క్రితం ఆయన లేఖ రాశారు. కేయూ సెర్చ్ కమిటీ సమావేశం శుక్రవారం జరుగనుండగా.. ప్రొఫెసర్ హరగోపాల్ అనాసక్తి వ్యక్తంచేయడంతో ఆయన స్థానంలో జేఎన్టీయూకు చెందిన ప్రొఫెసర్ దామోదరాన్ని సెర్చ్ కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఈ అంశంపై హరగోపాల్ మాట్లాడుతూ.. తాము వద్దన్న వారినే వీసీలుగా ఎంపికచేస్తున్న తరుణంలో సెర్చ్ కమిటీల్లో ఉండి లాభమేంటని ప్రశ్నించారు. గురువారం ఉస్మానియా, పొట్టి శ్రీరాములు తెలుగు, పాలమూరు వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలను సచివాలయంలో నిర్వహించారు. శుక్రవారం తెలంగాణ, జేఎన్టీయూ, శాతవాహన, కాకతీయ వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు జరుగనున్నాయి.

విద్యా నిధుల్లో కోత తగదు

- విద్యా పరిరక్షణ కమిటీ ఆక్షేపణ

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక 7.3 శాతం మాత్రమే ఇచ్చిందని, ఇది ఏ మాత్రమూ సరికాదని రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ ఆక్షేపించింది. తమిళనాడులో 13.4శాతం, కర్ణాటకలో 12.9శాతం, కేరళలో 14.8 శాతం, ఏపీలో 12.6శాతం, దేశవ్యాప్తంగా సగటున 15శాతం నిధులిస్తే తెలంగాణలో కేవలం 7.3 శాతం నిధులిచ్చి చేతులు దులుపుకున్నారని పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యారంగంలో మార్పులపై గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఆశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో-25ను ఉపసంహరించుకోవాలని, 1-3 తరగతులను అంగన్‌వాడీలో కలిపే ఆలోచనను విరమించుకోవాలని, ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని సమావేశంలో నిర్ణయించారు.

మాడల్ టీచర్లకు పదోన్నతులివ్వండి

- టీఎంఎస్‌టీఏ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మాడల్ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(టీఎంఎస్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూతం యాకమల్లు, కొంతం నగేశ్ గురువారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాడల్ స్కూళ్లు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే కేడర్‌లో పనిచేస్తున్నామని, పదోన్నతులు కల్పించి నూతన నియామకాలు, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించి కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలివ్వండి

- అయా శాఖలకు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ వాటి ఉపకులాలకు చెందిన ఉద్యోగుల వివరాలను అందించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీచేశారు. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలను అప్‌డేట్ చేసేందుకు కొత్త మాడ్యూల్ రూపొందించినట్టు తెలిపారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల క్యాటగిరీలో ఉప వర్గీకరణకు ఆయా రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సముదాయాల ప్రాతినిధ్య నిష్పత్తి కోసం వివరాలను సేకరించాలని ఆదేశించింది. సుప్రీం ఆదేశం మేరకు వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఈ నెల 5వ తేదీలోగా పొందుపర్చాలని సుల్తానియా సూచించారు.

ఎన్పీఏ డైరెక్టర్‌గా అమిత్‌గార్గ్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్వీపీఎన్పీఏ) డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి అమిత్‌గార్గ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎన్పీఏ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కొనసాగిన ఆయనను పూర్తిస్థాయి డైరెక్టర్‌గా కేంద్ర హోం శాఖ నియమించింది.

మరో 3 రోజులు వానలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 3 రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ- గద్వాల జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాలలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

ఇక వాట్సాప్‌లో శ్రీవారి టికెట్లు

టీటీడీకి ఏపీ ప్రభుత్వం సూచన

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సామాన్యులు సులభంగా తిరుమల శ్రీవారిని దర్శించుకునేలా ముందస్తు బుకింగ్ విధానాన్ని తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తున్నది. టీటీడీలో వాట్సాప్ ద్వారా దర్శనం బుకింగ్ సేవలను ప్రారంభించి, తర్వాత అన్ని ఆలయాల్లోనూ ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆలోచిస్తున్నది. శ్రీవారి దర్శనం కోసం సిఫార్సు లేఖల ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.



సీనియర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్‌పై దాడి

- ప్రభుత్వానికి వ్యతిరేక వార్తలు ప్రసారం చేయొద్దని అల్టిమేటం
- బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ఖైరతాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేస్తున్నారనే అక్కసుతో సీనియర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్‌పై గుర్తుతెలియని దుండగులు గురువారం దాడి చేశారు. ఈ దాడి కాంగ్రెస్ మూకల పనేనని ఆరోపణలు వస్తున్నాయి. నగరం నడిబొడ్డున, ప్రగతి భవన్‌కు కూతవేటు దూరంలో ఈ దాడి జరగడం గమనార్హం. పంజాగుట్ట మొన్నప్ప జంక్షన్ సమీపంలో సీనియర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్ 'యూ' న్యూస్ పేరుతో యూ ట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం న్యూస్ చదివి స్నేహితుడు అజయ్‌తో కలిసి టిఫిన్ చేసేందుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో 10-12 మంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి 'నీవే కదా చిలుక ప్రవీణ్' అంటూ ప్రశ్నించారు. అవుననే సరికి అతనిపై విరుచుకుపడ్డారు. 'నువ్వు మారవారా?' అంటూ పిడిగుద్దులు గుద్దారు. అడ్డు వెళ్లిన అతని స్నేహితుడు అజయ్‌ను సైతం చితకబాదారు. ఈ దాడిలో గాయపడిన ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం యశోద దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. దుండగులు రెండు మూడు రోజుల నుంచి రెక్కీ నిర్వహించారు. బుధవారం ప్రవీణ్ ఆఫీసు వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తమకు భూసమస్య ఉందని, దానిపై ఓ వార్త ప్రసారం చేయడం ద్వారా తమకు న్యాయం జరుగుతదని మాట్లాడారు. డాక్యుమెంట్లు తెచ్చారా అని ప్రశ్నించగా భిన్నమైన సమాధానాలు చెప్పి వెళ్లిపోయారని ప్రవీణ్ స్నేహితులు చెప్తున్నారు. వాళ్లే ఆఫీసును చూసి, ప్రవీణ్ ఎప్పుడు కిందకు వస్తాడు అనే వివరాలు సేకరించి దాడి చేశారని ఆరోపించారు. సోమాజిగూడలోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, గ్యాదరి కిశోర్ పరామర్శించారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల, బూడిద భిక్షమయ్యగౌడ్, గాదరి కిశోర్, నాయకుడు పల్లె రవి తదితరులు

ట్రిపుల్ ఆర్ రైతులకు అన్యాయాన్ని సహించం

బాధితుల తరపున పోరాడుతాం: మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబర్ 3: ట్రిపుల్ ఆర్ విస్తరణలో రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల రాజశేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, రాష్ట్ర గీత కార్మిక ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్, రైతు సంఘం నాయకుడు సాగర్ తదితరలు హాజరై మద్దుతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు కోరుతున్న విధంగా ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు అలైన్‌మెంట్ మార్చాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ బాధిత రైతులకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారు నిర్వహించే ప్రతి పోరాటానికి మద్దతు ఇస్తామని చెప్పారు. అలైన్‌మెంట్ మార్చకుంటే రైతులు కోట్లాది రూపాయిల విలువైన భూములు కోల్పోతారని తెలిపారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చిస్తామని చెప్పారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరినీ కదిలించినా దుఖంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. మాజీ ఎమ్మెల్యే పైళ్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి రైతులను మోసం చేసిందని విమర్శించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ భూమినే నమ్ముకొని జీవించే రైతులకు అన్యాయం చేయడం తగదన్నారు. రైతులు నిర్వహించే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెప్పారు. ఐక్యవేదిక నాయకులు దామోదర్‌రెడ్డి, బురుగ కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, శ్రీశైలం, సుందర్‌రెడ్డి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి

- 26 లక్షలు అప్పులు కావడంతో ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

మిరుదొడ్డి, అక్టోబర్ 3 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా డబ్బులు కోల్పోయిన యువ వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో గురువారం చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్సై బీ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన ఇదారి నవీన్ (27) వ్యవసాయ సంబంధిత రసాయన ఎరువులు గ్రామంలో రైతులకు విక్రయిస్తుంటాడు. సులభంగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన నవీన్ రూ.26 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నవీన్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, రెండేండ్ల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతన్నలు

ఉపాధి కోసం నేతన్నల ఆందోళన

- సిరిసిల్ల పట్టణంలో భారీ ధర్నా
- కాంగ్రెస్ సర్కార్ వచ్చినంక పనిలేక పస్తులే
- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రమేశ్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల నేత కార్మికులు మరోమారు ఆందోళనకు దిగారు. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీవై నగర్‌లో చేనేత జౌళీ శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని లభించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీ నిలిపివేయడం వల్ల ఉపాధి పనిలేక అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాలు నేడు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని తెలిపారు. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. కార్మికులకు రావాల్సిన యార్న్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు కలెక్టర్, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించిన స్పందించడం లేదని చెప్పారు. వెంటనే యార్న్ సబ్సిడీ విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుకాసురులతో పోలీసుల దోస్తీ!

- ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై 'వీఆర్ వేటు'
- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో దారుణ వైఫల్యం
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకూ సాయం
- 'మైనర్' రేప్ ఘటనలో వికారాబాద్ సీఐ సస్పెండ్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): లంచాల కోసం ఇసుకాసురులతో అంటకాగుతున్న ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలను వీఆర్‌కు అటాచ్ చేస్తూ గురువారం మల్టీజోన్-2 ఐజీ వీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో పెట్టినవారిలో సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతో పాటు.. వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల్లి, హాలియా ఎస్సైలు ఉన్నారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉండటంతో వారిపై డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకున్నట్టు ఐజీ తెలిపారు. త్వరలో వీరిని లూప్‌లైన్‌కు బదిలీ చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఒక సీఐ, 14 మంది ఎస్సైలను కూడా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

నిఘా అధికారుల నివేదికలతో..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాన మల్టీజోన్-2లో ఇసుక అక్రమ రవాణాదారులు రెచ్చిపోయారు. పోలీసులు అండదండలు దండిగా ఉండటంతో మరింత దూకుడు పెంచారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వైరీల ద్వారా పోలీసులు, ఇసుక అక్రమార్కులు చేస్తున్న దారుణాలు ఐజీ ఆఫీసుకు తెలిశాయి. దీంతో ఐజీ సత్యనారాయణ తక్షణం వీఆర్ చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అక్రమార్కులతో కలిసి పనిచేసిన అడవిదేవిపల్లి, వేములపల్లి, నార్కట్‌పల్లి, చండూర్, మాడుగులపల్లి, తిప్పర్తి, చింతలపాలెం, తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, అచ్చంపేట, బొంరాస్‌పేట, తాండూర్, చిన్నంబావి ఎస్సైలను ఐజీ బదిలీ చేశారు.



పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలోనూ..

ఉన్నతాధికారులు ఇసుక అక్రమ రవాణాదారులతో కలిసి తిరుగుతుంటే.. కిందిస్థాయి సిబ్బంది రేషన్‌బియ్యం అక్రమంగా తరలించే వారితో, మట్కా, గ్యాంబ్లింగ్ నిర్వహించేవారితో అంటకాగుతున్నారు. దీంతో కానిస్టేబుళ్లపైనా తీవ్రమైన ఆరోపణలు వస్తుండటంతో వారిపైనా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల ఎస్పీలకు ఐజీ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి హోంగార్డు (947), జడ్చర్ల హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ (1049)ను డీఏఆర్‌కు అటాచ్ చేశారు. ఇప్పటికే వికారాబాద్‌లోని మర్పల్లిలో గెస్ట్ హౌస్‌లో పేకాట నిర్వహిస్తున్న ప్రభాకర్ సేట్, రఫీక్‌కు వికారాబాద్ ఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. రఫీ మీద సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేశారు.

వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్

ఓ మైనర్ రేప్ ఘటనలో తక్షణ విచారణ చేపట్టకుండా విధుల్లో అలసత్వం వహించిన వికారాబాద్ టౌన్ సీఐ నాగరాజు సస్పెండ్ అయ్యాడు. జోగిపేట ఎస్‌హెచ్‌వోగా, వికారాబాద్ టౌన్ పీఎస్‌గా పనిచేస్తున్న అతడు.. నిందితుల నుంచి లంచం తీసుకొని విచారణలో అవకతవకలకు పాల్పడ్డాడు. దీంతో సీఐని ఐజీ సత్యనారాయణ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నీచ స్థాయికి దిగజారడం సిగ్గుచేటు

‘గౌరవప్రదమైన స్థానంలో ఉన్న ఓ మహిళా మంత్రి చేసిన అమానవీయ వ్యాఖ్యలు నన్ను తీవ్రంగా బాధించాయి. త్వరితగతిన తాము ఆశించిన లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు సినీ సెలబ్రిటీలను టార్గెట్ చేయడం సిగ్గుచేటు. మా సభ్యులపై చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలను ఖండించే విషయంలో సినీ కుటుంబం ఏకతాటిపై నిలుస్తుంది. రాజకీయ విషక్రీడలో తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇంతటి నీచస్థాయికి దిగజారి వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు, ముఖ్యంగా మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. సమాజ అభివృద్ధిని కాంక్షిస్తూ మనం నాయకులను ఎన్నుకుంటాం. ఇలాంటి మాటలతో వారు తమ స్థాయిని తగ్గించుకోవద్దు. ఉన్నత స్థానాల్లో ఉన్న రాజకీయ నాయకులు, వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి. ఇలాంటి హేయమైన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతున్నా’

- చిరంజీవి



మహిళను ఆయుధంగా వాడుకోవడం హేయమైన చర్య

రాజకీయలబ్ధి కోసం వ్యక్తిత్వ హననానికి పాల్పడటం నన్ను ఎంతగానో బాధించింది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు తమ స్వప్రయోజనాల కోసం మహిళను ఆయుధంగా వాడుకోవడం దురదృష్టకరం. సినిమా వాళ్లు పరస్పర గౌరవం, అంకితభావంతో పనిచేస్తారు. తమ వ్యక్తిగత జీవితానికి ఎంతో విలువిస్తారు. అలాంటి వారిని లక్ష్యంగా చేసుకోవడం సిగ్గుచేటు. గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్న వారు నైతిక విలువలు కలిగి ఉండాలి. రాజకీయ స్వార్థం కోసం వ్యక్తుల జీవితాలను టార్గెట్ చేయడం ఆమోదయోగ్యం కాదు. ఉన్నత స్థానాల్లో ఉన్నవారు మాట్లాడేముందు వాటి తాలూకు పర్యవసానాలను బేరిజు వేసుకోవాలి. సంయమనంతో వ్యవహరించాలి.

- వెంకటేష్



నన్ను తీవ్రంగా కలచివేశాయి

మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతగానో బాధించాయి. ఒక కుమార్తెకు తండ్రిగా, ఒక భార్యకు భర్తగా, ఒక తల్లికి కుమారుడిగా.. ఒక మహిళా మంత్రి మరో మహిళపై చేసిన వ్యాఖ్యలు నన్ను తీవ్రంగా కలచివేశాయి. ఇతరుల మనోభావాలను గాయపర్చనంత వరకు మనందరం వాక్ స్వేచ్ఛను ఉపయోగించుకోవచ్చు. కానీ ఇలాంటి చౌకబారు, నిరాధారమైన ఆరోపణలు చేయడం ఏమాత్రం సమంజసం కాదు. వీటిని నేను తీవ్రంగా ఖండిస్తున్నా. సినీ ప్రముఖులను లక్ష్యంగా చేసుకొని దురుద్దేశ పూర్వకంగా వ్యాఖ్యలు చేయొద్దని కోరుతున్నా. మహిళలందరినీ గౌరవంగా చూడటం మన కర్తవ్యం కావాలి.

- మహేష్‌బాబు





అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న సినీలోకం



ఏ మాత్రం ఉపేక్షించవద్దు

సినీ తారలు, కుటుంబాలపై చేసిన నిరాధారమైన, హేయమైన వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నా. ఓ మహిళ విలువలు మరిచి ఇలా మాట్లాడటం తెలుగు సంస్కృతికి విరుద్ధం. బాధ్యతారాహిత్యంతో చేసిన వ్యాఖ్యలను ఏ మాత్రం ఉపేక్షించవద్దు. ప్రతి ఒక్కరి వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలని, ముఖ్యంగా మహిళల పట్ల దయాభావంతో ఉండాలని రాజకీయ పార్టీలను కోరుతున్నా. సమాజంలో విలువలు ప్రోదికోల్పేలా మనందరం ప్రయత్నం చేద్దాం.

- అల్లు అర్జున్

మంత్రి కొండా సురేఖను ముందుపెట్టి సీఎం రేవంత్ ఆడిన డైవర్షన్ గేమ్ బూమరాంగ్ అయింది. పరిపాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నంలో రేవంత్ అండ్ కంపెనీ రచించిన వికృత రాజకీయ నాటకం బెడిసికొట్టింది. నాగచైతన్య, సమంత విడాకుల విషయంలో కొండా సురేఖ చేసిన అమానవీయ వ్యాఖ్యలపై తెలుగు సినీ ఇండస్ట్రీ భగ్గుమంది.

చిన్నాపెద్దా నటులు అనే తేడా లేకుండా యావత్ సినీరంగం ఒక్కతాటిపై నిలిచి ముక్తకంఠంతో నిరసన స్వరం వినిపించారు. చిల్లర డ్రామాలు ఆపి ఇక పరిపాలనపై దృష్టిపెట్టండంటూ రేవంత్ సర్కార్‌కు సోషల్‌మీడియా వేదికగా తలంటారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. filmindustrywillnottolerate అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది. తాజా పరిణామాలు సినీరంగంలోని ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయని ఇండస్ట్రీ వర్గాలు వ్యాఖ్యానించాయి.

ఇకపై చూస్తూ ఊరుకోం

ఇది దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. బాధ్యతా రాహిత్యంగా నిరాధార ప్రకటనలు చేయడం నిజంగా బాధాకరం. మీలాంటి కీలక వ్యక్తులు, ఎదుటివారిపై గౌరవంగా వ్యవహరించాలి. అభిప్రాయ వ్యక్తీకరణలో నియంత్రణ, గోప్యత పాటించాలి. వ్యక్తిగత జీవితాలను బజారుకీడ్చడం మీలాంటి వాళ్లకు తగదు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి నిర్లక్ష్యపూరిత ప్రవర్తనను ఎవరూ హర్షించరు. ఇకపై ఇలాంటి వాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం. పరిధులు దాటి ప్రవర్తించకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

- జూనియర్ ఎన్టీఆర్



ఈ వ్యాఖ్యలు బాధాకరం

సినిమావారి కుటుంబాలపై ఇలా నిరాధరమైన వదంతులు సృష్టించి మాట్లాడితే సహించేది లేదు. మంత్రి కొండా సురేఖ ఇలా అసహ్యాకరమైన వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరం.

- డా.రాజశేఖర్



రాజకీయ మైలేజీ కోసం నా పేరును వాడొద్దు

తెలుగు సినిమా ఇండస్ట్రీ అంటే అద్భుతమైన సృజనాత్మకత, వృత్తిపట్ల నిబద్ధతకు పెట్టింది పేరు. ఇక్కడ నేను అందమైన ప్రయాణాన్ని సాగించాను. ఇప్పటికీ పరిశ్రమతో చక్కటి అనుబంధాన్ని కలిగి ఉన్నా. అలాంటి గొప్ప ఇండస్ట్రీలో ఒక మహిళ గురించి నిరాధారమైన, దుర్మార్గమైన ఆరోపణలు చేయడం కలచివేసింది. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఓ మహిళ మరో మహిళపై వ్యాఖ్యలు చేయడం ఎంతగానో బాధించింది. హుందాగా వ్యవహరించాలనే ఉద్దేశ్యంతో మేమంతా ఇన్నాళ్లుగా మౌనంగా ఉంటున్నాం. దానినే మా బలహీనతగా భావిస్తున్నారు. నేను రాజకీయాలకు పూర్తిగా అతీతంగా ఉంటాను. ఏ పార్టీతో సంబంధాలు లేవు. రాజకీయ మైలేజీ కోసం నా పేరును ఉపయోగించవద్దని కోరుతున్నా. క్రియేటివ్ ఫీల్డ్‌లో ఉన్న వ్యక్తులను రాజకీయ వికృత క్రీడలో భాగం చేయొద్దు. సంచలనాల కోసం వారి పేర్లను వాడుకుంటూ కల్పిత కథనాలను సృష్టించవద్దు.

- రకుల్‌ప్రీత్‌సింగ్



మరచిపోలేని గుణపాఠం చెప్పాలి

కొండా సురేఖ సమంతకు క్షమాపణ చెప్పడం ఏమిటి? అక్కడ అత్యంత జుగుప్సాకరంగా అవమానించింది నాగార్జునని, నాగచైతన్యని..ఒక మామగారు, ఒక భర్త, ఒక కోడలిని, ఒక భార్యను, వాళ్లకి సంబంధించిన ఆస్తిని కాపాడుకోవటానికి ఫోర్స్‌తో పంపించడానికి ట్రై చేస్తే తాను విడాకులు ఇచ్చి వెళ్లిపోయిందని చెప్పడం కన్న ఘోరమైన ఇన్సల్ట్‌ను నేను నా జీవితంలో వినలేదు. ఇది సమంతను అవమానించడం ఎలా అయింది? వాళ్లిద్దరి కోసమే కాకుండా ఈ విషయాన్ని నాగార్జునగారు చాలా సీరియస్‌గా తీసుకొని మరిచిపోలేని గుణపాఠం చెప్పాలి. ఒక మినిస్టర్ హోదాలో ఉండి నాగార్జున, నాగచైతన్యలాంటి డిగ్నిఫైడ్ కుటుంబాన్ని, సమంతలాంటి ఇండస్ట్రీ గర్వించదగ్గ ఒక మంచి నటి మీద అంత నీచమైన మాటలను అనడాన్ని అందరూ తీవ్రంగా ఖండించాలి

- రామ్‌గోపాల్ వర్మ



నిరాధారమైన ఆరోపణలు చేయొద్దు

ప్రతి ఒక్కరి హద్దులను మనం గౌరవించాలి. పరస్పరం హుందాగా వ్యవహరించాలి. నిరాధారమైన ఆరోపణల్ని ఏమాత్రం భరించవద్దు. ముఖ్యంగా అధికారిక స్థానాల్లో ఉన్నవారు జాగ్రత్తగా మాట్లాడాలి.

- రాజమౌళి

కుటుంబం తరపున నిలబడతా

‘మా అమ్మ మాట్లాడిన ప్రతీ మాటను నేను సమర్థిస్తున్నా. నేను నా కుటుంబం పక్షాన నిలబడి పోరాడతాను. ఇలాంటి పైశాచిక వ్యాఖ్యల గురించి మాట్లాడటం నిజంగా బాధగా అనిపిస్తున్నది. కానీ కొన్నిసార్లు ఇలాంటి సైకోపాత్‌లను ఎదుర్కొనక తప్పదు.



- అఖిల్ అక్కినేని



కట్టుకథతో పైశాచికత్వం

కట్టుకథలు అల్లి, ఓ రకమైన పైశాచికత్వంతో ఇండస్ట్రీలోని గౌరవప్రదమైన వ్యక్తులు, కుటుంబంపై మహిళా మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. రాజకీయ క్రీడలో ఇండస్ట్రీ వారిని లాగడం నిజంగా సిగ్గుచేటు. అమాయకులైన వ్యక్తులను, ముఖ్యంగా మహిళలను రాజకీయాల కోసం వాడుకోవద్దు. నేతలు సమాజానికి మంచి చేసే ప్రయత్నం చేస్తూ ఆదర్శంగా నిలవాలి.

- రవితేజ

బేషరుతుగా క్షమాపణ చెప్పండి

కొండా సురేఖగారూ.. స్త్రీగా మీకు కొన్ని విలువలు ఉన్నాయని అనుకుంటున్నా.. అవన్నీ ఎక్కడికి పోయాయి? ఇలాంటి ఆరోపణలు చేసినందుకు మీరు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. మన దేశంలో ప్రజాస్వామ్యం వన్ వే ట్రాఫిక్ కాదు. మాకు సంస్కారం ఉంది. మేం మీలా దిగజారి మాట్లాడలేం. కనీస విలువ లేనివారు రెండు నిమిషాల ఫేమ్ కోసం ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడతారు. బాధ్యతగల పదవిలో ఉండి, చిత్రపరిశ్రమలోని వారిని ఇలా కించపరుస్తూ.. నిరాధారమైన, భయంకరమైన ప్రకటనలు చేయడం నిజంగా బాధాకరం.



-నటి ఖుష్బూ

ఏం చేసినా మౌనంగా ఉండాలా?

ఏదైనా అవసరం పడినప్పుడు సినిమా వాళ్లంతా తమకు మద్దతుగా రావాలని రాజకీయ నాయకులు కోరతారు తమకు ఏదైనా లబ్ధి జరగాలనుకుంటే మాత్రం ఇలాంటి నిరాధారమైన ఆరోపణలతో న్యూసెన్స్ క్రియేట్ చేస్తారు. ఇది ఎంతవరకు న్యాయం? మేము అద్దాల మేడల్లో ఉంటున్నాం కాబట్టి ఏం చేసినా మౌనంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఓ మహిళ మంత్రి ఇలాంటి బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం బాధగా అనిపించింది. ప్రజలకు గొప్ప వినోదాన్ని అందిస్తున్న తారలపై గౌరవాన్ని ప్రదర్శించండి. మీ రాజకీయాల కోసం మమ్మల్ని వాడుకోవద్దు.



- మంచు లక్ష్మి

అసత్య ఆరోపణలు తగదు

ఇతరుల వృత్తుల మాదిరిగానే మా వృత్తినీ గౌరవించండి. క్లిక్స్ కోసం ఇష్టం వచ్చిన థంబ్‌నెయిల్స్ పెట్టి వీడియోలు పోస్ట్ చేయొద్దు. రాజకీయ స్వార్థ ప్రయోజనాలకోసం సినీ, టీవీ ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై అసత్య ఆరోపణలు చేయడం తగదు. ఈ విషయంపై మేమంతా ఒకే కుటుంబంగా నిరసన తెలియజేస్తున్నాం.

- యాంకర్ సుమ కనకాల





ఇకపై ఇలాంటి దాడులు సహించం



ఇతర పరిశ్రమల మాదిరిగానే సినీ పరిశ్రమ కూడా నమ్మకం, గౌరవంతో నడుస్తున్నది. మీ రాజకీయ స్వలాభం కోసం మా జీవితాలపై అబద్ధాలను వండివార్చడం బాధగా ఉంది. నటులుగా మేం అందరివాళ్లం. కానీ మా కుటుంబం మాత్రం మా వ్యక్తిగతం. పరువుతో బతుకుతున్నాం. అన్ని కుటుంబాల్లాగే మాకూ గౌరవం, రక్షణ అవసరం. రాజకీయ నాయకులకు మేం మనవి చేస్తున్నది ఒక్కటే. ప్రజలకు వినోదాన్ని పంచేందుకు మేం ఎంతో కష్టపడుతుంటాం. కళారంగంలో నిరంతరం శ్రమిస్తుంటాం. మీ రాజకీయ ప్రయోజనాలకోసం, ప్రజల దృష్టిని ఆకర్షించడం కోసం మా పేర్లు, మా కుటుంబాల పేర్లు వాడొద్దు. మా జీవితాలను చర్చనీయాంశాలు చేసి, మా మనశ్శాంతిని పోగొట్టొద్దు. కుటుంబాలపై వచ్చే అబద్ధపు కథనాలు తీవ్రమైన మనోవేదనకు గురిచేస్తాయి. అవి కెరీర్‌పై కూడా ప్రభావం చూపిస్తాయి. ఇకపై ఇలాంటి దాడులు సహించం. మేమంతా ఏకమై నిలబడతాం.

- మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా) అధ్యక్షుడు మంచు విష్ణు



హేయమైన చర్యలు మానుకోండి

తెలంగాణకు చెందిన మహిళా మంత్రి .. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించి చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యల పట్ల బాధతో.. రెండు తెలుగు రాష్ట్రాలకూ ప్రాతినిధ్యం వహిస్తున్న తెలుగు ఫిల్మ్‌చాంబర్ ఆఫ్ కామర్స్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం ప్రకటన విడుదల చేసింది. ‘గత కొన్నేళ్లుగా చాలామందికి తెలుగు సినీ సెలబ్రిటీలు సులువైన టార్గెట్‌గా మారారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రభావవంతమైన వ్యక్తులు, అధికారంలో ఉన్న వ్యక్తులు వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయకూడదు. రాజకీయాలు, సినిమాలు సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపే శక్తిమంతమైన సాధకాలు. ఈ రెండు రంగాల వారు పరస్పర సహకారంతో, గౌరవంతో బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించడం అవసరం. రాజకీయ సమస్యలు తలెత్తినప్పుడు ప్రజల దృష్టిని మరల్చడంకోసం సినిమావాళ్ల వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేయడం కొందరికి అలవాటుగా మారింది. ఇలాంటి హేయమైన చర్యలను మానుకోవాలని అందర్నీ కోరుతున్నాం. ఇతరుల దృష్టిని ఆకర్షించడం కోసం తెలుగు సినిమాకు సంబంధించిన వ్యక్తులపై చేస్తున్న దుర్మార్గమైన, హేయమైన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మొత్తం సినీ పరిశ్రమ ఏకతాటిపై నిలబడుతుందని మేం తెలియజేస్తున్నాం. సినిమావాళ్ల వ్యక్తిగత జీవితాలతో ముడిపడిన సున్నితమైన విషయాలపై ఎవరైనా ఈ విధంగా మాట్లాడితే, వారిపై తగిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని మరోమారు హెచ్చరిస్తున్నాం.

- తెలుగు ఫిల్మ్ ఛాంబర్ (TFCC), కార్యదర్శి కె.ఎల్.దామోదరప్రసాద్

మరోసారి రిపీటైతే సహించం

మీకు ఓటు వేసి గెలిపించింది రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని, ప్రగతిపథంలో నడిపిస్తారని, ప్రజాశ్రేయస్సుకోసం శ్రమిస్తారని. ఇలా దిగజారుడు వాఖ్యలు చేయమని కాదు. ఈ తాజా పరిణామంపై అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం కూడా ఇబ్బందిగా ఉంది. ఇలాంటివి మరోసారి రిపీటైతే బాధ్యత గల పౌరులుగా సహించం. అనుమతించం.. అంగీకరించం.



- హీరో దేవరకొండ విజయ్

బాధ్యతగా వ్యవహరించండి

మంత్రి కొండా సురేఖగారు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారహితమైనవి, నిరాధారమైనవి. బాధ్యతగల రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలా బహిరంగంగా అసభ్యకరమైన అపవాదులు వేయడం సమాజపు మూలాలను నాశనం చేయడమే. సినీకళాకారులుగా మేమందరం కలిసే ఉన్నాం. ఇలాంటి నిర్లక్ష్యపు ప్రవర్తన మరోసారి పునరావృతం అయితే సహించం. ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలి. వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలి. **- రామ్‌చరణ్**

నాన్సెన్స్ పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టండి

కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఓ కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ మహిళలను కించపరిచే ధోరణి ఏమాత్రం సమంజసం కాదు. ఈ రకమైన దుర్మార్గమైన ధోరణుల్ని సినిమా ఇండస్ట్రీ ఏ మాత్రం ఉపేక్షించదు. రాజకీయ కక్షసాధింపుల కోసం సినిమా వాళ్లను లక్ష్యంగా ఎంచుకోవద్దు. ఇలాంటి నాన్సెన్స్‌ను పక్కనబెట్టి ప్రభుత్వాలు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.



- వరుణ్‌తేజ్



సినిమావాళ్లు సాఫ్ట్ టార్గెట్స్‌గా మారుతున్నారు

ఓ సినీ కుటుంబం మీద అంతటి నీచమైన వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరి కాదు. వాళ్లు ఈ మధ్యే సమస్యలను అధిగమించి కాస్త కుదుటపడుతున్నారు. అన్నింటికంటే సిగ్గు చేటైన విషయం ఏమిటంటే..ఓ మహిళ అయిఉండి మరో మహిళ మీద హేయమైన వ్యాఖ్యలు చేయడం. నటులు, వారి కుటుంబ సభ్యులు ఇలా సాఫ్ట్ టార్గెట్‌గా మారడం బాధిస్తోంది. ఇలాంటి పుకార్లకు స్వస్తి పలికి ప్రజలకు మేలు చేయడంపై దృష్టిపెట్టండి

- లావణ్య త్రిపాఠి



ముక్తకంఠంతో ఖండిస్తున్నాం

రాజకీయ లబ్ధి కోసం సినీతారల వ్యక్తిగత జీవితాలపై తప్పుడు ఆరోపణలు చేయడం ఆమోదయోగ్యం కాదు. మంత్రి కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం నిజంగా బాధాకరం. ఏ రంగంలోనైనా స్త్రీ ఉన్నత స్థానాన్ని చేరుకోవడం ఎంత కష్టమో ఓ మహిళగా మీకు తెలుసు. కానీ అలా ఎలా మాట్లాడారు? తన పార్టీలోని వారు తప్పుడు మాటలకు దూరంగా ఉండేలా రాహుల్‌గాంధీ చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారు కూడా ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. సురేఖ వ్యక్తిగత దూషణలను చిత్రపరిశ్రమ ముక్తకంఠంతో ఖండిస్తున్నది.

-నటుడు మంచు మనోజ్



ఒకరి కన్నీళ్లకు కారణం కావొద్దు

సినీ నటులు కూడా మనుషులే అనే విషయం గుర్తుంచుకోవాలి. వాళ్లకూ అన్ని రకాల భావోద్వేగాలుంటాయి. వార్తల్లో నిలిచేందుకు సెలబ్రిటీలపై కట్టుకథలను సృష్టించవద్దు. మీరు ఎవరిమీదైతే ఆరోపణలు చేశారో తానొక సూపర్‌స్టార్. ఎంతో కష్టపడి ఆ స్థాయికి చేరుకుంది. ఒక మాట అనే ముందు దాని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలి. ఒకర్ని మనం నవ్వించకున్నా ఫర్వాలేదు కానీ వారి కన్నీళ్లకు కారణం కాకూడదు

- విశ్వక్‌సేన్



కళాకారుల్ని రాజకీయాలకు బలి చేయొద్దు

కొండా సురేఖగారు ఓ ప్రముఖ సినీ కుటుంబంపై చేసిన వ్యాఖ్యల వల్ల రాజకీయంగా ఆమెకు ఎంతమేర లబ్ధి చేకూరిందో తెలీదుకానీ.. ఓ స్త్రీ ఆత్మాభిమానానికి, ఆ కుటుంబం పరువు, ప్రతిష్టలకు మాత్రం తీవ్రమైన నష్టం వాటిల్లిన మాట నిజం. మీ రాజకీయ అవసరాలకోసం తెరమీదే తప్ప జీవితంలో నటించడం తెలీని సున్నిత మనస్కులైన కళాకారులను బలి చేయొద్దు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు భవిష్యత్తులో రిపీట్ అవ్వకుండా జాగ్రత్తలు పడతారని ఆశిస్తున్నా.

- హీరో సాయిదుర్గతేజ్



చిల్లర మాటలకు ఇండస్ట్రీ భయపడదు

రాజకీయ లబ్ధి కోసం సినిమా తారలను పావులుగా వాడుకోవడం నిజంగా దురదృష్టకరం. మీలో ఫ్రస్టేషన్ ఎంతలా ఉందో ఆ వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయి. మీ చిల్లర మాటలకు ఇండస్ట్రీ ఏమాత్రం భయపడదు. తెలంగాణకు పేరు తెచ్చిన సినిమా ఇండస్ట్రీని నీ మాటలతో అవమానపరిచావు. ఇలాంటి గాసిప్‌లను క్రియేట్ చేయడం పక్కనబెట్టి పరిపాలనపై దృష్టి పెట్టండి. ఇప్పటికే మీ విలువ పడిపోయింది. దానిని మరింత దిగజార్చుకోవద్దు.

- సుధీర్‌బాబు.



ఐక్యంగా వ్యతిరేకిస్తున్నాం

దయచేసి కాస్త ఆలోచించి మాట్లాడండి. వ్యక్తిగత జీవితాలను ఇబ్బంది పెట్టేలా మాట్లాడటం నిజంగా అమర్యాదకరం. బాధ్యతగల పదవిలో ఉండి ఇలా మాట్లాడటం తగదు. అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకోం. ఇలాంటి దూషణలను ఐక్యంగా వ్యతిరేకిస్తున్నాం.

- నటుడు కిరణ్ అబ్బవరం



మమ్మల్ని రాజకీయాలకు దూరంగా ఉంచండి

నటీనటులపై మీకు ఇంత చులకన భావం ఉండటం నిజంగా బాధాకరం. కేవలం మూడు లక్షల మంది ఓట్లు వేస్తే మీరు ప్రజాప్రతినిధలయ్యారు. కానీ ఒక నటుడిగా ఎదగాలంటే వంద మిలియన్ల మంది నమ్మకాన్ని సంపాదించాలి. ముఖ్యంగా మీ కామెంట్స్‌లో స్త్రీలను కించపరచడం నిజంగా ఆమోదయోగ్యం కాదు. ఓ వైపు ప్రజలకు వినోదాన్ని అందిస్తూ, మరోవైపు సామాజిక సేవలో కూడా ముందు వరుసలో ఉంటూ, ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ సినిమావాళ్లనే కొందరు టార్గెట్ చేస్తున్నారు. మీ రాజకీయ లబ్ధికోసం మా వ్యక్తిగత జీవితాలను హరిస్తామంటే ఊరుకోం. మా జీవితాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని కోరుతున్నా. **-నటుడు తేజా సజ్జ**



మీరే మొదలుపెట్టారు.. ముగించాల్సింది కూడా మీరే

మీ రాజకీయ ప్రయోజనాలకోసం సినిమా వాళ్లను టార్గెట్ చేయడం తగదు. అక్కినేని కుటుంబంపై మీ వ్యాఖ్యలు చాలా బాధాకరం. ఏ విపత్తు వచ్చినా మేమున్నామంటూ ముందుండే సినిమా వాళ్లను ఇలా చులకన చేసి మాట్లాడటం చాలా తప్పు. సురేఖగారూ దీన్ని మీరే మొదలుపెట్టారు. సంస్కారవంతంగా దీన్ని ముగించాల్సింది కూడా మీరే.

-దర్శకుడు హరీశ్‌శంకర్



అన్ని రకాలుగా హద్దు మీరారు

అధికార స్థానాల్లో ఉన్నవారి నోటి నుంచి ఇలాంటి అసభ్యమైన మాటలు రావడం బాధాకరం. ఎలాంటి అధారాలు లేకుండా విచక్షణ మరచి సెలబ్రిటీల మీద వ్యాఖ్యలు చేయడం సరికాదు. అన్ని రకాలుగా హద్దులు మీరి వారి ప్రతిష్టకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించవద్దు. సినీ తారల గౌరవాన్ని కాపాడటానికి మనమంతా ముందుకురావాలి

- నితిన్



మా మనోభావాలను గౌరవించండి

స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖుల గురించి ప్రజల చేత ఎన్నుకోబడ్డ నాయకులే బహిరంగ వేదికపై ఇలా అవమానకరమైన ఆరోపణలు చేయడం నిజంగా బాధాకరం. దయచేసి చిత్రపరిశ్రమను, మా మనోభావాలను గౌరవించండి.

- సందీప్ కిషన్

అజర్‌కు ఈడీ నోటీసులు

హెచ్‌సీఏ అక్రమాలపై ఈడీ విచారణ షురూ

ఉప్పల్ పీఎస్‌లో కేసులు, ఏసీబీ ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈసీఐఆర్



హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం నోటీసులు జారీ చేసింది. హెచ్‌సీఏలో రూ.20 కోట్ల మోసంలో విచారణకు హాజరు కావాలని ఈడీ కోరింది. 2019 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. వీటికి తోడు ఉప్పల్ స్టేడియంలో హెచ్‌సీఏ అక్రమాలపై ఏసీబీ అధికారులు సైతం పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. వీటి ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. అజారుద్దీన్ పదవీ కాలంలో క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనే హెచ్‌సీఏలో అక్రమాలపై ఈడీ నజర్ పెట్టింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో హెచ్‌సీఏలోని అక్రమాలపై విచారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. కాగా ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌ను గత డిసెంబర్‌లో ఈడీ అధికారులు విచారించారు.

గతంలోనూ విచారణ..


ఇదే రూ.20 కోట్ల అంశానికి సంబంధించి హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌కు ఈడీ అధికారులు గత డిసెంబర్‌లో నోటీసులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో ఈడీ ఎదుట హాజరుకావాలని వినోద్‌కు నోటీసులు పంపి, విచారించారు. ఉప్పల్ స్టేడియం మరమ్మతుల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడి నిధులు స్వాహా చేశారని, అవినీతి నిరోధక శాఖ మూడు కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ఆధారంగా మనీ లాండరింగ్ చట్టం కింద మరో కేసును నమోదు చేసిన ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఇదే వ్యవహారంలో గత నవంబర్‌లో తెలంగాణ వ్యాప్తంగా 9 చోట్ల సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలు, రూ.10,39,000ల నగదును ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

హార్దిక్‌కు అంత సీనుందా?

ముంబై: ఐపీఎల్ తర్వాతి సీజన్ కోసం త్వరలో నిర్వహించబోయే వేలానికి ముందు ఆయా జట్లు తాము అట్టిపెట్టుకునే (రిటెన్షన్) ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో ఏ ఏ ఫ్రాంచైజీలు ఎవరెవరిని రిటైన్ చేసుకుంటాయనే దానిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐదుసార్లు ఐపీఎల్ విజేత ముంబై ఇండియన్స్ తమ సారథి హార్దిక్ పాండ్యాను రూ. 18 కోట్లు ఇచ్చి రిటైన్ చేసుకుంటుందా? అంటూ సన్‌రైజర్స్ మాజీ కోచ్ టామ్ మూడీ అభిప్రాయపడ్డాడు. ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మూడీ మాట్లాడుతూ.. 'హార్దిక్ పాండ్యా రూ. 18 కోట్ల విలువ చేసే ఆటగాడా? అతడికి అంత సామర్థ్యం ఉందా? ఆ స్థానంలో తీసుకున్న ఆటగాడు మ్యాచ్ విన్నర్ అయి ఉండాలి. కానీ గతేడాది పాండ్యా ముంబైని నడిపించిన తీరు, అతడి వ్యక్తిగత ప్రదర్శన నిరాశజనకంగా ఉంది. నేనైతే రూ. 18 కోట్ల జాబితాలో బుమ్రా, సూర్యను ఎంచుకుంటాను. హార్దిక్‌కు రూ. 14 కోట్లు చాలు' అని అభిప్రాయపడ్డాడు.

అభిమన్యు శతకం

దీటుగా బదులిస్తున్న రెస్టాఫ్ ఇండియా



లక్నో: ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై జట్టు సాధించిన భారీ స్కోరు (537)కు రెస్టాఫ్ ఇండియా (ఆర్‌వోఐ) కూడా దీటుగా బదులిస్తోంది. లక్నో వేదికగా జరుగుతున్న మ్యాచ్ మూడో రోజు ఆటలో భాగంగా ఆ జట్టు 74 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. అభిమన్యు ఈశ్వరన్ (212 బంతుల్లో 151 నాటౌట్, 12 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో మెరిశాడు. ఇషాన్ కిషన్ (38) ఫర్వాలేదనిపించగా వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (30 బ్యాటింగ్) నిలకడగా ఆడుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆర్‌వోఐ ఇంకా 248 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 536/9తో మూడో రోజు ఆట ప్రారంభించిన ముంబై ఒక్క పరుగు మాత్రమే జత చేసి ఆలౌట్ అయింది.

ఖుషీకి కాంస్యం



లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ ఖుషీ కపూర్ కాంస్యం నెగ్గింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ (3పీ) ఫైనల్‌లో ఆమె.. 447.3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్యం సాధించింది. నార్వే అమ్మాయిలు సిన్నొవె బెర్గ్ (458.4), కరోలిన్ లండ్ (458.3) వరుసగా స్వర్ణం, రజతం గెలుచుకున్నారు. ఈ టోర్నీలో భారత్ ఇప్పటి దాకా 10 స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్యాలు సాధించి 15 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

ధోనీ కోసం 1500 కి.మీ. సైకిల్ యాత్ర



రాంచీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీని కలిసేందుకు గౌరవ్ కుమార్ అనే అభిమాని ఢిల్లీ నుంచి రాంచీ దాకా సుమారు 1500 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేశాడు. ధోనీని కలుసుకునేందుకు గాను రాంచీలోని ధోనీ ఫామ్ హౌస్‌కు చేరుకున్న అతడు.. వారం రోజుల పాటు దాని ముందే చిన్న టెంట్ వేసి నిరీక్షించాడు. తన సోదరుడి ద్వారా విషయం తెలుసుకున్న మహీ ఎట్టకేలకు అతడిని కలిశాడు. ఈ సందర్భంగా ధోనీ అతడికి సంతకం చేసిన జెర్సీని అందించాడు.

సెమీస్‌కు గాఫ్

బీజింగ్: అమెరికా యువ టెన్నిస్ క్రీడాకారిణి కోకో గాఫ్ చైనా ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ గాఫ్.. 2-6, 6-2, 6-2తో యులియా స్టరొడుబ్ట్సెవ (ఉక్రెయిన్)ను ఓడించింది. మరో క్వార్టర్స్‌లో పౌలా బడోస.. 6-1, 7-6 (7/4)తో చైనాకు చెందిన ఝుంగ్ షుయయ్‌ను చిత్తుచేసింది. సెమీస్‌లో బడోస.. గాఫ్‌తో తలపడనుంది.

పాక్, బంగ్లా బోణీ

స్కాట్లాండ్‌పై బంగ్లాదేశ్ గెలుపు • లంకను చిత్తుచేసిన పాకిస్థాన్

తొలి రోజే స్పిన్నర్ల హవా • మహిళల టీ20 ప్రపంచకప్

యూఏఈ వేదికగా ఐసీసీ నిర్వహిస్తున్న మహిళల టీ20 ప్రపంచకప్ గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. స్పిన్‌కు అనుకూలించే షార్జాలో జరిగిన మొదటి రోజు రెండు 'లో స్కోరింగ్' మ్యాచ్‌లలో బౌలర్లు వికెట్ల పండుగ చేసుకోగా బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్.. స్కాట్లాండ్‌ను ఓడించి గెలుపు బోణీ చేసింది. మరో మ్యాచ్‌లో పాకిస్థాన్.. శ్రీలంకను ఓడించి ఈ టోర్నీని విజయంతో మొదలుపెట్టింది. రెండు మ్యాచ్‌లలోనూ స్పిన్నర్లకే ఎక్కువ వికెట్లు దక్కాయి.



షార్జా: మహిళల ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్, పాకిస్థాన్ బోణీ కొట్టాయి. ఇరు మ్యాచ్‌లలోనూ స్పిన్నర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించడంతో ఆసియా జట్లు శుభారంభం చేశాయి. గురువారం షార్జా వేదికగా గ్రూప్-బీలో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బంగ్లా 16 పరుగుల తేడాతో గెలుపొందింది. బ్యాటింగ్‌లో విఫలమైనా ఆ జట్టు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బంగ్లా శుభారంభం చేసింది. ఇక గ్రూప్-ఏలో శ్రీలంకతో తలపడ్డ పాకిస్థాన్ కూడా స్పిన్‌తో ప్రత్యర్థిని దెబ్బకొట్టి 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాక్.. 20 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌట్ అయింది. పాక్ సారథి ఫాతిమా సనా బ్యాట్ (30)తో పాటు బంతి (2/10)తోనూ రాణించి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఛేదనలో లంక కూడా తడబడి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 85 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో నీలాక్షి డి సిల్వ (22), విష్మి గుణరత్నె (20) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. సనాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బంగ్లా బోణీ:

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ఆ జట్టులో సోభనా మొస్త్రి (38 బంతుల్లో 36, 2 ఫోర్లు), శాంతి రాణి (32 బంతుల్లో 29, 3 ఫోర్లు) రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో సస్కియ హార్లీ (3/13) ఆకట్టుకుంది. 120 పరుగుల ఛేదనలో స్కాట్లాండ్ 103 పరుగుల వద్దే ఆగిపోయింది. ఓపెనర్ సారా బ్రైస్ (52 బంతుల్లో 49 నాటౌట్, 1 ఫోర్) చివరిదాకా పోరాడినా తన జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయింది. బంగ్లా బౌలర్లు రితూ మోనీ (2/15) మరుఫా అక్తర్ (1/17), నహిదా అక్తర్ (1/19) స్కాట్లాండ్‌ను కట్టడిచేశారు. రితూకే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. 2014 టీ20 ప్రపంచకప్‌లో గెలిచిన తర్వాత ఈ టోర్నీలో బంగ్లాకు పదేండ్ల అనంతరం ఇదే తొలి విజయం కావడం గమనార్హం.

పాక్‌ను గట్టెక్కించిన స్పిన్నర్లు..

ఈ ఏడాది మహిళల ఆసియా కప్ గెలిచిన ఊపు మీదున్న శ్రీలంకకు ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లోనే షాక్ తగిలింది. ఆ జట్టు బ్యాటర్లు విఫలమైనా బౌలర్లు రాణించడంతో పాక్ గట్టెక్కింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు వచ్చిన పాకిస్థాన్‌కు చమారీ సేన తమ బౌలింగ్‌తో చుక్కలు చూపించింది. చమారి ఆటపట్టు (3/18), సుగందిక (3/19), ప్రబోధని (3/20) తలా మూడు వికెట్ల చొప్పున పడగొట్టారు. పాక్ బ్యాటర్లలో ఫాతిమా సనా ఒక్కతే ఉన్నంతలో మెరుగ్గా ఆడింది. అనంతరం ఛేదనలో లంకేయులు క్రీజులోకి అలా వచ్చి ఇలా వెళ్లారు. పాక్ బౌలర్లలో సదియా ఇక్బాల్ (3/17) మూడు వికెట్లు పడగొట్టగా నష్రా సంధు (2/15), ఒమైమ సొహైల్ (2/17) లంకను కోలుకోనీయకుండా చేశారు.

సంక్షిప్త స్కోరు

బంగ్లాదేశ్ : 20 ఓవర్లలో 119/7 (సోభనా 36, శాంతి 29, సస్కియ 3/13)
స్కాట్లాండ్ : 20 ఓవర్లలో 103/7 (సారా 49 నాటౌట్, రితూ 2/15)
పాకిస్థాన్ : 20 ఓవర్లలో 116 ఆలౌట్ (ఫాతిమా 30, నిదా 23, చమారి 3/18, సుగందిక 3/19)
శ్రీలంక: 20 ఓవర్లలో 85/9 (విష్మి 20, నీలాక్షి 22, సదియా 3/17, ఫాతిమా 2/10)



స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ గురువారం ఎల్బీ స్టేడియంలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన దృశ్యం

ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా..

అట్టహాసంగా సీఎం కప్ టోర్నీ ఆరంభం

లోగో, మస్కట్ ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆట ప్రతినిధి: పల్లెల నుంచి ప్రపంచస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని అన్నారు. గురువారం ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ వేదికగా సీఎం కప్ టోర్నీ ప్రారంభ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా టోర్నీ లోగోతో పాటు మస్కట్(నీలమణి)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'రానున్న రోజుల్లో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ క్రీడాటోర్నీలకు వేదికగా మారుస్తాం. ఇటీవలి పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశపరిచినా.. 2028 ఒలింపిక్స్‌లో కచ్చితంగా తెలంగాణ నుంచి పతకాలు సాధించాలి. అందుకోసం ప్రతిభ కల్గిన ప్లేయర్లకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుంది. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి ప్రపంచ విజేతగా నిలిచిన నిఖత్ జరీన్ మీకు ఆదర్శం. యువత వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లాలి. అన్ని మతాలకు ఏకైక వేదిక క్రీడా మైదానం'అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడాసలహాదారు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.